www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

ప్రజాపక్షం 7th ANNIVERSARY 22nd October, 2025

PRAJAPAKSHAM ★★★★

సంపుటి 08, సంచిక: 352 | ఆదివారం | 23-11-2025 | ఖమ్మం

Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12+8 | వెల రూ. 5.00


మరణ మృదంగం మోగిస్తున్న 'సర్'

కేరళలో వేగవంతమైన 'సర్'పై రాజకీయ పార్టీల ఆందోళన

డిఎంకెతో సీట్ల పంపకాలపై చర్చలకు ఐదుగురు సభ్యులతో కమిటీ 05



అంతర్జాతీయ ఆయుధ స్మగ్లింగ్ రాకెట్ గుట్టురట్టు

నలుగురి అరెస్టు 05



'పూర్తి సంతృప్తి'తో వెళుతున్నా

52వ భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్ 05



బూటకపు ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే

ప్రజాస్వామ్య గొంతుక నులిమేస్తున్నారు 03




## 37 మంది మావోయిస్టులు

# లొంగుబాటు

వనం వీడిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యులు ఆజాద్, రమేష్, ఎర్ర, డివిజన్, ఏరియా కమిటీ సభ్యులు : ఆయుధాలు అప్పగింత

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో మావోయిస్టు ఉద్యమానికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. తెలంగాణ పోలీసుల ముందు 37 మంది మావోయిస్టులు ఆయుధాలతో సహా లొంగిపోయారు. వీరిలో 25 మంది మహిళలు, 12 మంది పురుషులు ఉన్నారు. లొంగిపోయిన వారిలో రాష్ట్ర కమిటి సభ్యులుగా ఉన్న కొయ్యద సాంబయ్య అలియాస్ అజాద్ (49), అప్పాసి నారాయణ అలియాస్ రమేష్ (70), ముచ్చకి సోమడా అలియాస్ ఎర్రలతో పాటు మిగతా 34 మంది జిల్లా కమిటీ సభ్యులు, ఏరియా కమిటీ సభ్యులు ఉన్నారు. వీరి వద్ద ఉన్న ఒక ఎకె47 తుపాకీ, రెండు ఎస్ఎల్ఆర్‌లు, నాలుగు 303తుపాకీలు, జి3 తుపాకీతో పాటు వివిధ కాలిబర్లకు చెందిన 346 తూటాలు పోలీసులకు అప్పగించి మావోయిస్టు పార్టీని వీడి జన జీవన స్రవంతిలో కలిశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఇంటెలిజెన్స్ అదనపు డిజి విజయ్ కుమార్, ఎస్ఐబి చీఫ్ బి.సుమతిలతో కలిసి డిజిపి బి.శివధర్‌రెడ్డి తన కార్యాలయంలో మీడియాకు వివరాలు వెల్లడించారు.లొంగిపోయిన వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులకు పునరావాస ప్రయోజనం క్రింద రూ.20 లక్షల చొప్పున అందజేశారు. మిగతా 34 మందికి డివిసిఎం ర్యాంక్‌కు చెందిన కేడర్లకు రూ.5 లక్షల చొప్పున, ఎసిఎం కేడర్‌కు చెందిన వారికి రూ.4 లక్షల చొప్పున, పార్టీ సభ్యులకు తరువాయి 2లో



## పెన్నుపై మన్ను కప్పితే...

# గన్నై గడీలను కూల్చింది

- తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవులు, కళాకారులదే కీలక పాత్ర
- తెలంగాణ సమాజం చైతన్యవంతమైనది..
- ఎంత అమాయకంగా కనిపించినా అవసరమైనప్పుడు పోరాట పటిమను ప్రదర్శిస్తుంది
- తెలంగాణ చరిత్రలో అందెశ్రీ ఒక కోహినూర్ వజ్రం
- సంస్మరణ సభలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ ఉద్యమంలో స్ఫూర్తిని నింపిన కవులు, కళాకారుల గానం రాష్ట్రంలో వినిపించకుండా కుట్ర చేశారని, పెన్నులపైన మన్ను కప్పితే గన్నులై మొలకెత్తుతాయని, గడీలను కూల్చుతాయని అందెశ్రీ నిరూపించారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనియాడారు. ఇప్పుడు తెలంగాణ నాలుగుకోట్ల ప్రజలు జయ జయ హే తెలంగాణ పాటను నిత్యం పాడుకుంటున్నారని, తెలంగాణ సమాజం తరువాయి 2లో

## తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు

# భారీ ఏర్పాట్లు

- అంతర్జాతీయ స్థాయిలో ఉత్సవం
- ఫ్యూచర్ సిటీలో సువిశాల ప్రాంగణం, భారీ వేదిక
- డాక్యుమెంట్‌కు తుది మెరుగులు
- 25వ తేదీ నుంచి విభాగాల వారీగా ముఖ్యమంత్రి సమీక్ష సమావేశాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

TELANGANA RISING

హైదరాబాద్‌లో డిసెంబర్ 8, 9 తేదీలలో నిర్వహించే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు ఘనంగా ఏర్పాట్లు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీ ఏరియాలో నిర్వహించే రెండు రోజుల వేడుకలను రెండేండ్ల విజయోత్సవాలుగా జరపాలని సూచించారు. గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపై శనివారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి సిఎంఓ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సిఎంఓ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రితో పాటు సిఎంఓ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ల తరువాయి 2లో



# విద్యా వ్యవస్థలో సమూల మార్పు

- అదే మా ప్రభుత్వ సంకల్పం
- నేటి అవసరాలకు అనుగుణంగా యువతను అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులుగా తీర్చిదిద్దుతాం
- స్కిల్లింగ్, రీ- స్కిల్లింగ్, అప్ – స్కిల్లింగ్‌పై ఫోకస్
- 'జెఎన్‌టియు హెచ్ గ్లోబల్ అల్యూమ్ని మీట్'లో మంత్రి శ్రీధర్ బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్

విద్యా వ్యవస్థలో సమూల మార్పు తేవాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. నేటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ యువతను అత్యుత్తమ నైపుణ్యమున్న మానవ వనరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్‌పై తరువాయి 2లో

## ఐబొమ్మ కేసులో

# రంగంలోకి సిఐడి

- ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్ల ప్రమోషన్ కోణంలో విచారణ
- మూడో రోజు రవిని కస్టడీకి తీసుకున్న హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఐబొమ్మ కేసులో దర్యాప్తు మరింత వేగవంతమైంది. ఈ కేసులోకి తాజాగా తెలంగాణ సిఐడి అధికారులు ప్రవేశించారు. ఐబొమ్మ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ సైట్లను ప్రమోట్ చేసిన వ్యవహారంపై సిఐడి దృష్టి సారించింది. ఇప్పటికే బెట్టింగ్ ప్రమోషన్ కేసులను దర్యాప్తు చేస్తున్న సిఐడి, ఈ కేసులో కీలక సమాచారం రాబట్టేందుకు తరువాయి 2లో

## పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లకు

# మార్గదర్శకాలు జారీ



- 50 శాతం దాటకుండా ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లు ఖరారు
- మహిళలకు 50 శాతం వరకు కోటా
- రాష్ట్ర ప్రభుత్వం జిఒ విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్‌లపై జరుగుతున్న చర్చకు కాంగ్రెస్ సర్కార్ తెర దింపింది. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్‌ల విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50 శాతం మించకుండా రిజర్వేషన్‌లు కల్పించేలా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు శనివారం జి.ఓను విడుదల చేసింది. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు చేసింది. రిజర్వేషన్‌ల ఖరారు కోసం పంచాయతీ రాజ్ శాఖ జి.ఓ విడుదల చేసింది. పంచాయతీరాజ్ జి.ఓ ప్రకారం రిజర్వేషన్‌లను జిల్లా కలెక్టర్లు ఖరారు చేయనున్నారు. 50 శాతం రిజర్వేషన్లు దాటకుండా ఎస్‌సి, ఎస్‌టి, బిసి రిజర్వేషన్లు ఖరారు చేస్తూ నిర్ణయం తీసుకుంది. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన ఈ జి.ఓ ప్రకారం బిసిలకు సర్పంచ్, వార్డు స్థానాల్లో 23 శాతం రిజర్వేషన్లు దక్కనున్నాయి. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 244 ప్రకారం షెడ్యూల్ ఏరియాల్లో రిజర్వేషన్లను అమలు చేయనున్నట్లు జి.ఓలో స్పష్టం చేసింది. ఇక మహిళలకు 50 శాతం వరకు రిజర్వేషన్లకు కల్పించాలని నిర్ణయించింది. గత (2019) ఎన్నికల్లో ఏ కేటగిరీకి రిజర్వేషన్లు తరువాయి 2లో



## రామాలయం మునిగే ప్రమాదమున్నా

# చోద్యం చూస్తారా?

- నీటిపారుదల నిపుణుల హెచ్చరికలను పట్టించుకోరా?
- రాష్ట్ర విభజన సమయంలో ఎపిలో కలిపిన ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలి
- సిపిఐ జాతా ముగింపు సభలో నాయకుల డిమాండ్

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

పోలవరం ప్రాజెక్టు పూర్తయితే భద్రాచలం రామాలయం నీటిలో మునిగిపోయే ప్రమాదం ఉందని నీటి పారుదల నిపుణులు చెబుతున్నారని, ఈ విషయంపై దృష్టి సారించకుండా చోద్యం చూడటం సరైంది కాదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి హితవు పలికారు. అవిభక్త తరువాయి 12లో



## చర్లగూడెం రిజర్వాయర్‌కు

# ధర్మభిక్షం పేరు

- ప్రభుత్వంతో చర్చించి నామకరణం చేసేలా కృషిచేస్తాం
- తాటి, ఈత మొక్కలు పెంచేందుకు కల్లుగీత సంఘాలు ముందుకురావాలి : మంత్రి పొన్నం
- స్వాతంత్ర్య పోరాటంలో ధర్మభిక్షం కీలక పాత్ర : పల్లా వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం 45 లక్షల తాటి, ఈత మొక్కలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నదని, వాటి పెంపకానికి కల్లుగీత సంఘాలు ముందుకు రావాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. మొక్క నాటేందుకు, దానిని పెంచేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆర్థిక సాయం చేస్తుందని తెలిపారు. గీత పనివారల సంఘం వ్యవస్థాపకులు, మాజీ ఎంపి బొమ్మగాని ధర్మభిక్షం అంటే తనకెంతో గౌరవమని, ప్రభుత్వంతో చర్చించి మర్రిగూడ మండలం చర్లగూడెం రిజర్వాయర్‌కు ధర్మభిక్షం పేరు పెట్టే విధంగా కృషి చేస్తామన్నారు. హైదరాబాద్ బషీర్ బాగ్‌లోని దేశోద్ధారక భవన్ లో శనివారం తెలంగాణ గీత పనివారల సంఘం రాష్ట్ర సదస్సు జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్యఅతిథిగా తరువాయి 12లో

## మూఢనమ్మకాలతో కుటుంబం ఆత్మహత్య

అంబర్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధిలో ఘటన

ప్రజాపక్షం/హైదరాబాద్

మూఢనమ్మకాలతో ఒక కుటుంబం సామూహికంగా ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం అంబర్‌పేట్ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రామ్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్, విజయలక్ష్మి దంపతులు. వీరికి కూతురు శ్రావ్యతో పాటు తరువాయి 2లో

## ప్రస్తుత అభివృద్ధి నమూనాలతో

# ప్రకృతి దోపిడీ



- పర్యావరణానికి హాని కలిగించే అభివృద్ధి నమూనాలు మారాలి
- వాటిపై పునఃసమీక్షకు ఇదే సరైన తరుణం
- జి– 20 సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు


**జోహన్నెస్‌బర్గ్ :** ప్రపంచాభివృద్ధికి పాటించే నమూనాలు, ప్రగతి నిర్వచన నమూనాలపై చాలా లోతైన గాఢతతో పునరాలోచన చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ జి–20 సదస్సులో పిలుపు ఇచ్చారు. ప్రస్తుత అభివృద్ధి నమూనాలతో ప్రకృతి దోపిడీకి గురవుతోందని, పర్యావరణానికి తీవ్ర హాని కలుగుతోందని అన్నారు. ఉగ్రవాదులకు–మాదక ద్రవ్యాల రవాణాకు మధ్య ఉన్న అనుబంధాన్ని తెంపేయడంతో సహా నాలుగు ప్రధానాంశాలను సదస్సు ముందుకు తెచ్చారు. ప్రకృతి వనరులను విపరీతంగా దోపిడీ చేయడంవల్ల ఆఫ్రికాఖండం బలైపోతోందని, అభివృద్ధి నమూనాల పునఃసమీక్షకు ఇదే సరైన తరుణమని అన్నారు. భారత నాగరిక విలువలలో భాగంగా ఉన్న సమగ్ర తరువాయి 2లో

# ప్లాన్‌కు ఒప్పుకోవాల్సిందే

- ఉక్రేన్‌కు ట్రంప్ గడువు!
- నిర్ద్వంద్వంగా తిరస్కరించిన జెలెన్‌స్కీ
- జి– 20లో నేడు యూరప్ మిత్రుల కీలక భేటీ

**వాషింగ్టన్:** రష్యాతో యుద్ధం ముగించేందుకు రూపొందించిన ముసాయిదా ప్రణాళికను ఉక్రేన్ అంగీకరించాల్సిందేనని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పట్టుపట్టారు. 28 అంశాలతో రూపొందించిన ప్రణాళికను సమ్మతించేందుకు ఉక్రేన్‌కు ఈనెల 27వ తేదీ వరకూ గడువు విధించారు. ప్రతిపాదిత ప్రణాళికపట్ల రష్యా అధ్యక్షుడు పుతిన్ హర్షం ప్రకటించారు. ట్రంప్ గనుక ఉక్రేన్, యూరోపియన్ యూనియన్‌లను ఒప్పించగలిగితే తరువాయి 2లో





# ప్రపంచం
WORLD NEWS

## అమెరికాలో బర్డ్ ఫ్లూ
### మొదటిసారి ఒక వ్యక్తి మృతి

**వాషింగ్టన్:** అమెరికాలో బర్డ్ ఫ్లూ కారణంగా మొట్టమొదటిసారి ఒక మనిషి మరణించాడు. అమెరికా ప్రభుత్వ ఆరోగ్యవిభాగం వాషింగ్టన్ నుండి ఈ మేరకు మాత్రమే సమాచారాన్ని విడుదల చేసింది తప్ప ఇంతకుమించి ఇతర వివరాలు వెల్లడించలేదు. గడచిన ఏడాదికాలంగా బర్డ్ ఫ్లూ కూడా మనుషులకు సోకుతున్నది. ఈ విధంగా దాదాపు 70 మంది హెచ్ 5 ఎన్ 5 బర్డ్ ఫ్లూకు గురయ్యారుకానీ ఇంతవరకూ ఎవ్వరూ మరణించలేదు. ఎవియన్ ఇన్‌ఫ్లూయన్‌జా అని పిలిచే ఈ బర్డ్ అనేక దశాబ్దాలుగా అమెరికాలో జంతువులకు సోకుతున్నది. జంతు మరణాలు సంభవిస్తున్నాయి. కానీ బర్డ్ ఫ్లూ కారణంగా అమెరికాలో మొదటి మరణం కేసు ఇదే. మరిన్ని మమ్మేలియా జాతి (పాలిచ్చే జాతి జీవజాలం) జీవులకు ఈ వ్యాధి సోకుతున్నది. సదరు వ్యక్తి ఇల్లంతా ఒక పక్షి కేంద్రంగా ఉంటుందని, ఆయన అందుకు తగినవిధంగా ఎలాంటి జాగ్రత్తలూ తీసుకోలేదనీ అధికారవర్గాల సమాచారం. ఇప్పటివరకూ బర్డ్ ఫ్లూ సోకినవారిలో సగంమందికి హెచ్ 5 ఎన్ 1 వైరస్ సోకింది. హెచ్ 5 ఎన్ 5 వైరస్ ఇప్పటివరకూ జంతువులకే సోకింది గానీ మనుషులకు సోకలేదు.

## ఓవల్ ఆఫీస్‌లో మొదటిసారి మమ్దానీ భేటీ
### భారత్-పాక్ సహా 8 శాంతి ఒప్పందాలు చేశా : ట్రంప్

**న్యూయార్క్/వాషింగ్టన్:** న్యూయార్క్ నగర మేయర్ గా ఎన్నికై చరిత్ర సృష్టించిన జోహ్రాన్ మమ్దానీ శనివారం మొదటిసారి వాషింగ్టన్ వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. ఆయన సమక్షంలోనే పాత్రికేయులతో మమ్దానీ మాట్లాడారు. తమ మధ్య సమావేశం ఎంతో హృదయపూర్వకంగా జరిగిందన్నారు. వారి మధ్య వైరుధ్యాలు ఉన్నప్పటికీ వాటి గురించి ప్రస్తావించకుండా ఉమ్మడి లక్ష్యాలు న్యూ యార్క్ అభివృద్ధికి దోహదపడతాయని పదే పదే మమ్దానీ చెప్పారు. గతంలో మమ్దానీని 'నూటికి నూరుశాతం కమ్యూనిస్టు పిచ్చివాడు'గా అభివర్ణించిన ట్రంప్ మాట్లాడుతూ, మమ్దానీ తనను ఎంతగానో ఆకట్టుకున్నాడన్నారు. ట్రంప్ ఒక నిరంకుశాధికారి అని ఎన్నికల ప్రచార సమయంలో మమ్దానీ విమర్శించా రు. ఇదిలా ఉండగా మమ్దానీతో ఓవల్ ఆఫీస్‌లో సమావేశం సందర్భంగా ట్రంప్ మరోసారి భారత్-పాకిస్థాన్ అంశాన్ని ముందుకు తెచ్చారు.

## గడీలను కూల్చింది (మొదటి పేజీ తరువాయి)

చైతన్యవంతమైనది, ఎంత అమాయకంగా కనిపించినా అవసరమైనప్పుడు పోరాట పటిమను ప్రదర్శిస్తుందని గుర్తుచేశారు. 'జయజయహే తెలంగాణ' రాష్ట్ర గీతం చరయిత, ప్రముఖ కవి, అందెశ్రీ సంస్మరణ సభ శనివారం రవీంద్ర భారతిలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ అధ్యక్షతన జరిగింది. సభలో అందెశ్రీ చిత్రపటానికి సిఎం పుష్పాంజలి ఘటించారు. కవులు ఎంత మంది ఉన్నా తెలంగాణ చరిత్రలో అందెశ్రీ ఒక కోహినూర్ వజ్రంలా నిలిచిపోతారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బడి మొహం ఎరుగని అందెశ్రీ జయజయహే తెలంగాణ పాట రాసి ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిని అందించడంతో పాటు ప్రతి తెలంగాణ గుండెకు అందెశ్రీ దగ్గరయ్యారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన అనంతరం జయజయహే తెలంగాణ పాటను రాష్ట్ర అధికార గీతంగా అందరూ భావించారు. కానీ, ఆనాటి పాలకులు దాన్ని అమలు చేయలేదన్నారు. దీంతో పదేళ్లు జయజయహే తెలంగాణ పాట మూగబోయిందని, అధికారం శాశ్వతం అని వారు భావించడం వారి మూర్ఖత్వం అని సిఎం అన్నారు. రాచరికం, ఆధిపత్యం హద్దు మీరినప్పుడు కవులు, కళాకారులు తమ గొంగడి దుమ్ము దులిపి పోరాటంలోకి దూకారని, నిజాంకు వ్యతిరేకంగా బండి యాదగిరి బండెనక బండి కట్టి అని గళం విప్పితే సర్కార్ పీఠం కదిలిందని చెప్పారు. తెలంగాణ విముక్తి కోసం సమైక్యవాదులకు వ్యతిరేకంగా గద్దర్, గూడా అంజన్న, అందెశ్రీ, గోరటి వెంకన్న మలిదశ ఉద్యమానికి పునాదులు వేశారని గుర్తుచేశారు. అందెశ్రీ కుటుంబాన్ని ఆదుకోవడం నా బాధ్యత అని, తెలంగాణలో ప్రజా పాలన రావాలని గద్దర్, అందె శ్రీ కోరుకున్నారని తెలిపారు. అందెశ్రీకి నివాళిగా వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు అందెశ్రీ స్మృతి వనాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఆయన రచించిన నిప్పుల వాగు అనే పుస్తకాన్ని ప్రతి గ్రంథాలయంలో ఉండేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశంలో వర్గీకరణ అమలు చేసిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని, వర్గీకరణ అమలు వల్ల దళితుల్లో అత్యంత వెనుకబడిన వాళ్లు డాక్టర్లు అవుతున్నారని తెలిపారు. ప్రస్తుత మంత్రి వర్గంలో నలుగురు దళిత మంత్రులతో పాటు దళిత స్పీకర్ కూడా ఉన్నారని, దళితుల అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో మంత్రులు సి.దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, టిజెఎస్ పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కొదండరామ్, మాజీ ఎంపి వి.హనుమంత రావు, మోత్కుపల్లి నర్సింహులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు. అందెశ్రీ సంస్మరణ సభ సందర్భంగా 33 జిల్లాల నుంచి తరలి వచ్చిన కళాకారుల ఆట, పాట, డప్పు దరువులతో రవీంద్రభారతి ప్రాంగణం మారుమ్రోగింది.

## భారీ ఏర్పాట్లు (మొదటి పేజీ తరువాయి)

పూర్తయినందున, రెండేండ్ల విజయోత్సవాలను ప్రతిబింబించేలా ఫ్యూచర్ సిటీలో విశాలమైన ప్రాంగణంలో భారీ వేదిక ఏర్పాటు చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. గ్లోబల్ సమ్మిట్ అందరినీ ఆకట్టుకునే అంతర్జాతీయ స్థాయి ఉత్సవాన్ని తలపించాలని అన్నారు. డిసెంబర్ 8వ తేదీ, తొలి రోజున ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల విజయాన్ని చాటి చెప్పాలని, ఇందుకు పండుగ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాట్లు జరగాలని సిఎం అన్నారు. అదే విధంగా 9వ తేదీ రెండో రోజున తెలంగాణ భవిష్యత్తు దార్శనికతను, భవిష్యత్తు ప్రణాళికలను పొందుపరిచిన 'తెలంగాణ రైజింగ్-2047 డాక్యుమెంట్'ను ఆవిష్కరించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇదే ప్రాంగణంలో తెలంగాణలో పారిశ్రామిక విధానాన్ని, పెట్టుబడులకు ఇస్తున్న ప్రాధాన్యతను ప్రపంచానికి చాటిచెప్పే విధంగా రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాలు తమ భవిష్యత్తు లక్ష్యాలన్నింటినీ కళ్లకు కట్టించే ఆడియో వీడియో ప్రదర్శనలు, ప్రజెంటేషన్లు తయారు చేసుకోవాలని సిఎం సూచించారు. దేశ విదేశాలకు చెందిన ప్రముఖులు, అన్ని రంగాల్లో పేరొందిన పారిశ్రామికవేత్తలను ప్రత్యేకంగా ఆహ్వానించాలని, వేడుకలకు వచ్చిన అతిథులకు తగిన వసతి సదుపాయాలతో పాటు అత్యున్నత భద్రత కల్పించాలని, ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా చూడాలని, అన్ని విభాగాలు సమన్వయంతో ఈ వేడుకలను విజయవంతం చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దటంలో క్రియాశీల పాత్ర పోషించాల్సిన అన్ని విభాగాలు గ్లోబల్ సమ్మిట్‌లో కీలకంగా పాలుపంచుకోవాలని సిఎం ఆదేశించారు. భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకోవటం, రైజింగ్ డాక్యుమెంట్‌లో పొందుపరిచే ప్రతి అంశంపై లోతైన అధ్యయనం చేసుకోవాలని అధికారులను సిఎం అప్రమత్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలను దిశానిర్దేశం చేసే ఈ డాక్యుమెంట్‌లో పొందుపరిచిన అంశాలపై సంబంధిత విభాగాలతో ఈనెల 25 నుంచి వరుసగా సమీక్షలు నిర్వహించనున్నట్లు సిఎం తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లతో పాటు రెండేండ్ల ప్రగతి, తెలంగాణ రైజింగ్ 2047లో వివిధ విభాగాల పాత్రపై ప్రధానంగా సమీక్ష జరుపుతామన్నారు. ఇప్పటికే ప్రజల అభిప్రాయాలు, సలహాలు సూచనలతో పాటు అన్ని రంగాల్లోని నిపుణుల దూరదృష్టితో తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ 2047 రూపకల్పన జరిగిందన్నారు. వివిధ విభాగాల అధికారులతో నిర్వహించే సమీక్షలలో వచ్చే విలువైన సలహాలు, నిర్దిష్టమైన సూచనలను పొందుపరిచి డాక్యుమెంట్‌కు తుదిరూపం ఇస్తామని సిఎం వెల్లడించారు.

## జారీ (మొదటి పేజీ తరువాయి)

కేటాయించారో, వాటిని పరిగణనలోకి తీసుకుని తాజా రొటేషన్ ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని పేర్కొంది. మహిళల రిజర్వేషన్ అన్ని కేటగిరిలలో ప్రత్యేకంగా లెక్కించి అమలు చేయాలి. గ్రామ పంచాయతీ, వార్డుల సంఖ్య తక్కువైతే, మొదట మహిళా ప్రాధాన్యత ఆ తరువాత లాటరీ పద్ధతి పాటించాలి. ఇక వార్డు మెంబర్లకు 2024 కుల సర్వే ఆధారంగా, సర్పంచులకు 2011 సెన్సస్ ఆధారంగా( బిసి సర్పంచ్ అభ్యర్థులకు 2024 కుల సర్వే) రిజర్వేషన్లు కల్పించింది. వార్డు రిజర్వేషన్‌ల నిర్ణయం ఎంపిడిఓ, సర్పంచ్ రిజర్వేషన్ ఆర్‌డిఓ ఆధ్వర్యంలో జరగాలి. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎలక్షన్ అథారిటిలను చర్యలు తీసుకోవాలని ఆదేశాల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది.

## రంగంలోకి సిఐడి (మొదటి పేజీ తరువాయి)

సిద్ధమైంది. ఈ క్రమంలో నిందితుడు రవికి సంబంధించిన పూర్తి వివరాలను అందించాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను కోరింది. మరోవైపు సైబర్ క్రైమ్ పోలీసులు రవిని మూడో రోజు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇవాళ కూడా విచారణ కొనసాగనుంది. నిన్న దాదాపు ఆరు గంటల పాటు సాగిన విచారణలో పలు కీలక వివరాలను సేకరించినట్లు తెలుస్తోంది. ఐబొమ్మకు కొత్త సినిమాలను ఎవరు సరఫరా చేస్తున్నారు? అతనికి సహకరిస్తున్న ఏజెంట్లు ఎవరు? గేమింగ్ యాప్‌ల నిర్వాహకులతో రవికి ఉన్న సంబంధాలు ఏమిటి? అనే కోణాల్లో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఇప్పటికే సైబర్ క్రైమ్ పోలీసుల విచారణ కొనసాగుతుండగా, ఇప్పుడు సీఐడీ కూడా రంగంలోకి దిగడంతో ఈ కేసులో మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. రెండు ఏజెన్సీల దర్యాప్తుతో రవికి సహకరించిన వారికి ఉచ్చు మరింత బిగుసుకున్నట్లయింది.

## నైజీరియాలో మరోసారి → 315 మంది విద్యార్థులు, టీచర్లు కిడ్నాప్

**అబుజా:** నైజీరియా చరిత్రలో గతంలో ఎన్నడూలేని విధంగా సాయుధ ముష్కరులు పెద్దసంఖ్యలో 315 మంది పాఠశాల విద్యార్థులను, టీచర్లను కిడ్నాప్ చేసి తీసుకుపోయారు. రోజు రోజుకూ ఈ ఘటనలు నైజీరియాలో పెరుగుతున్నాయి. నైజీరియా నిగర్ రాష్ట్రం నార్త్-సెంట్రల్ ప్రాంతంలో ఉన్న సెయింట్ మేరీస్ క్యాథలిక్ స్కూలు నుండి శుక్రవారం సాయుధులు 303 మంది విద్యార్థులు, 12 మంది ఉపాధ్యాయులను కిడ్నాప్ చేసి తీసుకుపోయారు. 2014లో ఛిబోక్ రాష్ట్రంలో 276 మంది బాలబాలికలను కిడ్నాప్ చేసిన తర్వాత అంతకు మించినస్థాయిలో జరిగిన అతిపెద్ద అపహరణ చర్య ఇదే. 10 నుండి 18 లోపు వయసుగల బాలికలు, బాలురు అపహరణకు గురైనవారిలో ఉన్నారు. పారిపోయేందుకు ప్రయత్నం చేసిన 88 మంది విద్యార్థులను కూడా సాయుధులు తర్వాత పట్టుకుని తమ వెంట తీసుకుపోయారు. క్రిస్టియన్ అసోసియేషన్ ఆఫ్ నైజీరియా (సిఎఎన్) ఒక ప్రకటన చేస్తూ, రోజు రోజుకూ భద్రతాలేమి భయాలు పెరగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కిడ్నాప్ తామే చేశామని ఇప్పటివరకూ ఏ సాయుధ ముఠా ప్రకటించలేదు. ఐతే రాష్ట్ర ప్రభుత్వం అనుమతి లేకుండా, ప్రభుత్వం అదేశించకుండానే పాఠశాలను తెరిచారని అధికారులు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో సాయుధ ముఠాల దాడులు పెరుగుతున్నాయని తమకు



ఇంటెలిజెన్స్ సమాచారం ఉందని వారు అన్నారు. ఐతే ప్రభుత్వం తప్పుడు ప్రకటనలు చేస్తోందని సిఎఎన్ నిగర్ స్టేట్ ఛాప్టర్ ఛైర్మన్ మోస్ట్ రెవరెండ్ బులుస్ దౌవా యోహన్న విమర్శించారు. ఈ ఘటనతో నిర్ణీత ప్రకారం జి-20 సమావేశాలకు బయలుదేరిన నైజీరియా అధ్యక్షుడు బోలా తినుబు ఈ వార్త తెలిసిన వెంటనే తన పర్యటన రద్దుచేసుకున్నారు. ఆయన తరఫున ఉపాధ్యక్షుడు కాసిం శెట్టిమా ఈ సదస్సుకు హాజరయ్యారు. నైజీరియాలో క్రైస్తవులపై దాడులు బాగా పెరిగిపోయాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విమర్శించిన కొద్ది రోజులకు ఈ కిడ్నాప్ ఘటనలు జరిగాయి. కానీ ప్రభుత్వం మాత్రం ట్రంప్ ప్రకటనను ఖండించింది. సాయుధ గ్రూపులవల్ల ముస్లిం లే ఈ కిడ్నాప్‌లకు, దాడులకు బలవుతున్నారని ప్రభుత్వం విమర్శించింది.శనివారం తొలు త అధికారులు ఒక ప్రకటన చేస్తూ కిడ్నాప్‌కు గురైన విద్యార్థుల సంఖ్యను 215గా పేర్కొన్నారు. ఆ తర్వాత మళ్ళీ పూర్తిగా ధృవీకరించుకున్న తుది లెక్కల ప్రకారం 303 మంది విద్యార్థులు కిడ్నాప్‌కు గురైనట్లు తేల్చారు. తేల్చారు. గడచిన సోమవారం తెల్లావారుఝాము నుం డి ఈ కిడ్నాప్ సంఘటనలు జరుగుతున్నాయి. వాయు వ్య నైజీరియాలోని కెబ్బీ రాష్ట్రం మాగాలో ఉన్న కాంప్రిహెన్సివ్ సెకండరీ స్కూలు హాస్టలుపై దాడిచేసిన సాయుధులైన దుండగులు స్కూలు ఉపాధ్యాయుణ్ణి కాల్చి చం పారు. 25 మంది బాలికలను కిడ్నాప్ చేశారు. ఐతే వీరి లో ఒక బాలిక వారి నుండి తప్పించుకుని పారిపోయింది. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం ఈ ఘటన జరిగిందని పోలీసులు చెప్పారు. పోలీసులు పహారాలో ఉన్నాగానీ సాయుధులు ఫెన్సింగ్‌లు ఎక్కి రహస్యంగా హాస్టల్‌లోకి ప్రవేశించి టీచర్‌ను హత్యచేసి బాలికలను అపహరించుకుపోయారు. కాల్పుల్లో గాయపడి న మరో హాస్టల్ ఉద్యోగి కోలుకుంటున్నారు. పోలీసులు వెంటనే సైనికులను, ఆధునిక ఆయుధాలున్న పోలీసులను రంగంలోకి దించారు. ఆ ప్రాంతాన్ని స్వాధీనంలో కి తెచ్చుకున్నారు. ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేసి భారీ ఎత్తున ర్యాన్సమ్ ధనాన్ని సంపాదించేందుకు నైజీరియా లో ఇలా పాఠశాలలపై దాడులు చేసి ముఖ్యంగా బాలికలను కిడ్నాప్ చేసి తీసుకుపోవడం ఒక అలవాటుగా మా రింది. కానీ ఈసారి మాత్రం ప్రభుత్వం కిడ్నాపర్లకు లొంగిపోకుండా వారి భరతం పట్టాలని తీర్మానించుకుం ది. సైన్యాన్ని భారీగా మోహరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకుంటున్నాయి. గడచిన పది సంవత్సరాలుగా నైజీరియాలో పాఠశాలలపై దాడులు చేయ డం, బాలికా విద్యార్థినులను అపహరించి తీసుకుపోవవడం ఒక అలవాటుగా మారింది. ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేసి భారీగా ధనం సంపాదించడంకోసం సాయు ధ మూకలు తరచు ఈ విధంగా స్కూళ్ళపై దాడులు చే స్తూ బాలికలను కిడ్నాప్ చేసి తీసుకుపోతున్నారు. ఐతే ప్రభుత్వం కూడా కిడ్నాపర్లకు లొంగడంలేదు. వారు కోరిన ధనాన్ని ఇవ్వడానికి ప్రభుత్వం తిరస్కరిస్తోంది. వారిని అణచివేస్తోంది. ఐనాగానీ మళ్ళీ మళ్ళీ ఇలాంటి దాడులు జరుగుతూనే ఉన్నాయి.

## అమెరికా బహిష్కరణ మధ్య దక్షిణాఫ్రికాలో జి-20 సదస్సు ప్రారంభం

**జోహన్నెస్‌బర్గ్:** దీర్ఘకాలంగా పేద దేశాలకు ఉన్న సమస్యలు పరిష్కారం కావాలనే గొప్ప ఆశయంతో దక్షిణాఫ్రికా నగరం జోహెన్నెస్‌బర్గ్ సమీప సొవేటో టౌన్‌షిప్‌లో చరిత్రాత్మకమైన జి-20 సదస్సు శనివారం ప్రారంభమైంది. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఇటలీ ప్రధానమంత్రి జార్జియో మెలోనీ, ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బెనీస్ సహా పలువురు నాయకులు మొదటిరోజు సమావేశంలో పాల్గొన్నారు. ప్రాంగణం వద్ద వారికి దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సైరిల్ రామఫోసా ఘనంగా స్వాగతం పలికారు. పేద, ధనిక దేశాల ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొంటున్నారు. జాతీయ ప్రయోజనాలు, ఆఫ్రికన్ ఎజెండా, పేద దేశాలు, అభివృద్ధి చెందుతున్న దేశాలమధ్య సహకారం, బహుళధ్రువ ప్రపంచం అనే నాలుగు అంశాల ప్రాతిపదికపై దక్షిణాఫ్రికా ఈ సదస్సు నిర్వహిస్తున్నది. అభివృద్ధి ఎజెండాను ముందుకు తీసుకువెళ్ళడమే లక్ష్యంగా ''సంఘీభావం, సమానత్వం, స్థిరత్వం'' అనే మూడు అంశాలను ఈసారి ఇతివృత్తంగా తీసుకన్నారు. జి-20 సదస్సు నిర్వహణకుగాను దక్షిణాఫ్రికా ప్రభుత్వం 38.7 మిలియన్ డాలర్లు పెట్టుబడులుగా సమకూర్చింది. పేద దేశాలకు మరింత సహాయం చేసేందుకు ధనిక దేశాలు అంగీకరించాలని, ప్రకృతి వైపరీత్యాల నివారణకు, వాటి నుండి కోలుకునేందుకు నిధులు ఇవ్వాలని,గ్రీన్ ఎనర్జీవైపు మళ్ళేందుకు సహకరించాలని దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామఫోసా కోరుతున్నారు. ఒక ఆఫ్రికాదేశంలో మొట్టమొదటిసారి జరుగుతున్న ఈ సదస్సులో 42 దేశాలకు చెందిన అనేక సంస్థల ప్రతినిధులు, ప్రభుత్వ పాలనాధిపతులు ఈ సమావేశంలో పాల్గొనాల్సి ఉంది. రెండు రోజుల ఈ సదస్సు ఆదివారం సాయంత్రానికి ముగుస్తుంది. జి-20 సభ్యదేశాలు ప్రపంచంలో 85 శాతం ఆర్థిక వ్యవస్థకు. 75 శాతం ప్రపంచ వాణిజ్యానికి, సగానికిపైగా జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. శ్వేతజాతీయులపట్ల తీవ్ర వివక్ష పాటిస్తూ, వారి భూములు లాక్కుంటూ, వారిపై పన్నుల భారాలు విధిస్తున్నందుకు నిరసనగా జి-20 సదస్సును అమెరికా బహిష్కరించింది. దక్షిణాఫ్రికా ఈ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చి నాయకత్వం వహించడాన్ని ట్రంప్ వ్యతిరేకించారు. శ్వేతజాతీయుల భూములను బలవంతంగా లాక్కుంటున్నారని, వారికి తగిన నష్టపరిహారం ఇవ్వకుండా వారిని మోసం చేస్తున్నారనీ, అందుకే ఈ సదస్సు నిర్వహణకు దక్షిణాఫ్రికాకు ఎలాంటి నైతికహక్కు లేదని ట్రంప్ విమర్శిస్తున్నారు. జి-20 వ్యవస్థాపక సభ్యదేశమైన అమెరికా వాస్తవానికి ఈ ఏడాది ప్రిటోరియా నుండి ఈ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించాల్సి ఉంది. కానీ దక్షిణాఫ్రికా అధ్యక్షుడు రామఫోసా మాట్లాడుతూ, అవసరమైతే తాను సింబాలిక్‌గా ఖాళీ కుర్చీకే బాధ్యత అప్పగిస్తానన్నారు. గడచిన గురువారం రామఫోసా మాట్లాడుతూ, అమెరికా ఆఖరి నిమిషంలో ఏదో ఒక రకమైన భాగస్వామ్యానికి అంగీకరించిదని, కానీ అదేమిటో వివరించలేదని అన్నారు. ఐతే దీనిపై వైట్‌హౌస్ ప్రెస్ కార్యదర్శి కరోలినా లెవిట్ స్పందిస్తూ, రామఫోసా నోరు విప్పుతున్నారనీ, కానీ ఆయన వ్యాఖ్యలను ట్రంప్‌గానీ, ఆయన అనుచరవర్గం గానీ అభినందించలేదన్నారు. కానీ జి-20 అధ్యక్ష బాధ్యతలను తీసుకోవడానికి మాత్రం ఒక ప్రతినిధిని అమెరికా పంపుతుందని మాత్రం చెప్పారు.




## ప్రకృతి దోపిడీ (మొదటి పేజీ తరువాయి)

మానవతావాద సూత్రాన్ని, మానవ జీవన గమనంలో కొత్త మార్పులు తెచ్చే చొరవలను ప్రతిపాదించారు. ఉగ్రవాదులకు-మాదక ద్రవ్యాల రవాణాకు మధ్య ఉన్న సంబంధాలను ప్రతిఘటించేందుకు, ప్రపంచ ఆరోగ్య సంరక్షణ కోసం ప్రతిస్పందన బృందాన్ని, ప్రపంచ సంప్రదాయ విజ్ఞాన భాండాగారాన్ని ఏర్పాటు చేసేందుకు, ఆఫ్రికా నైపుణ్యాలను ద్విగుణం,బహుగుణం చేసేందుకు జి-20 సదస్సు చొరవ తీసుకోవాలని కోరారు. జి-20 పెట్టుబడుల ద్వారా ప్రపంచవ్యాప్తంగా శిక్షణ ఇచ్చే వారికి శిక్షణ ఇవ్వడం ద్వారా ఆఫ్రికా నైపుణ్యాలు బహుగుణాలను పొందుపరచుకుంటుందన్నారు. ఈ విధంగా రాబోయే పది సంవత్సరాలలో ఆఫ్రికాలో 10 లక్షలమంది సర్టిఫైడ్ ట్రైనర్లు తయారవుతారని, వీరంతా లక్షలమంది యువకులు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగపడతారని అన్నారు. జోహన్నెస్‌బర్గ్ సమీపం సోవేటో టౌన్‌షిప్‌లో శనివారం జరిగిన జి-20 నాయకుల సమావేశంలో మోదీ మాట్లాడుతూ, పూర్వకాలంనాటి సంప్రదాయ విజ్ఞానశాస్త్రంలో ప్రకృతిని, పర్యావరణాన్ని మానవ జీవనాన్ని సమతుల్యం చేసే విధానాలు ఉన్నాయని, సాంస్కృతికంగా ఎంతో సంపద్వంతమైన విలువలు, సామాజికంగా ఇరుగుపొరుగు ఎంతో చక్కగా కలిసి జీవించే విధానాలు ఉన్నాయని, వీటన్నింటినీ కలగలిప సంప్రదాయ విజ్ఞాన భాండాగారాన్ని ఏర్పాటు చేసేందుకు జి-20 చొరవ తీసుకోవాలని, ఈ భాండాగారం ప్రపంచ అభివృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు.''మనకు ఇదే సరైన సమయం, మన అభివృద్ధి నమూనాలను పునఃపరిశీలించుకోవాలి, అందరినీ సమ్మిళితం చేసుకోవడానికి, స్థిరత్వం సాధించడానికి వీలుగా వృద్ధిపై దృష్టి కేంద్రీకరించాలి, భారతదేశ నాగరిక విలువలు, ప్రత్యేకించి సమగ్ర మానవతావాద దృక్పథ జీవనాన్ని ముందుకు తీసుకువెళ్ళేందుకు ఉపయోగపడతాయి'' అని మోదీ చెప్పారు. సర్వసమ్మిళిత తత్వాన్ని, స్థిరమైన ఆర్థికవృద్ధిని సాధించడంలో ఏ ఒక్కరూ వెనుకబడకూడదన్నారు. ప్రపంచాభివృద్ధిని, పెట్టుబడులను జి-20 దీర్ఘకాలంగా తీర్చిదిద్దుతూ వస్తోందని కానీ భారీగా ప్రపంచం అంతటా విస్తరించిన జనాభా వనరులకు ప్రస్తుతం ఉన్న నమూనాల ద్వారా అభివృద్ధి ఫలితాలు చేరడంలేదని, వారు పేదలుగానే ఉండిపోతున్నారని అన్నారు. ఈ నమూనాలను పునఃపరిశీలించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎన్నో జాతులు ప్రకృతిని పరిరక్షిస్తున్నాయని, సమతుల్యాన్ని రక్షిస్తున్నాయని, ఈ విజ్ఞాన భాండాగారాన్ని కాపాడాలన్నారు. భారతదేశ పురాతన విజ్ఞానశాస్త్రం దీనికి మౌలిక వేదికగా దోహదం చేస్తుందని చెప్పారు. మాదక ద్రవ్యాలను ప్రపంచవ్యాప్తంగా రవాణా చేసే పెద్ద సవాలును అధిగమించడానికి, ప్రత్యేకించి ఫెంటానల్ వంటి ప్రమాదాన్ని నిర్మూలించడమే ప్రధానాంశంగా భావించాలని కోరారు. ఈ ఫెంటనాల్ వల్ల ప్రజల ఆరోగ్యానికి, ప్రపంచ భద్రతకు తీవ్ర హాని కలుగుతుందన్నారు. ఉగ్రవాదులకు మాదకద్రవ్యాలకు మధ్య ఉన్న సంబంధాన్ని తెగ్గొట్టాలని, ఉగ్రవాదానికి ప్రధానంగా నిధులు సమకూర్చేవారిని బల హీనపరచాలని మోదీ అన్నారు. దక్షిణ ఆఫ్రికాలో మొదటిసారి జి-20 సమావేశాలు జరుగుతున్నాయి. తొలుత ఈ సమావేశంలో దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సైరిల్ రామఫోసా స్వాగతోపన్యాసం చేశారు. నరేంద్రమోదీకి ''నమస్తే'' అంటూ ఆహ్వానం పలికారు.

## కుటుంబం ఆత్మహత్య
(మొదటి పేజీ తరువాయి)

మరో పెద్ద కూతురు ఉంది. ఇటీవలే పెద్ద కూతురు ఆత్మహత్యకు పాల్పడింది. ఆ తరువాత శ్రీనివాస్ తన కుటుంబాన్ని రామ్‌నగర్ నుంచి అంబర్‌పేటలోని రామకృష్ణానగర్‌కు మార్చాడు. అద్దె ఇంట్లో శ్రీనివాస్, విజయలక్ష్మి తో పాటు కూతురు శ్రావ్య ఉంటున్నారు. దేవుడు పిలుస్తున్నాడని.. మేము కూడా పెద్ద కూతురు దగ్గరికే వెళ్తామని చుట్టుపక్కల వాళ్లతో వీళ్లు చెప్పుకునేవారు. ఈ క్రమంలోనే ఈ ముగ్గురు శనివారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ముగ్గురూ ఆత్మహత్య చేసుకోవడంతో కాలనీవాసులు షాక్‌కుగురయ్యారు. సంఘటన స్థలానికి చేరుకున్న అంబర్‌పేట్ పోలీసులు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. మూఢ నమ్మకంతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

## సమూల మార్పు
(మొదటి పేజీ తరువాయి)

ప్రధానంగా దృష్టి సారించామన్నారు. కూకట్ పల్లిలోని జెఎన్‌టియు హెచ్ ఆడిటోరియంలో శనివారం నిర్వహించిన 'జెఎన్‌టియు హెచ్ గ్లోబల్ అల్యూమ్ని మీట్ 2025'కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యమిస్తోందని వివరించారు. క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఏఐ తదితర కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీస్ లో తెలంగాణను అగ్రగామిగా నిలిపేలా 'ఎకో సిస్టం'ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. 'ఏఐ'లో బెంచ్ మార్క్ ను సెట్ చేసేలా అంతర్జాతీయ నిపుణుల భాగస్వామ్యంతో త్వరలోనే 'తెలంగాణ ఏఐ ఇన్నోవేషన్ హబ్'ను అందుబాటులోకి తెస్తున్నామన్నారు. మనం జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగినా మూలాలను మరిచిపోవద్దని, సమాజానికి తిరిగి ఇవ్వడం కృతజ్ఞతతో కూడిన బాధ్యత అని అన్నారు. మనం మన విధులను సక్రమంగా నిర్వర్తించినప్పుడే ప్రశ్నించే అవకాశాన్ని పొందగలమన్నారు. జేఎన్టీయూహెచ్ లో ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీలో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్, ఇన్నోవేషన్ అండ రీసెర్చ్ ఫండింగ్, రీసెర్చ్ క్లస్టర్స్, ఇంటర్నేషనల్ మెంటార్ షిప్ నెట్ వర్క్స్, గ్లోబల్ అల్యూమ్ని కౌన్సిల్ ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలని పూర్వ విద్యార్థులను కోరారు. ఈ ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. యువ ఇంజనీర్ల ఆలోచన విధానం మారాలని, ఉద్యోగార్థిగా కాకుండా పది మందికి ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలని మార్గనిర్దేశం చేశారు. కేవలం పుస్తక జ్ఞానమే కాకుండా ప్రాక్టికల్, ప్రాబ్లం సాల్వింగ్ స్కిల్స్ ను పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి, జెఎన్‌టియు హెచ్ విసి ప్రొఫెసర్ టి.కిషన్ కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వెంకటేశ్వర రావు, రెక్టార్ డా.కె.విజయ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లొంగుబాటు (మొదటి పేజీ తరువాయి)

రూ.లక్ష చొప్పున నగదు బహుమతి ఇచ్చామన్నారు. కేంద్ర గృహ మంత్రిత్వ శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆయుధాలు అప్పగించిన మావోయిస్టులకు అదనంగా రూ.4లక్షల నుంచి ఒక లక్ష వరకు మొత్తం రూ. 1,41,0 5,000 డిమాండ్ డ్రాఫ్ట్‌ను అందించామని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకు సిపిఐ (మావోయిస్టు) ఉద్యమంపై తెలంగాణ పోలీసులు అవలంభించిన సమగ్ర వ్యూహానికి ఒక నైతిక విజయంగా డిజిపి పేర్కొన్నారు. ఈ ఏడాది 465 మంది మావోయిస్టులు లొంగి పోగా అందులో ఇద్దరు కేంద్ర కమిటి సభ్యులు, 11 మంది రాష్ట్ర కమిటి సభ్యులు, ఇద్దరు డివిజనల్ కమిటి కార్యదర్శు లు, 11 మంది డివిజనల్ కమిటి సభ్యులు, 44 మంది ఏరియా కమిటి సభ్యులు ఉన్నారు. మావోయిస్టు పార్టీలో ప్రస్తుతం తెలంగాణకు చెందిన 59 మంది అజ్ఞాతంలో ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం కేంద్ర కమిటిలో ఉన్న ఎనిమిది మందిలో ఐదుగురు తెలంగాణ వారే ఉన్నారన్నారు. ఆయుధాలను..అజ్ఞాతాన్ని వీడండిజన జీవన స్రవంతిలో కలవండి, మీ ఊరికి తిరిగి రండి.. అజ్ఞాత మావోయిస్టులకు డిజిపి హృదయపూర్వక ఆహ్వానం మరోసారి పలికారు.

### వారి భద్రత మా బాధ్యత: డిజిపి శివధర్‌రెడ్డి

తమపై నమ్మకం ఉంచి లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలిసిన ప్రతి మావోయిస్టులకు భద్రత కల్పించడం తమ బాధ్యత అని డిజిపి శివధర్‌రెడ్డి హామి ఇ చ్చారు. లొంగిపోయిన వారికి ఎలాంటి ప్రాణహాని కలుగకుండా చూసుకుంటామని, అలాగే వారి జీవన ఉపాధి కోసం వారు కోరుకున్న కోర్సులను నేర్పిస్తామన్నారు.ఛతీస్‌ఘడ్ ప్రభుత్వంతో కూడా మాట్లాడి వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు.లొంగిపోయిన మావోయిస్టులలో చాలామంది మహిళలు 21 సంవత్సరాలలోపు వారే ఉన్నారని..వారికి ఉపాధితో పాటు భద్రతపై తెలంగాణ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించామని స్పష్టం చేశారు.

### మారుతున్న పరిస్థితిలో లొంగిపోయాం: ఆజాద్

సమాజంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తాము కూడా మారాలనుకున్నామని అందుకే జన జీవన స్రవంతిలోకి కలిశామన్నారు. పార్టీ నేతలకు సమాచారం ఇచ్చిన తరువాతనే పోలీసుల ముందు లొంగిపోయామన్నారు.

## ప్లాన్‌కు ఒప్పుకోవాల్సిందే
(మొదటి పేజీ తరువాయి)

ఇదే తుది ఒప్పందం అవుతుందన్నారు. కానీ అమెరికా చట్టసభల సభ్యులు ఈ ప్రణాళికను తీవ్రంగా వ్యతిరేకిస్తుండగా, జెలెన్‌స్కీ తమ అధీనంలో ఉన్న భూభాగాలను రష్యాకు ఇచ్చేందుకు ఇప్పటికే డజన్లసార్లు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. ఈ ప్రణాళికపై ఇంకా సుదీర్ఘ చర్చలు జరగాల్సి ఉందన్నారు. ఈ ఒప్పందాన్ని అంగీకరిస్తే ఉక్రేన్ తన గౌరవ మర్యాదలను, స్వేచ్ఛను కోల్పోతుందని, అంగీకరించకపోతే అమెరికాతో మైత్రిని తమదేశం కోల్పోతుందని హెచ్చరించారు. ఈ పరిస్థితుల్లో ఆయన అందరితో కలిసి ఈ ప్రణాళికపై తీవ్ర మథనం చేస్తున్నారు. ఉక్రేన్‌కు నష్టం కలగకుండా చూసేందుక జి-20 సదస్సకు హాజరవుతున్న యూరప్ దేశాల కూటమి మిత్రులతో కలిసి ఈ ప్రణాళికలో మార్పులు,చేర్పుల చర్చలకు జెలెన్‌స్కీ సిద్ధపడుతున్నారు. ప్రణాళికను అంగీకరించకపోతే తమవైపు నుండి గూఢచర్యం, ఆయుధాలు సహా ఎలాంటి సహాయం లభించదని ట్రంప్ హెచ్చరికలు చేసినట్లు వచ్చిన వార్తలను ఆయన యంత్రాంగం తిరస్కరించింది. ఈ పరిణామాలమధ్య అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఉక్రేన్‌ను బుజ్జగించే పనిలో పడ్డారు. ఉక్రేన్ తన సైన్యాలను తగ్గించుకున్నాగానీ, సైనిక వ్యవస్థను నిలబెట్టుకునే హక్కులు, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకునే హక్కులు ఉండాలన్నారు. ట్రంప్ ప్రతిపాదించిన ఈ ఒప్పందాన్ని మరింత పటిష్టంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని, జి-20 సదస్సుకు వెళుతున్నందున అక్కడే తాము విడిగా దీనిపై చర్చిస్తామని బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ చెప్పారు. రష్యాకు మేలుచేసే 28 అంశాల ప్రణాళికను సమ్మతించాలని చాలా తీవ్రమైన ఒత్తిడి వస్తోందని, మునుపు ఎన్నడూ ఇలాంటి సంక్లిష్టపరిస్థితి ఉక్రేన్‌కు చరిత్రలో ఎదురుకాలేదని జెలెన్‌స్కీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన తర్వాత జి-3 మిత్రులు (మేక్రాన్, మెర్జ్, స్టార్‌మర్)లు జి-20లో కలిసిన సందర్భంగా దీనిపై చర్చించేందుకు సుముఖత వ్యక్తం చేశారు. ఉక్రేన్ తన సైన్యాన్ని నిలబెట్టుకోవాలని, సైనిక అధికారం,సార్వభౌమాధికారం ఉండాలని మేక్రాన్ అన్నారు. ఉక్రేన్ ఆక్రమణలో ఉన్న రష్యా భూభాగాలను తిరిగి ఇచ్చేయాలని, ఉక్రేన్ తన సైన్యాన్ని సగానికిపైగా తగ్గించుకోవాలన్నవి ఈ ప్రణాళికలో ప్రధానాంశాలుగా పైకి వచ్చాయి. అమెరికా ఆర్మీ సెక్రటరీ డాన్ డ్రిస్కోల్ - జెలెన్‌స్కీ గడచిన గురువారం (నవంబరు 20) ఉక్రేన్‌లో మొదటిసారి ఈ ప్రణాళికపై సంభాషణలు జరిపారు. ఉక్రేన్-రష్యాలమధ్య దీర్ఘకాలం నిలిచి ఉండే మన్నికైన శాంతి ఒప్పందం సాధించాలంటే కొన్ని రాయితీలు తప్పవని అమెరికా రక్షణమంత్రి మార్కో రుబియో చెబుతుండగా తమ జోక్యం అనివార్యంగా ఉండాలని ఉక్రేన్ అనుకూల యూరోపియన్ యూనియన్ నాయకులు పట్టుపడుతున్నారు.

### ట్రంప్ ప్రణాళికలో ముఖ్యాంశాలివే

''ఉక్రేన్ సార్వభౌమాధికారానికి ఢోకా ఉండదు, ఉక్రేన్‌కు చెల్లుబాటైన భద్రతా హామీలు లభిస్తాయి, ఉక్రేన్ సైన్యాన్ని 6,00,000 లోపు ఉండేలా కుదించుకోవాలి. ఉక్రేన్ పునర్నిర్మాణానికి ఒకశక్తిమంతమైన గ్లోబల్ ప్యాకేజీ అమలు చేస్తారు, నాటోలో చేరేది లేదు అనే అంశాన్ని ఉక్రేన్ తన రాజ్యాంగంలో చేర్చుకోవాలి, ఉక్రేన్‌ను భవిష్యత్తులో ఎప్పుడూ నాటో కూలమిలో చేర్చుకునేది లేదంటూ ఒక నిబంధనను నాటో కూటమి రూపొందించాలి, ఉక్రేన్‌లో నాటో సైనిక స్థావరాన్ని ఏర్పాటు చేయకూడదు, పోలెండ్‌లో యూరోపియన్ ఫైటర్ జెట్స్ కేంద్రం ఉండకూడదు, రష్యా, ఉక్రేన్,యూరప్ మధ్య సమగ్ర దురాక్రమణేతర ఒప్పందం జరుగుతుంది, గడచిన 30 సంవత్సరాలుగా ఉన్న సందేహాలన్నీ పరిష్కారమైనట్లు పరిగణిస్తారు, పొరుగు దేశాలపై రష్యా దాడి చేయదు, నాటో కూటమి తదుపరి విస్తరణ చర్యలకు పాల్పడదు, భద్రతా సమస్యల పరిష్కారానికి అమెరికా మధ్యవర్తిత్వంలో రష్యా-నాటో మధ్య సంభాషణలు జరుగుతాయి, సహకారాన్ని, తదుపరి ఆర్థిక అభివృద్ధిని విస్తరించుకోవడానికి, అవకాశాలను విస్తరించుకోవడానికి, ప్రపంచ భద్రతకు వీలుగా సైన్యాలను వెనక్కు రప్పించుకుంటారు, ఒకవేళ ఉక్రేన్‌పై రష్యా దాడి చేస్తే అంక్షలు అమలులోకి వస్తాయి, ఒకవేళ రష్యాపై ఉక్రేన్ దాడి చేస్తే దానికి అమెరికా ఇచ్చిన భద్రతా హామీలను పోగొట్టుకుంటుంది'' వంటివి ట్రంప్ ప్రణాళికలో కొన్ని ముఖ్యాంశాలు.




# జనరల్
STATE & REGIONAL NEWS

ప్రజాపక్షం/హైదరాబాద్: సిపిఐ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి తమ్మారెడ్డి సత్యనారాయణకు సిపిఐ తెలంగాణ రాష్ట్ర సమితి నివాళులు అర్పించింది. తమ్మారెడ్డి సత్యనారాయణ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో ఆయన చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నరసింహ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యాలయం కార్యదర్శి గోవింద్, బోయ శ్రీరాములు, బోడ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.





## జిఓ 46ను వెనక్కి తీసుకోండి

లేనిపక్షంలో తీవ్ర ఆందోళనలు

బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిసిలను దగా చేసే జిఓ 46ను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రెండురోజుల్లో అన్ని సంఘాలతో సమావేశమై పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిలను కలిపి 50శాతంలోపు రిజర్వేషన్లు కొనసాగిస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడానికి మార్గదర్శకాలను విడుదల చేయడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ఎన్నికలు వాయిదా వేసి,కోర్టులో తీర్పు వచ్చేంతవరకు ఆగాలని సూచించారు. శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బిసిల రిజర్వేషన్లపై ఒకవైపు హైకోర్టులో వాదనలు కొనసాగించడానికి గడువు ఉన్నప్పటికీ ఆ దిశగా నిబద్ధతతో చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ముందుగానే చేతులు ఎత్తేసి జిఓ ఎందుకు విడుదల చేసినట్టు అని ప్రశ్నించారు. ఈ నెల 20న డెడికేటెడ్ కమిషన్ నివేదిక ఇచ్చిందంటూ, దాని ఆధారంగానే జిఓ 46 విడుదల చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. ఇంతకాలం బిసి రిజర్వేషన్లపై ప్రధాని మోదీని అఖిలపక్షంతో కలిసి చర్చిస్తే, సమస్య పరిష్కారమయ్యేదన్నారు. ప్రభుత్వం ఒంటెద్దు పోకడలకు పోతే బిసిల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. సమావేశంలో బిసి కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, బిసి కుల సంఘాల నేతలు కొండా దేవయ్య, పగిళ్ల సతీశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## బూటకపు ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే

ప్రజాస్వామ్య గొంతుక నులిమేస్తున్నారు : సిపిఐ జిల్లా స్థాయి సమావేశంలో కూనంనేని




ప్రజాపక్షం/ఖమ్మం : బూటకపు ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనని వీటిపై న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. శాంతిచర్చలు జరిపే అవకాశం ఉన్న కేంద్ర ప్రభుత్వం అందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదని నిరాయుధులుగా దొరికిన మావోయిస్టులను పట్టుకొచ్చి కాల్చి చంపుతున్నారని ఆయన ఆరోపించారు. భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కౌన్సిల్ ప్రజా సంఘాల సంయుక్త సమావేశం శనివారం స్థానిక సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. కొండపర్తి గోవిందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ కార్పొరేట్లకు ప్రకృతి సంపదను కట్టబెట్టే ప్రయత్నంలో భాగంగానే మావోయిస్టు పార్టీ నిర్మూలన శపథం చేశారని ఆయన తెలిపారు. రాజ్యం పరిధిలో విచారణ జరిపే హక్కు ఉన్న జరపడం లేదని పట్టుకొచ్చి కాల్చి చంపుతున్నారని ఆయన తెలిపారు. మావోయిస్టులు ప్రజల కోసం పని చేస్తున్నారని ఈ దేశంలో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. మావోయిస్టు ఉద్యమాన్ని నిర్మూలించాలంటే మావోయిస్టులు ఏ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారో ఆ సమస్యలను పరిష్కరించాలి తప్ప మావోయిస్టు పార్టీ నాయకులను కాల్చి చంపడం కాదని ఆయన తెలిపారు. దండకారణ్యంతో పాటు మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో ఉన్న ప్రకృతి సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు మోదీ సర్కార్ యథాశక్తి ప్రయత్నిస్తుందని ఆయన తెలిపారు. మతం పేరుతో ఉన్మాదాన్ని రెచ్చగొడుతున్న బిజెపి అదే సందర్భంలో సంపన్నులకు ఈ దేశాన్ని తాకట్టు పెడుతుందన్నారు. కేవలం మతం పేరుతో ప్రజలను వంచించే ప్రయత్నం చేస్తున్న ఎన్డిఏ ప్రభుత్వం మరో పక్క ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రజలను సమీకరించి కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ దేశం మోదీ పాలనలో తిరోగమనం వైపు పయనిస్తుందన్నారు.

**చరిత్రలో నిలిచిపోయేలా సభ :**

చరిత్రలో నిలిచిపోయేలా సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభను ఖమ్మంలో నిర్వహించనున్నట్లు సాంబశివరావు తెలిపారు. డిసెంబర్ 26 నాటికి భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా 40 దేశాల నుంచి ప్రతినిధులు సౌహార్ద సందేశాలు ఇచ్చేందుకు వస్తున్నారన్నారు. వందేళ్ల కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రను సామ్రాజ్యవాద, భూస్వామ్య పెత్తందారి వర్గాలపై పోరాటం, సాధించిన హక్కులు, విజయాలను నేటి తరానికి తెలియజేప్పేందుకే రాష్ట్ర వ్యాప్తంగా జాతాలను నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మహాసభల ఉద్యమ సందేశాన్ని ఇంటింటికి అందజేయడం జరుగుతుందన్నారు. ఖమ్మంలో జరిగే ఈ సభకు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మందిని సమీకరించనున్నామని ఆయన తెలిపారు. చారిత్రిక సభ తర్వాత కమ్యూనిస్టు పార్టీ పురోగమనం తథ్యమని కూనంనేని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మ ద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## చెరుకు రైతుల సమస్యలపై ఉన్నతాధికారుల కమిటీ

ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్: చెరుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కారాలు సూచించేందుకు ఉన్నతాధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. సచివాలయంలో శనివారం ఆయన చెరుకు రైతులు, పరిశ్రమల ప్రతినిధులు, చెరుకు అభివృద్ధి మండళ్ల (సిడిసి) ఛైర్మన్లతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. తెలంగాణాలో ఏటా చెరుకు సాగు విస్తీర్ణం తగ్గుతున్న విషయం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ఆయన అన్నారు. అదే సమయంలో రాష్ట్రంలోని చక్కెర పరిశ్రమల సమస్యలు కూడా పరిష్కరించాలన్న సంకల్పంతో సిఎం రేవంత్ రెడ్డి ఉన్నారని శ్రీధర్‌బాబు తెలిపారు. సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన ప్రధాన అంశాలపై అందరితో చర్చించి నివేదిక రూపొందించేందుకు ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక కమిటీని నియమిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఇందులో సంబంధిత శాఖల అధికారులు, చక్కెర పరిశ్రమల ప్రతినిధులు కూడా ఉంటారని చెప్పారు. ఈ కమిటీ ఇతర రాష్ట్రాల్లో చెరుకు రైతులకు అందుతున్న ప్రయోజనాలు, రాయితీలపై అధ్యయనం చేసి సాధ్యమైనంత త్వరలో నివేదిక అందిస్తుందని శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రతి క్వింటాలు సన్న ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.500 బోనస్‌ను చెరుకు పంటకు కూడా వర్తింపచేయాలని రైతులు కోరుతున్న విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని శ్రీధర్ బాబు అన్నారు. తెలంగాణా పారిశ్రామిక మౌలిక వసతుల సంస్థ ఛైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సంజయ్ కుమార్, చక్కెర పరిశ్రమల డైరెక్టర్ నర్సిరెడ్డి, అధికారులు, ప్రతినిధులు, సిడిసి ఛైర్మన్లు, రైతులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ లూటింగ్ పాలసీ



మాజీ మంత్రి హరీష్‌రావు

ప్రజాపక్షం/హైదరాబాద్: కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ అయినటువంటి కాంగ్రెస్ పార్టీ కొత్త స్కామ్‌కు తెరలేపిందని మాజీ మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ కాదు, హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ లూటింగ్ పాలసీ అని అభివర్ణించారు. బిఆర్‌ఎస్ భవన్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పారిశ్రామిక వాడల్లోని దాదాపు పది వేల ఎకరాల భూమిని పప్పు బెల్లాల్లా అమ్ముకునే కుట్రకు రేవంత్ ప్రభుత్వం తెరలేపిందని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూడా అడ్డగోలు దోపిడీ మీదనే రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టారన్నారు. లగచర్ల కావొచ్చు, హెచ్‌సియూ భూములు కావొచ్చు. ఇలా ఏది చూసినా దోపిడీనే అని అన్నారు. మాది నమ్మకాన్ని పెంచిన ప్రభుత్వం అయితే, కాంగ్రెస్ అమ్మకాన్ని పెంచిన ప్రభుత్వం అని ఆరోపించారు.

**హౌజింగ్ బోర్డులో ఉన్న ఆరు గజాలు, ఎనిమిది గజాలు కూడా అమ్ముతున్నడు రేవంత్ రెడ్డి**

గతంలో ఇదే రేవంత్ రెడ్డి భూములు అమ్ముకుంటూ పోతే ఎలా, ఆసుపత్రులు, విద్యాలయాలు చివరకు స్మశానాలు ఏర్పాటు చేయడానికి కూడా భూములు మిగలవని తెలిపారు. బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చెప్పిన మాటలు అక్షరసత్యం అని ఈ విషయాన్ని మంత్రి శ్రీధర్ బాబు గారు కూడా కొన్ని ఒప్పుకున్నారన్నారు. 9292 ఎకరాల భూమిని 30శాతం రిజిస్ట్రేషన్ ద్వారా కట్టబెడితే 5వేల కోట్లు వస్తుందని శ్రీధర్ బాబు గారే చెప్పారని గుర్తు చేశారు. 9292 ఎకరాల భూముల విలువ 5లక్షల కోట్లు అని, 5లక్షల కోట్లు విలువైన భూమిని 5వేల కోట్లకే ఎందుకు కట్టబెడుతున్నారని ప్రశ్నించారు. మిగతా నాలుగు లక్షల 95వేల కోట్లు స్కాం కాదా? ఎందుకు కట్టబెడుతున్నారు. దీని వెనుక ఉన్న మత్లబ్ ఏమిటి? అని అన్నారు. 9292లో మొత్తం భూమి కాదు, ఇందులో రోడ్లు, మోరీ పోగా 4740ఎకరాలే ఉంటదని మంత్రి బుకాయించారు నేను అథారిటీగా చెబుతున్నాను. రెవెన్యూ రీసోర్సు మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ ఛైర్మన్‌గా చెబుతున్నా. నాతో పాటు కేటీఆర్ గారు, ప్రశాంత్ గారు ఇతర మంత్రులు ఉన్నారు. ఆరోజు కూడా ఈ ప్రతిపాదన వచ్చిందన్నారు. శ్రీధర్‌బాబుకు నేను సవాల్ చేస్తున్నా.. నిజంగా 4740 ఎకరాలే ప్రభుత్వం పెట్టిందా? దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమా? సగానికి సగం తగ్గించి చూపే ప్రయత్నం చేస్తున్నారని, భూ కుంభకోణం పరిధి తగ్గించే ప్రయత్నం చేసారని ఆరోపించారు. కోర్టు ఆర్డర్ ఉన్నందున ఆనాడు మేము అజామాబాద్ భూముల విషయంలో నిర్ణయం తీసుకున్నాం. ఎస్‌ఆర్‌వో కింద 200 శాతం తీసుకున్నం. ఈనాడు కాంగ్రెస్ మాత్రం 30శాతం కడితే చాలు అంటున్నది అన్నారు.

## దమ్ముంటే ఆధారాలతో నిరూపించు.. లేదంటే క్షమాపణ చెప్పు

హరీష్ రావు 'అవాస్తవాల'పై మంత్రి శ్రీధర్ బాబు స్ట్రాంగ్ కౌంటర్



ప్రజాపక్షం/హైదరాబాద్: 'ఆరోపణలు చేయడం, అబద్ధాలు ప్రచారం చేయడం బిఆర్‌ఎస్ నాయకులు కెటిఆర్, హరీష్‌రావుకు వెన్నతో పెట్టిన విద్య' అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మండిపడ్డారు. తిమ్మిని బమ్మిని చేయడంలో వారిని మించిన వారు మరొకరు లేరని మరోసారి నిరూపించుకున్నారంటూ శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఎద్దేశా చేశారు. వారు పదేపదే ప్రస్తావిస్తున్న రూ.5 లక్షల కోట్ల స్కాం ఆరోపణ పూర్తిగా నిరాధారం, అవాస్తవమని మరోసారి స్పష్టం చేశారు. దమ్ముంటే ఆధారాలను బయటపెట్టి మాట్లాడాలని సవాలు విసిరారు. లేదంటే.. మీరు పదే పదే చేస్తున్న ప్రచారం కేవలం పచ్చి అబద్ధం, రాజకీయ దురుద్దేశం అని ఒప్పుకుని రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 'మీరు అధికారం కోల్పోయారనే బాధతో రూ. 5 లక్షల కోట్ల స్కాం అంటూ పాత రికార్డును పదే పదే వాయించే బదులు... మీరు ఆగస్టు 2023లో తెచ్చిన ఫ్రీహోల్డ్ జీవోల (19, 20, 21) వెనుక ఉన్న 'రూ. లక్షల కోట్ల మతలబు' గురించి ముందు రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలి' అని ఆయన డిమాండ్ చేశారు. గతంలో మంత్రిగా సుదీర్ఘ అనుభవమున్న హరీష్ రావు తమ ప్రభుత్వంపై ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. పారదర్శకంగా రాష్ట్ర ఖజానాకు రూ.4వేల కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల వరకు ఆదాయాన్ని సమకూర్చేందుకు తాము ప్రయత్నిస్తుంటే... స్కాంలు చేసి చేసి అలవాటైన బీఆర్ఎస్ నేతలకు మాత్రం ఇది మింగుడు పడటం లేదన్నారు. సరిగ్గా అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందు ప్రభుత్వ లీజ్ ల్యాండ్స్ కు ఫ్రీహోల్డ్ రైట్స్ ఇచ్చి, 100 శాతం, 200 శాతం ఛార్జీలు విధించి మీరు వసూలు చేద్దామనుకున్న రూ.లక్షల కోట్ల సంగతేంటంటూ ప్రశ్నించారు. అసలు ప్రభుత్వంతో సంబంధం లేని సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై ఆరోపణలు చేస్తే రాష్ట్ర ప్రజలు నమ్ముతారనే భ్రమ నుంచి బయటకు రావాలని బీఆర్ఎస్ నేతలకు సూచించారు. వాస్తవాలను దాచిపెట్టి తమ ప్రభుత్వం 9292 ఎకరాలు అమ్మకానికి పెట్టిందంటూ తమపై దుష్ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ఈ భూముల్లో పరిశ్రమలకు ప్లాటింగ్ చేసిన ఏరియా లేదా ఫ్రీ హోల్డ్ ప్రాపర్టీస్ కేవలం 4,740 ఎకరాలేనని, ఇవి పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూములని స్పష్టం చేశారు. మిగిలిన భూములు రోడ్లు, డ్రైయినేజీ లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించడం జరిగిందన్నారు. ఇప్పటికైనా నిజనిజాలు తెలుసుకుని మాట్లాడాలని హితవు పలికారు.

## ఎనిమిది మంది నాన్‌క్యాడర్ ఎస్‌పిల బదిలీ

ప్రజాపక్షం/హైదరాబాద్: ఎనిమిది మంది నాన్‌క్యాడర్ ఎస్‌పిలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీ అయిన ఎస్‌పిల వివరాలు ఇలా ఉన్నాయి.

| అధికారి పేరు | ప్రస్తుత స్థానం | బదిలీస్థానం |
|---|---|---|
| పి.కరుణాకర్ | పెద్దపల్లి డిసిపి | ఇంటెలిజెన్స్ ఎస్‌పి |
| వై.వి.ఎస్.సుధీన్ద్ర | టాస్క్‌ఫోర్స్ డిసిపి | సైబరాబాద్ ఎస్‌బి డిసిపి |
| బి.సాయిశ్రీ | సైబరాబాద్ ఎస్‌బి డిసిపి | సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్‌పి |
| ఆర్.జగదీశ్వర్‌రెడ్డి | ట్రాన్స్‌కో ఎస్‌పి | ఇంటెలిజెన్స్ ఎస్‌పి |
| వి.అరవింద్‌బాబు | రాచకొండ క్రైమ్ డిసిపి | హైదరాబాద్ సైబర్‌క్రైమ్ డిసిపి |
| దారా కవిత | సైబర్‌క్రైమ్ డిసిపి | సెంట్రల్‌జోన్ డిసిపి |
| ఎం.రవిందర్‌రెడ్డి | ఇంటెలిజెన్స్ ఎస్‌పి | గ్రేహౌండ్స్ ఎస్‌పి |
| ఎన్.అశోక్‌కుమార్ | హైడ్రా అదనపు కమిషనర్ | సిఐడి ఎస్‌పి |

## రాష్ట్రపతికి వీడ్కోలు



ప్రజాపక్షం/హైదరాబాద్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్ పర్యటన ముగించుకుని పుట్టపర్తికి వెళ్ళారు. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మతో కలిసి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆమెకు వీడ్కోలు పలికారు. వారి వెంట మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, డిజిపి బి.శివధర్ రెడ్డి ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

## లైబ్రరీకి వెళ్లి పుస్తకం చదివితే మనసుకు ఆనందం

సిఆర్ ఫౌండేషన్‌లో చిల్డ్రన్స్ లైబ్రరీ ప్రారంభం

మనసు ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ మన్నం వెంకట రాయుడు



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రస్తుతం గూగుల్ లేదా ఇంటర్నెట్ ద్వారా ఎంత సమాచారం కావాలంటే అంత పొందగలుగుతున్నప్పటికీ, లైబ్రరీకి వెళ్లి పుస్తకం చదివితేనే మనస్సుకు ఆనందం కలుగుతుందని మనసు ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ మన్నం వెంకట రాయుడు అన్నారు. హైదరాబాద్ కోండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు (సిఆర్) ఫౌండేషన్‌లో గల నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఆర్‌ఆర్‌సి)లో శనివారం చిల్డ్రన్స్ లైబ్రరీని ముఖ్యఅతిధిగా హాజరైన మన్నం రాయుడు ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఆర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ టి.సురేష్ బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అతిథిగా ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ వాసిరెడ్డి రమేష్ బాబు, సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పాళ్ల నాగేశ్వర రావు, సభ్యులు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, కె.అజయ్ కుమార్, సిఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్న కేశవ్‌రావు పాల్గొన్నారు. కార్యక్రమంలో అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మన్నం రాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం లైబ్రరీలకు అంత ప్రాధాన్యం లేకపోయినా, 50 ఏళ్ల కింద లైబ్రరీలే మనుషుల విశ్రాంతి స్థలం, జ్ఞాన కేంద్రాలుగా ఉండేవన్నారు. ఇప్పటి వరకు తాము దాదాపు మూడు కోట్లపైగా పుస్తకాలను డిజిటలైజేషన్ చేశామని వెల్లడించారు. డాక్టర్ వాసిరెడ్డి రమేశ్ బాబు మాట్లాడుతూ కొత్తగూడెంలో ఒకప్పుడు ఎంతో సంప్రదాయంగా బాలోత్సవం నిర్వహించేవాళ్లమన్నారు. 25 ఏళ్ల కింద ప్రతి ఏటా సుమారు 15 వేల మంది పిల్లలు పాల్గొనే ఈ వేడుకకు ఢిల్లీ, బెంగళూరు వంటి నగరాల నుండి కూడా తెలుగు పిల్లలు వచ్చేవారని గుర్తు చేశారు. 1950, 1960 దశకాలలో గ్రామాల్లో లైబ్రరీలు ప్రజల జ్ఞాన కేంద్రాలుగా ఉండేవన్నారు. జ్ఞానం అంత పుస్తకాల్లోనే ఉంటుందని చెప్పారు. మనిషిగా, మానవునిగా ఎదగాలంటే పుస్తకాలు చదవాలని డాక్టర్ సురేష్ బాబు సూచించారు. ముప్పాళ్ల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ బాలల వికాసానికి లైబ్రరీలు తోడ్పాటును అందిస్తాయన్నారు. ఖగోళం నుంచి భూగోళం వరకు విజ్ఞానం లైబ్రరీలలో ఉంటుందన్నారు. పుస్తక పఠనం తగ్గిపోవడంతో ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలు తగ్గిపోయాయని, ప్రేమాభిమానాలు సన్నగిల్లాయన్నారు. పుస్తక పఠనం ద్వారా అంతరించిపోతున్న మానవ విలువలను కాపాడవచ్చు అన్నారు. సిఆర్ ఫౌండేషన్‌ను ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. డాక్టర్ బి.వి.విజయలక్ష్మి మాట్లాడుతూ ఎన్‌ఆర్‌ఆర్ రీసెర్చ్ సెంటర్‌లో ఇప్పటికే లైబ్రరీ భవనం ఏర్పాటు చేశామన్నారు. లైబ్రరీలో వ్యవసాయం, ఆర్థిక, రాజకీయ, వాణిజ్యం తదితర సమాచారం ఉంటుందని తెలిపారు. సురవరం సుధాకర్ రెడ్డి పుస్తకాలు చదవడం ద్వారా అపారమైన విషయ పరిజ్ఞానాన్ని పొందారని గుర్తు చేశారు. పుస్తకాలు చదవడంతో పాటు రాయడం అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు ఆమె సూచించారు. డైరి రాయడం కూడా పిల్లలు అలవాటు చేసుకోవాలన్నారు.

## ఉదయ్‌ను వెంటనే విడుదల చేయాలి

ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటి విద్యార్థుల సమస్యలపై నిత్యం పోరాడుతున్న ఎఐఎస్‌ఎఫ్ విద్యార్థి నాయకుడు ఉప్పల ఉదయ్‌కుమార్‌ను వెంటనే విడుదల చేయాలని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఒయు అధికారులు నియంతృత్వంగా వ్యవహరిస్తూ డిప్యూటి రిజిస్ట్రార్ శారద ఫిర్యాదు మేరకు అక్రమ కేసు పెట్టి అరెస్టు చేయడాన్ని ఎఐఎస్‌ఎఫ్ ఉస్మానియా రాష్ట్ర సమితి తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ప్రశ్నించే విద్యార్థి నాయకులపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్న ఉస్మానియా అధికారుల తీరుపై పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ప్రజాస్వామ్యం, హక్కుల రక్షణకు భంగం కలిగించకుండా 8వ గ్యారంటీ అమలు చేస్తామని గొప్పలు చెప్పుకుంటున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరోవైపు విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సమస్యలపై గళం విప్పుతున్న విద్యార్థి సంఘాల నాయకులపై కుట్రలు పన్నుతూ.. తమ అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమ కేసులతో వేధిస్తున్నారని మండిపడ్డారు. ఇటువంటి విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించి, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

## మహిళా అసిస్టెంట్ పైలట్‌పై అత్యాచారం

ప్రజాపక్షం/హైదరాబాద్: మహిళా అసిస్టెంట్ పైలట్‌పై పైలట్ అత్యాచారం చేసిన ఉదంతం ఇది. ఈ మేరకు బాధిత అసిస్టెంట్ పైలట్ శనివారం బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. బెంగుళూరులోని ఒక హోటల్‌లో పైలట్ తనపై అత్యాచారానికి ఒడిగట్టాడని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. బేగంపేట నుంచి పుట్టపర్తి, చెన్నై, బెంగళూరుకు బిజినెస్ ఫ్లైట్‌కు వెళ్లింది. ఈ నెల 20న తనపై అక్కడ ఉన్న ఇద్దరు పైలట్‌లలో ఒకరు ఈ అఘాయిత్యం జరిపారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు బేగంపేట పోలీసులు జిరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాధితురాలి నుంచి వాంగ్మూలం రికార్డు చేశారు. నమోదు చేసిన జిరో ఎఫ్ఐఆర్‌తో పాటు బాధితురాలి వాంగ్మూలం రికార్డులను బేగంపేట పోలీసులు ఘటన జరిగిన బెంగళూరులోని హలాసురు పోలీసు స్టేషన్ అందిస్తామని తెలిపారు.

## తెలంగాణ–నార్త్ ఈస్ట్ రాష్ట్రాల సాంస్కృతిక సంగమం

తెలంగాణ–నార్త్ ఈస్ట్ కనెక్ట్, టెక్నో-కల్చరల్ ఫెస్టివల్

మూడు రోజుల పాటు నగర ప్రజలను అలరించిన భిన్న కార్యక్రమాలు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణాకు ఈశాన్య రాష్ట్రాలకు మధ్య పటిష్టమైన సాంస్కృతిక సామీప్యత, చారిత్రకంగా, సామాజిక సామీప్యత చాలా ఉంది. ప్రధానంగా తెలంగాణ, ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, మేఘాలయ, నాగాలాండ్ మిజోరాం, మణిపూర్, త్రిపుర, అరుణాచల్ ప్రదేశ్, సిక్కింలలో వైవిధ్యమైన సాంస్కృతిక ఆచారాలు, ఉత్సవాలు, నృత్య రీతులు, భాషల మధ్య అత్యంత సాన్నిహిత్యం కనిపిస్తుంది. ప్రధానంగా తెలంగాణా రాష్ట్ర సాధనకై జరిగిన సుదీర్ఘ పోరాటంతో 2014లో ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం ఏర్పాటైనది. అదేవిధంగా, స్వయంపాలన, సంస్కృతి పరిరక్షణ, ఆత్మగౌరవ పాలనకై ఈశాన్య రాష్ట్రాలు కూడా ఉద్యమాలు చేశాయి. ఫలితంగా నాగాలాండ్ 1963లోనూ, మేఘాలయ 1972లో ఏర్పాటయ్యాయి. ఇక్కడి జానపదాల కళలు, చేనేతలకు మధ్య కూడా దగ్గరి సామీప్యత ఉంది. ఈశాన్య రాష్ట్రాలలో దేశంలోనే అత్యధిక గిరిజన జనాభా ఉండగా తెలంగాణలోనూ ఆదివాసీ, లంబాడీ, గోండు, యానాది తదితర గిరిజన తెగలున్నాయి. అయితే, ఈ ఇరు ప్రాంతాల మధ్య కళా, సాంస్కృతిక, చారిత్రక, క్రీడా, వ్యవసాయ సాంస్కృతిక బంధం మరింత పటిష్ట అయ్యే విధంగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, హైదరాబాద్‌లో మొట్టమొదటిసారిగా తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్, టెక్నోకల్చరల్ ఫెస్టివల్‌కు రూపకల్పన చేయడమే కాకుండా, ప్రభుత్వ సహకారంతో అద్భుతంగా నిర్వహించారు. నవంబర్ 20, 21, 22 తేదీల మధ్య జరిగిన ఈ తెలంగాణ నార్త్ ఈస్ట్ ఫెస్టివల్ నభూతో, నా భవిష్యత్ మాదిరిగా జరిగింది. కర్త, కర్మ, క్రియ అన్నీ తానుగా పర్యవేక్షించిన గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఈ ఫెస్టివల్ విజయానికి పరోక్ష కారకులయ్యారు. తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఈశాన్య రాష్ట్రాల గవర్నర్లు పాల్గొన్న ప్రారంభ సమావేశంతో మొదలైన ఈ మూడు రోజుల కళా, సాంస్కృతిక, క్రీడా, సామాజిక ఉత్సవం 22వ తేదీన ముగిసింది. ఫైన్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, లిటరేచర్, విమెన్ ఎంపవర్‌మెంట్, ఫిలిం ఫెస్టివల్, స్పోర్ట్స్ రంగాల్లో ఇరు ప్రాంతాల మధ్య ఉన్న బంధాన్ని తెలియచేసేవిధంగా అద్భుతమైన కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం హైటెక్స్‌లో జరిగిన ముగింపు సమావేశంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మలు పాల్గొనడంతో ఈ మూడు రోజుల కార్యక్రమాలు అద్భుతంగా ముగిశాయి. తిరిగి, రెండవ విడత కార్యక్రమాలు నవంబర్ 25 నుండి 27 వరకు హైదరాబాద్‌లో జరుగనున్నాయి.





హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్.

బహిరంగ ప్రకటన HMDA చట్టం 2008 యొక్క U/S 15 (4) ప్రకారం
(G.O.Ms. No. 243 MA & UD డిపార్ట్‌మెంట్ తేదీ 15.11.2025)

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం 2008 (2008 చట్టం నెం.8) లోని సెక్షన్ 15లోని సబ్‌సెక్షన్ (1) ద్వారా ఇవ్వబడిన అధికారాలను వినియోగించుకుంటూ ప్రభుత్వం ఆమోదించిన నోటిఫైడ్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ ప్లాన్-2031 ప్రకారం ఊహించిన భూవినియోగానికి ప్రభుత్వం ఇందుమూలంగా ఈ క్రింది మార్పును చేస్తోంది. G.O.Ms. No. 33 MA & UD తేదీ 24.01.2013, చెప్పబడిన ఆ సెక్షన్ యొక్క సబ్‌సెక్షన్ (1) ప్రకారం అవసరం.

సంగారెడ్డి జిల్లా, రామచంద్రాపురం మండలం, ఎదులనాగులపల్లె (గ్రామం) వద్ద 11753.23 చదరపు మీటర్లు లేదా 2.90 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న సర్వేనెంబర్ 15/A2 లోని స్థలం ప్రస్తుతం రవాణా వినియోగ జోన్ (T5) రవాణా వినియోగానికి కేటాయించబడింది. ఇది ప్రభుత్వం G.O.Ms.No. 33 MA & UD డిపార్ట్‌మెంట్ తేదీ:24.01.2013 ద్వారా నోటిఫై చేయబడిన MDP-2031 కోసం నోటిఫైడ్ మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇప్పుడు నివాస వినియోగ జోన్‌గా గుర్తించబడింది.

పైన పేర్కొన్న వివరాలు http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయి.

సం/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (PR)
DIPR R.O. No. : 11201-PP/CL/ADVT/1/2025-26, Date: 22-11-2025 HMDA

## వేర్వేరు ప్రమాదాల్లో ఇరువురు మృతి



ప్రజాపక్షం/చిట్యాల: నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలో 65వ నెంబర్ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాలలో ఇరువురు యువకులు మృత్యువు పాలయ్యారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మిర్యాలగూడకు చెందిన నకిరేకంటి సైదులు(21) హైదరాబాద్ నుండి మిర్యాలగూడకు ద్విచక్ర వాహనంపై బయలు దేరగా ఈ తెల్లవారు జామున గుండ్రాంపల్లి గ్రామ సమీపంలో వాహనం అదుపు తప్పి రోడ్డు దిగువన ఉన్న చెట్టుకు ఢీకొనడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ప్రమాదంలో మండలంలోని పేరేపల్లి గ్రామానికి చెందిన అంతటి రవి(36) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. చిట్యాలకు కిరాయికి వచ్చి తిరుగి తన గ్రామానికి వెలుతుండగా పెద్ద కాపర్తి సమీపంలో గల కాలువలోకి ఆటో పల్టికొట్టిన ఘటనలో రవి అక్కడికక్కడే మరణించడం జరిగింది. ఈ రెండు సంఘటనలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మామిడి రవికుమార్ తెలిపారు

## సమస్యలను పరిష్కరించండి



ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండా మండల సిపిఐ పార్టీ శ్రేణులు శనివారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్యను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ బీర్ల అయిలయ్యకు మండలంలోని పలు సమస్యలను వివరించి వాటిని త్వరతిగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరడంతో తక్షణమే స్పందించిన ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం పొత్తులో భాగంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా సిపిఐ పార్టీకి ప్రాధాన్యత కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామ చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు ఆది సాయన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు హరిచంద్ర పాల్గొన్నారు.



## మహిళల కోసం ఇందిరమ్మ చీరలు

### నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

ప్రజాపక్షం/చిట్యాల: మహిళలకు నాణ్యమైన చీరలను అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెలుతుందని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. పట్టణంలో శనివారం జరిగిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రెండు విడతలుగా ఇందిరమ్మ చీరలను రాష్ట్ర మహిళలకు అందించడం జరుగుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను ఆదరించి అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సహాయ నిధి, షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ శ్రీనివాస్‌రావు, మార్కెట్ కమిటి చైర్మన్ నర్రా వినోద, మున్సిపాలిటి మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వెలిమినేడు పిఏసిఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి

### నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి



ప్రజాపక్షం/హాలియా: మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా చేయూత అందిస్తుందని నాగార్జునసాగర్ ఎంఎల్ఏ కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు. శనివారం హాలియాలోని లక్ష్మీనరసింహ గార్డెన్స్ లో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా ఆదుకునేందుకు వడ్డీ లేని రుణాలను పంపిణీ చేస్తుందని మహిళల కోసం తమ ప్రభుత్వం పెట్రోల్ బంక్ లు, మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేసి ఆర్థిక చేయూత అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,పీడీ రాజ్ కుమార్,ప్రత్యేక అధికారి బిక్షపతి,ఏడీఏ సరిత, తహసిల్దార్ రఘు,కమిషనర్ రామదుర్గారెడ్డి,కర్నాటి లింగారెడ్డి, మార్కెట్ చైర్మన్‌లు తుమ్మలపల్లి చంద్రశేఖర్ రెడ్డి,అంకతి సత్యం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుందూరు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## మహిళలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేస్తాం

### మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి




ప్రజాపక్షం /మునుగోడు: ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా మా ప్రభుత్వం నెరవేరుస్తుందని మునుగోడు ఎంఎల్ఏ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడి అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి చీరలను మండల మహిళలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం మహిళలను చిన్నచూపు చూస్తూ బతుకమ్మ చీరల పేరుతో నాణ్యతలేని చీరలను పంచి మహిళలను అవమానపరిచారని మండిపడ్డారు. గత ప్రభుత్వం చేసిన అప్పులను తీరుస్తూనే తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి,చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి,ఇన్చార్జి తహసిల్దార్ నరేష్, ఎంపీడీవో యుగంధర్, ఏపీఎం భాస్కర్, మండలంలోని వివిధ గ్రామాల మహిళా సంఘాల లీడర్లు మహిళలు పాల్గొన్నారు.

## గంజాయితో పట్టుబడ్డ యువకుడు



ప్రజాపక్షం/తుర్కపల్లి : ఉప్పల్ నుంచి కొముురవెల్లికి గంజాయి సరఫరా చేస్తున్న యువకుడు పోలీసులకు పట్టుబడ్డ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో చోటుచేసుకుంది. తుర్కపల్లి ఎస్సై తక్యుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం శనివారం ఉదయం సమయంలో బీబీనగర్ మండలం బట్టుగూడెం గ్రామానికి చెందిన పార్వతీ లాలి(23) అనే వ్యక్తి మోటార్ సైకిల్ పై అక్రమంగా గంజాయిని తరలిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో తుర్కపల్లి గ్రామ శివారులోని కరెంట్ సబ్ స్టేషన్ వద్ద యువకుణ్ణి, స్ప్లేండర్ ప్లేస్ టీఎస్ 30H1925 వాహనాన్ని తనిఖీ చేయగా ఒక కవర్లో సుమారు 100 గ్రాముల గంజాయి పట్టుబడిందని తెలిపారు. జిల్లా జోన్ డీసీపీ ఆకాంక్ష్ యాదవ్, ఏసీపీ శ్రీనివాస్ నాయుడు పర్యవేక్షణలో నిందితుడి వద్దనుంచి 100 గ్రాముల గంజాయి, మోటార్ సైకిల్, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మాదకద్రవ్యాలు, డ్రగ్స్ స్మగ్లింగ్ చేసినా, అసాంఘిక కార్యక్రమాలు చేపట్టినా చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మత్స్యకారుల బలోపేతానికి కృషి



ప్రజాపక్షం/పెన్‌పహాడ్ : మత్స్యకారుల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ముత్యాలమ్మ చెరువులో సీనియర్ నాయకులు తూముల భుజంగరావు, పోతు భాస్కర్‌లతో కలిసి ఉచిత చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచిత చేప పిల్లల పథకం మత్స్యకారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వారు ఆర్థికంగా బలోపేతానికి దోహదపడుతుందని చెప్పారు.గూడెపుకుంట తండలో నూతన పంచాయితీ కార్యాలయానికి శంఖుస్థాపన చేశారు. అనంతరం మాచారం గ్రామంలో బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరిన పలువురు కార్యకర్తలకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

## మహిళలను కోటీశ్వరులుగా చేయడానికి

# రైస్ మిల్లులు ఏర్పాటు చేయిస్తాం

### నల్లగొండ నుండే పైలట్ పద్ధతిలో ప్రారంభించేందుకు చర్యలు

### ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీలో మంత్రి కోమటిరెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తెచ్చిదిద్దాలన్న సంకల్పంతో మహిళల కోసం ఉచిత బస్సుసౌకర్యం,బస్సులు, పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ ద్వారా ఆర్థికంగా వారి కాళ్లపై వారు నిలబడేందుకు చర్యలు తీసుకుంటున్నదని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు.ప్రభుత్వమే మహిళా సంఘాలకు రుణం మంజూరు చేసి ఆర్‌అండ్‌బి శాఖ ద్వారా రైస్ మిల్లులు నిర్మిస్తామని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.శనివారం అయన జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఉదయాదీత్య భవన్లో ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీకార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు చీరలను పంపిణీ చేశారు. మహిళలను కోటీశ్వరులను చేయడంలో భాగంగా రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా పైలెట్ పద్ధతిన నల్లగొండ జిల్లాలో మహిళల చేత రైస్ మిల్లులు ఏర్పాటు చేయిస్తామని, జిల్లాలో రైస్ మిల్లుల కొరతను ఈ విధంగా తీరుస్తామని,ఇందుకుగాను వారికి ముందుగా రుణాలు అందజేసి రైస్ మిల్లులను వారే నిర్వహించుకునేలా దానిపై వచ్చే లాభం ద్వారా ప్రతినెల తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించేలా, తద్వారా లాభం పొందే విధంగా చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు. ఇందుకుగాను అవసరమైన స్థలాలను చూడాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి వచ్చే క్యాబినెట్ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా రైస్ మిల్లులు ఏర్పాటు చేసే విషయంపై చర్చించి నిర్ణయం తీసుకునేలా చూస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 29 వేల కోట్ల రూపాయలు ఇందిరమ్మ ఇండ్లపై ఖర్చు చేయడం జరుగుతున్నదని,400 కోట్లతో నల్లగొండ జిల్లాలో డబుల్ రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా మంత్రి ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ తో పాటు, నల్గొండ నియోజక వర్గానికి సంబంధించి రెండు కోట్ల 20 లక్షల రూపాయల విలువ చేసే కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ హాఫీజ్ ఖాన్, ఇన్చార్జి డిఆర్ఓ అశోక్ రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మాధవి ,మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్, డిసిసిబి డైరెక్టర్ సంపత్ రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆధార్ మ్యాండేటరీ బయోమెట్రిక్ పూర్తి చేయాలి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : విద్యార్థుల ఆధార్ మ్యాండేటరీ బయోమెట్రిక్ పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు సూచించారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన బయోమెట్రిక్ ఆపరేటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలానికి ఒక ఆపరేటర్‌ను ఎస్.ఎన్.ఆర్ ఏజెన్సీ వారి ద్వారా రాష్ట్ర కార్యాలయం నియమించినట్లు తెలిపారు. అన్ని పాఠశాలలో విద్యార్థులు ఆధార్ సవరణలు (పేరు, పుట్టిన తేది) చేసి అలాగే మ్యాండేటరీ బయోమెట్రిక్‌లు కూడా అప్‌డేట్ చేయాలని సూచించారు. ఇట్టి అప్‌డేట్‌లు జిల్లా వ్యాప్తంగా 24,532 విద్యార్థులకు చేయాలన్నారు. ప్రతి ఒక్కరు 10 సంవత్సరాలకి ఒకసారి బయోమెట్రిక్ అప్‌డేట్ చేయాలి కాని తల్లిదండ్రులు తెలియక చాలా మందికి చేయించలేదన్నారు. ప్రతి ఒక్క ఆపరేటలకు పాఠశాలల వారిగా ఉన్న వివరాలను ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇట్టి ఏజెన్సీ ఆపరేటర్లు పాఠశాలకు వెళ్ళి విద్యార్థుల బయోమెట్రిక్స్ త్వరితగతిన పెండింగ్ ఉన్న వారివి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోఆర్డినేటర్ ప్రవీణ్, జిల్లావిద్యాశాఖ అధికారి అశోక్, శ్రవణ్ కుమార్, సూర్యనారాయణ, జిల్లా సెక్టోరియల్ అధికారులు ఆపరేటర్లు పాల్గొన్నారు.

# చెన్నారెడ్డి అడుగుజాడల్లో నేటి యువత...

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : డిసెంబర్ 26న ఖమ్మంలో జరుగుతున్న సిపిఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా తిరుగుతున్నటువంటి ప్రచార .జాత యాదగిరిగుట్టలో రెండో రోజు కొనసాగింది. శుక్రవారం కాచారం చౌరస్తాలో ఉన్న స్వాతంత్ర సమరయోధులు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు పరెడ్డి చెన్నారెడ్డి, భద్రారెడ్డి, దుంపల మల్లారెడ్డిల స్మారక స్థూపాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతాకు నాయకత్వం వహిస్తున్న సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం జరిగినటువంటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొని పోరాటాలు చేసిన నాయకులు చెన్నారెడ్డి అని వారి అడుగుజాడల్లో నేటి యువత పనిచేయాల్సినటువంటి అవసరం ఉందని అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరుగుతున్న సిపిఐ శతజయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రి, రైతు సంఘం రాష్ట్ర కోశాధికారి డిజి నరేంద్ర ప్రసాద్, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పలయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు గోదా శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, కొల్లూరు రాజయ్య, బండి జంగమ్మ, ఎండి ఇమ్రాన్, పెరబోయిన మహేందర్, మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్, మున్సిపల్ శాఖ కార్యదర్శి బబ్బురి శ్రీధర్, ఇంజా హేమలత, పెరబోయిన బంగారి రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు మెరుగైన వైద్యం

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపి, ఎమ్మెల్యే



ప్రజాపక్షం/బీబీనగర్ : మండల కేంద్రంలో 15వ ఆర్థిక సంఘం నిధుల నుండి ఒక కోటి 56 లక్షల రూపాయల నిధులతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం భువనగిరి పార్లమెంట్ సభ్యులు సామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, జిల్లా కలెక్టర్ హనుమంతరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని పేద ప్రజలకు ప్రభుత్వ వైద్యం పైన నమ్మకం కలిగించాలని కోరారు. మండల కేంద్రంలో ఉన్న అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా మండలంలోని గొల్లగూడెం గ్రామానికి రూ.30 లక్షలు, రావిపహడ్ గ్రామానికి రూ.40 లక్షలు, రావిపహడ్ తండా గ్రామానికి రూ.20 లక్షలు, మాదారం గ్రామానికి రూ.30 లక్షల నిధులతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, డిఎంహెచ్ఓ మనోహర్, ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టర్ మౌనికా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పింగాల్ రెడ్డి పాల్గొన్నారు.

## పత్తి రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

### కాటేపల్లి సిసిఐ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ



ప్రజాపక్షం/మోటకొండూర్: పత్తి మిల్లులలో పత్తి రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. ఆయన శనివారం మోటకొండూర్ మండలంలోని కాటేపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రం, సిసిఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనికి చేశారు. రోజు వారీగా ఎన్ని స్లాట్‌లు బుక్ అయితున్నాయని, ఎంత మంది రైతులు పత్తి తీసుకొని వస్తున్నారని, అందులో ఎంత తేమ శాతం వచ్చిన పత్తి ఉంటుందని, ఇప్పటి వరకు ఎంత పత్తి కొనుగోలు చేశారని రిజిస్టర్‌లు చెక్ చేశారు. రైతులను ఎలాంటి ఇబ్బందులు పెట్టకూడదని, వాళ్లకు డబ్బులు కూడా వెంటనే పడేలా నిర్వాహకులు చొరవ తీసుకోవాలి అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారని, కేంద్రంలో ఇంకా ఎంత ధాన్యం ఉందని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ధాన్యం టాబ్ ఎంట్రీ పూర్తి అయిందా, రైతులకు వాళ్ల అకౌంట్‌లలో డబ్బులు పడ్డాయా, రోజు సరిపడా లారీలు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.

# యువత శక్తివంతంగా ఉంటేనే దేశం శక్తివంతం

### నేటి యువత తమ ప్రతిభను వెలికి తీసి దేశ అభివృద్ధి దిశగా అడుగులు

### రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : యువత చదువులోనేకాకుండా,సంస్కృతి,కళలలు, సాహిత్యం, పెయింటింగ్ రంగాలలో రాణించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అన్నారు.జిల్లా యువజన , క్రీడల శాఖ ఆధ్వర్యంలో2025 26 జిల్లా స్థాయి యువజన ఉత్సవాలను శనివారం ఆయన కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి మెమోరియల్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ప్రారంభించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ఉత్సవాలను ప్రారంభించారు.యువతను ఉద్దేశించి జె సి మాట్లాడుతూ నేటి యువత తమ ప్రతిభను వెలికి తీసి దేశ అభివృద్ధి దిశగా అడుగులు వేయాలని, స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. యువత శక్తివంతంగా ఉంటే దేశం శక్తివంతంగా ఉంటుందని, మీభవిష్యత్తును నిర్ణయించే శక్తి మీలోనే ఉందని,స్వామి వివేకానంద బోధనలు ప్రతి యువతలో దృఢ సంకల్పం, ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ పెంచుతాయని అన్నారు. గమ్యస్థానం చేరుకునే దాకా ప్రతి ఒక్కరు కృషి చేయాలని, మీలో ఉన్న ఉత్తేజం దేశానికి, శక్తికి ప్రతిక కావాలని,యువత చదువులోనే కాకుండా సంస్కృతి ,కళలలు, సాహిత్య రంగంలో రాణించాలని, వివేకానందుడు ప్రపంచానికి భారతీయ సంస్కృతి, విలువలు, యువత శక్తిని గుర్తు చేసిన మహానుభావుడు అని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడ ల అభివృద్ధి అధికారి అక్బర్ అలీ, కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి కాలేజీ ప్రిన్సిపల్ ఉపేందర్,ఒకేషనల్ ప్రిన్సిపల్ రాకేంద్,నాగార్జున డిగ్రీ ఓపెన్ కళాశాల ప్రిన్సిపల్ బొజ్జ అనిల్ ,కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ మనిషా సింగ్, బాలు పాల్గొన్నారు.




## ప్రమాదాల నివారణ కోసం పోలీస్ శాఖ కృషి

ప్రజాపక్షం/సూర్యాపేట : రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం సూర్యాపేట జిల్లా పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. శనివారం సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాంతో కలిసి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారి 65 కొత్త వ్యవసాయ మార్కెట్ రోడ్ జంక్షన్‌ను పరిశీలించారు. వాహనాల యొక్క వేగం, ప్రజల రాకపోకలు, రోడ్డు క్రాసింగ్, ఇంజనీరింగ్ లోపాలు, లైటింగ్ ఏర్పాట్లు, బారికేడ్‌ల ఏర్పాటు మొదలగు అంశాలను పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా పోలీసులు ప్రజల రక్షణకై పనిచేస్తున్నామని తెలిపారు. బ్లాక్ స్పాట్స్ వద్ద స్థానిక ప్రజలు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. రోడ్డు ప్రమాద స్థలాల వద్ద స్థానిక ప్రజలు జాగ్రత్తగా ఉంటూ రోడ్లు దాటాలని విజ్ఞప్తి చేశారు. వేగ నియంత్రణతో వాహనాలు నడపాలని, రోడ్ల వెంట ఎక్కడపడితే అక్కడ వాహనాలను పార్కింగ్ చేయవద్దని సూచించారు. ప్రమాదాల నివారణ కోసం జిల్లా వ్యాప్తంగా 43 రోడ్డు ప్రమాద నివారణ కమిటిలను ఏర్పాటు చేశామన్నారు.



# 30 శాతం పెంచుతూ.. దుకాణాలు సొంతం

### ఉపాధికి టెండర్లకు స్థానికుల డిమాండ్

### వైటిడిఎ నిధులు రూ.కోట్లు వృథా!

### నిధుల లేమితో పూర్తికాని దుకాణ సముదాయాలు

### చెట్లు మొలిచి నిరుపయోగం


### వర్తకులకు అప్పగించడంలో మరింత ఆలస్యం



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : విశ్వక్షేత్రంగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానంలో వర్తక వెల్ఫేర్ సంఘం పేరుతో వర్తకులు ఏకమై గత ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొండపైన దుకాణాలు ఏర్పాటు చేశారు. కానీ, వర్తక సంఘం దుకాణాలు టెండర్లు నిర్వహించకుండా ప్రభుత్వ పాలకులు, నిబంధనలు కఠినంగా అమలు చేసే అధికారులు ఎందుకు వదిలేస్తున్నారో ఎంతకి అంతు చిక్కడం లేదు. దేవస్థానానికి చెల్లించాల్సిన మొత్తం రెన్యువల్ చేయాల్సిన ప్రతిసారి 30 శాతం పెంచుతూ ఆ దుకాణాలను వర్తకులే సొంతం చేసుకుంటున్నారు. టెండర్ల ద్వారా కొండపైకి చేరిన వర్తకులు పలుకుబడితో ఏళ్ల తరబడి కొండపైన స్థిరపడి దుకాణాలను శాశ్వతం చేసుకుంటున్నారు. టెండర్ల ద్వారా దక్కించుకున్న దుకాణాల యజమానులు ఏటేటా శాశ్వతంగా దేవాదాయ శాఖ నుండి అనుమతి పొంది ఇక్కడ వర్తక సంఘంలో చేరిపోతున్నారు. వీరికి సంబంధించిన దుకాణాలకు తక్షణమే టెండర్ నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తూ దేవాదాయ శాఖ, యాదగిరిగుట్ట దేవస్థానం ఈవోకు స్థానికులు వినతి పత్రాలు అందజేశారు. వర్తక సంఘంలోని దుకాణాలకు టెండర్లు నిర్వహిస్తేనే ఔత్సాహికులకు అవకాశం ఉంటుంది. ఎందుకంటే వర్తక సంఘంలోని దుకాణదారులే మిగతా దుకాణాలకు టెండర్లు నిర్వహిస్తే ఔత్సాహికులకు దక్కకుండా అవకాశం రాకుండా అడ్డు తగులుతారు. దేవస్థానంలోని అన్ని దుకాణాలకు టెండర్ నిర్వహించి ఔత్సాహికులు, స్థానికులకు ఉపాధి కోసం డిమాండ్ పెరుగుతుంది. అయినప్పటికీ ఆలయ అధికారులు మాత్రం వాటి రెన్యువల్‌కే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

2022లో ఆలయం పునరుద్ధాటన తర్వాత నేటికీ నిర్మాణాలు పూర్తి కాలేదని స్థానికులు అసంతృప్తి చెందుతున్నారు. రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన దుకాణాల సముదాయాలు నిరుపయోగంగా ఉన్నాయి. కొండ కింద ఆధ్యాత్మిక వాడలో యాదగిరిగుట్ట పట్టణ ప్రధాన రహదారి నిర్వాసితుల కోసం వైటీడీఏ ఆధ్వర్యంలో గత ప్రభుత్వం దుకాణ సముదాయాలు నిర్మించింది. అవి ఇంకా పూర్తి కాకపోవడంతో కంపచెట్లు మొలిచి నిరుపయోగంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారాయి. పాలకులు, అధికారులు దృష్టి సారించకపోవడం చేత నిర్వాసితులకు న్యాయం చేయలేకపోతున్నారు. ప్రభుత్వ పాలకులు, దేవాదాయ శాఖ అధికారులు వీటి నిర్మాణాలు కూడా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టలేకపోతున్నారు.

ఈ దేవస్థానంలో కొంతమంది వర్తకులు సబ్‌లీజుకు ఇతర వ్యక్తులకు అంటగడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. దుకాణాల నిర్వహణకు పలుకుబడిని ఉపయోగించి చర్చల్లో పాల్గొనేందుకు వారే ముందుంటారు. వర్తక సంఘం పేరుతో పైరవీలు చేసి వారి దుకాణాలకు టెండర్లు జరగకుండా ప్రభుత్వ పాలకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ కోట్లల్లో ఆలయ ఆదాయానికి గండి కొడుతున్నారు. అధికారులు కూడా సొమ్ము చేసుకొని పైరవీల బూచి చూపుతూ వర్తకులను గట్టెక్కిస్తూ వస్తున్నారని ఆరోపణలు వెలబడుతున్నాయి. ఈ వర్తకులే దేవస్థానంలో మిగతా విభాగాల్లో నిర్వహించే టెండర్లల్లో ఔత్సాహికులకు అవకాశం రాకుండా అడ్డు తగులుతున్నారు. వర్తకులు నిర్వహించే దుకాణాలకు ఏటేటా టెండర్లు నిర్వహిస్తే దేవస్థానానికి రూ.కోట్లల్లో ఆదాయం సమకూరుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకు గాను దేవస్థాన అధికారులకు వినతి పత్రాలు సమర్పిస్తూ వర్తక సంఘంలోని దుకాణాలకు తక్షణమే టెండర్లు నిర్వహించాలని దేవాదాయ శాఖ ఉన్నతాధికారులను స్థానిక భక్తులు డిమాండ్ చేశారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## నమో భారత్ రైళ్లలో ప్రైవేట్ వేడుకలు

**న్యూఢిల్లీ:** ఇక నుంచి నమో భారత్ రైళ్లు ప్రైవేట్ వేడుకలకు వేదికలుగా మారనున్నాయి. పుట్టినరోజులు, పెళ్లిరోజులు, పెళ్లిళ్లకు ముందు చేసే ఫొటోషూట్‌లు, ఇత ప్రైవేట్ కార్యక్రమాలకు రైలు బోగీలను అద్దెకు ఇచ్చేలా 'నేషనల్ క్యా పిటల్ రీజియన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్' కీలక నిర్ణయం తీసుకుంది. వ్య క్తులు, ఈవెంట్ ఆర్గనైజర్‌లు, ఫొటోగ్రఫీ సంస్థలు ఈ సౌకర్యాన్ని వినియోగి ంచుకోవచ్చు. స్టేషన్లలో నిలిపి ఉంచిన బోగీలనుగానీ, లేదంటే కదులుతున్న నమో భారత్ రైలు బోగీలనుగానీ వినియోగదారులు అద్దెకు తీసుకోవచ్చు. వే డుకల కోసం దుహాయ్ డిపో వద్ద ఒక నమూనా బోగీని అలంకరించి ఎప్పు డూ అందుబాటులో ఉంచుతారు. బోగీలకు బుకింగ్ చార్జీలను గంటకు రూ .5,000గా నిర్ణయించారు. వేడుకకు అవసరమైన డెకరేషన్ సామాగ్రి సెట్ చే సుకునేందుకు మరో 30 నిమిషాల సమయం అదనంగా ఇస్తారు. అయితే ఉ దయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల మధ్య మాత్రమే వేడుకలకు అనుమతి ఉంటుంది. వేడుకలు జరుపుకునే వారు సాధారణ రైలు కార్యకలాపాల కు ఎలాంటి అంతరాయం కలిగించకుండాచూసుకోవాల్సి ఉంటుంది.

## భాష ఆధారంగా ప్రజలను విభజించేందుకు బిజెపి యత్నం



శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రే విమర్శ

**ముంబయి:** మహారాష్ట్రలో అధికార బిజెపిపై శివసేన (యుబిటి) తీవ్రంగా మండిపడింది. భాష ఆధారంగా ప్రజలను విభజించడానికి ప్రయత్నిస్తోందని శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాక్రే ఆరోపించారు. శనివారం ఆయన ముంబయిలో పార్టీల కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ బిజెపిని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడే పార్టీగా అభివర్ణించారు. వారి హిందూత్వ బెలూన్ పగిలిపోయిందని ఎద్దేవా చేశారు. బిజెపి భాషాపరమైన విభజనకు పాల్పడుతూ భాష ఆధారంగా ప్రజలను చంపాలనే ఉద్దేశం తమది కాదని చిలకపలుకులు పలుకుతోందని విమర్శించారు. మరాఠీలో మాట్లాడకూడదనే వాదనతో స్థానిక రైలులో ఒక అల్లరి మూక తనపై దాడి చేసిన తర్వాత థానే జిల్లాలో 19 ఏళ్ల విద్యార్థి అర్నవ్ ఖైరే ఆత్మహత్య చేసుకున్న ఘటనను ఆయన ప్రస్తావించారు. మొదటి సంవత్సరం సైన్స్ విద్యార్థి మంగళవారం సాయంత్రం కళ్యాణ్ తూర్పులోని తన అపార్ట్‌మెంట్‌లో ఉరి వేసుకున్నాడని, ఏ భాష కూడా మరొక భాషకు అన్యాయం చేయకూడదని థాక్రే హితవు పలికారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ విషాన్ని వ్యాపింపజేస్తున్నాయని, పదే పదే తమను నిందిస్తున్నాయని ఆయన ఆరోపించారు.

# 'పూర్తి సంతృప్తి'తో...వెళుతున్నా

### 52వ భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్

పదవీవిరమణకు ముందురోజైన శనివారం సిజెఐకి ఘనవీడ్కోలు

రేపు కొత్త సిజెఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణం



**న్యూఢిల్లీ :** భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బి.ఆర్.గవాయ్ తన ఆరునెలల పదవీకాల సమయంలో దేశంలోని వివిధ హైకోర్టులకు షెడ్యూల్డ్ క్యాస్ట్ (ఎస్‌టి) కేటగిరీకి చెందిన 10మంది న్యాయమూర్తులు, 11మంది వెనకబడిన తరగతుల(బిసి)కు మరియు వెనకబడిన తరగతులకు చెందిన జడ్జిలు నియమితులయ్యారు. భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయ్ ఆదివారం (నవంబరు 23న) పదవీవిరమణ చేయనున్నారు. ఆయన వారసుడు జస్టిస్ సూరకాంత్ నవంబరు 24న నూతన భారత ప్రధాన న్యాయమూర్తిగా...53వ సిజెఐగా ప్రమాణస్వీకారం చేయబోతున్నారు. భారత న్యాయవ్యవస్థకు అధిపతిగా కె.జి.బాలకృష్ణన్ తర్వాత రెండవ దళిత సిజెఐగా విధులు నిర్వర్తిస్తున్న బి.ఆర్.గవాయ్‌కు నేటి (శనివారం) చివరిపనిదినంతో ఆయన పదవీకాలం ముగిసింది. కాగా, చివరి పనిదినమైన శనివారం భారత ప్రధాన న్యాయమూర్తిగా పదవీవిరమణ చేస్తున్న బి.ఆర్.గవాయ్‌కు అత్యున్నత న్యాయస్థానానికి చెందిన పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలకడంతో ఆయన సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఈ సందర్భంగా బి.ఆర్.గవాయ్ మాట్లాడుతూ 'ఒక న్యాయ విద్యార్థి'గా, ఒక 'న్యాయవాది'గా, ఒక 'జడ్జి'గా నాలుగు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణంలో పూర్తి సంతృప్తి...సంతృప్తి భావనతో తాను అత్యున్నత న్యాయస్థానాన్ని విడిచి వెళుతున్నాను' అని గద్గద స్వరంతో అన్నారు.జస్టిస్ గవాయ్ దేశానికి చెందిన మొదటి బౌద్ధ, రెండవ దళిత ప్రధాన న్యాయమూర్తిగా ముగ్గురు సభ్యుల సుప్రీంకోర్టు కొలీజియంకు నేతృత్వం వహించారు. ప్రభుత్వానికి నియామకం కోసం సిఫారసు చేసిన 129 పేర్లలో 93పేర్లను ఆమోదించడంతో వారి నియామకాలు జరిగాయి. ఆయన పదవీకాలంలో ఐదుగురు జడ్జిలు...జస్టిస్ ఎన్.వి.అంజారియా, విజయ్ బిష్ణోయ్, ఎ.ఎస్.చందుర్కర్, అలోక్ అరాధే, విపుల్ మనుభాయ్ పంచోలి అత్యున్నత న్యాయస్థానానికి నియమితులయ్యారు. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో మే 14నుంచి నియామకమైన జడ్జిల వివరాలు అప్‌లోడ్ అయి న ప్రకారం... సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బి.ఆర్.గవాయ్ నియమితులైనప్పటి నుండి ప్రభుత్వం హైకోర్టుకు ఆమోదించిన 93 మంది పేర్లలో మైనారిటీ కమ్యు నిటీల నుంచి 13 మ ంది జడ్జిలు సహా 15మంది మహిళా న్యాయమూర్తులు కూడా వారిలో ఉన్నారు. వాటిలో 5 మాజీ లేదా ప్రస్తుతం పనిచేస్తున్న 45మంది జడ్జిలు బా ర్ నుంచి నియమింబచడగా, మిగిలినవా రుస ర్వీస్ కేడర్ నుంచి నియమించబడ్డారు. 5 2 వ భారత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్.గ వాయ్ తన ఆరునెలల పదవీకాలంలో అద్భుతమై న తీర్పులు ఇచ్చారు. వాటిలో వక్ఫ్ చ ట్టంలోని కీ లక నిబంధనలు, ట్రిబ్యునల్ సంస్కరణల నుకొ ట్టివేయడం,ప్రాజెక్ట్‌లకు పోస్ట్ ఫాక్టో గ్రీన్ నోడ్స్ మంజూరు చేయడానికి కేంద్రాన్ని అనుమతించింది.



## డిఎంకెతో సీట్ల పంపకాలపై చర్చలకు ఐదుగురు సభ్యులతో కమిటీ

కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె. సెల్వపెరుంతగై ప్రకటన

**ఛెన్నై:** ఇటీవల బిహార్‌లో జరిగిన అసెంబ్లీ ఎ న్నికల్లో కాంగ్రెస్ అత్యంత పేలవ ప్రదర్శన ను కనబరిచిన విషయం తెలిసిందే. అయితే నామినేషన్ల గడువు ముంచుకొచ్చి నా సీట్ల పంపకాలపై తేలకపోవడంతో ప్రచారం సరిగా నిర్వహించలేకపోయార ని, కొన్ని చోట్ల మహాగట్బంధన్ కూటమిలోనే భాగస్వామ్య పక్షాలే ఫ్రెండ్లీ పోటీ చేయడం కాంగ్రెస్ ఇతర పార్టీలపై తీవ్ర ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాదిలో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున ఇప్పటి నుంచే క సరత్తు ప్రారంభించింది. అధికార డిఎంకెతో సీట్ల పంపకాలపై చర్చలు జరపడానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఐదుగురు సభ్యుల కమిటీని ఏర్పాటు చే శారని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె. సెల్వపెరుంతగై శనివారం తెలిపారు. అధికార పార్టీతో చర్చలు జరపడానికి నియమించబడిన కాంగ్రెస్ బృ ందానికి తమిళనాడు, పుదుచ్చేరి పార్టీ ఇన్‌చార్జ్ నేతృత్వం వహిస్తారని టిఎన్‌సిసి అగ్ర నాయకుడు గిరీష్ చోడంకర్ తెలిపారు. సెల్వపెరుంతగై, శాసనసభా పక్ష నాయకుడు ఎస్. రాజేష్‌కుమార్ ఈ ప్యానెల్‌లో సభ్యులుగా ఉంటారు. కాగా, క మిటీ నియామకంపై పార్టీ అధిష్టానాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి. చి దంబరం స్వాగతించారు. ఇది ఇండియా కూటమి ఐక్యతను బలోపేతం చేస్తుందని అన్నారు. ఈ ప్రకటన పొత్తుకు సంబంధించిన కొన్ని వాదనలకు ముగింపు పలుకుతుందని తాను విశ్వసిస్తున్నానని పేర్కొన్నాడు. 2026 అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవడానికి కాంగ్రెస్ పార్టీ డిఎంకెను విడిచిపెట్టి, నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ నేతృత్వంలోని తమిఝగ వెట్రి కజగం (టివికె)తో చేతులు కలపవచ్చని అప్పుడప్పుడూ వాదనలు వినిపిస్తున్నందున చిదంబరం ప్రకటన ప్రాముఖ్యతను సంతరించుకుంది. తమ పార్టీ టివికెతో చేతులు కలపడంపై వస్తున్న ఊహాగానాలను చిదంబరం తోసిపుచ్చినట్లు తెలుస్తోంది.

# అంతర్జాతీయ ఆయుధ స్మగ్లింగ్ రాకెట్ గుట్టురట్టు

పాక్ నుంచి డ్రోన్‌ల సాయంతో అత్యాధునిక తుపాకులను భారత్‌లోకి తీసుకొస్తున్న నలుగురి అరెస్టు

**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్‌ఐతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్న అంతర్జాతీయ ఆయుధ స్మగ్లింగ్ రాకెట్‌ను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. పాక్ నుంచి డ్రోన్‌ల సాయంతో అత్యాధునిక తుపాకులను భారత్‌లోకి తీసుకొస్తున్న నలుగురిని ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం, ఢిల్లీలోని కొంతమంది భారీగా అక్రమ ఆయుధాలు తరలిస్తున్నట్లు నిఘా వర్గాల నుంచి క్రైమ్ బ్రాంచ్‌కు సమాచారం అందించింది. దీంతో డిసిపి సంజీవ్ కుమార్ యాదవ్ నేతృత్వంలోని బృందం ఈ ఆపరేషన్‌ను చేపట్టింది. పలు ప్రాంతాల్లో నిఘా పెట్టారు. రోహిణిలో ఈ ఆయుధ మాడ్యూల్ గుట్టు బయటబపడింది. నిందితులు డ్రోన్‌లను ఉపయోగించి పాకిస్థాన్ నుంచి ఆయుధాలను అక్రమంగా రవాణా చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. తుర్కియే, చైనాకు చెందిన అత్యాధునిక తుపాకులను పాకిస్థాన్ మీదుగా భారత్‌కు ఈ ముఠా తరలిస్తోంది. నలుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను అజయ్, మన్దీప్, దల్వీందర్ , రోహన్‌గా ఢిల్లీ పోలీసులు పేర్కొన్నారు. వీరిలో ఇద్దరు పంజాబ్‌కు చెందిన వారు ఉన్నారు. వారి నుంచి విదేశాల్లో తయారైన 10 అత్యాధునిక తుపాకులు, 92 బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆయుధాలను ఢిల్లీ, సమీపంలోని రాష్ట్రాల్లో గ్యాంగ్‌స్టర్లకు, నేరస్థులకు వీరు ఆయుధాలు విక్రయించినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఈ ఆయుధాలను లారెన్స్ బిష్ణోయ్, బాంబిహా, గోగి వంటి గ్యాంగ్ సభ్యులకు ఇవ్వాలని నిందితులు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ అంతర్జాతీయ ఆయుధ ముఠా, పాకిస్థాన్ ఐఎస్‌ఐతో సంబంధం ఉన్న వ్యక్తుల ఆదేశాల మేరకు పని చేస్తోందని ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ డిసిపి సంజీవ్ కుమారు తెలిపారు. 'ఈ ముఠా పని విధానం భిన్నంగా ఉంది. ఆయుధాలు పాకిస్థాన్ నుంచి డ్రోన్ల ద్వారా పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లో పడేసేవారు. అక్కడి నుంచి నిందితులు ఆయుధాలను సేకరించి, ఢిల్లీ-ఎన్‌సిఆర్ ప్రాంతం, సమీప రాష్ట్రాల గ్యాంగ్‌స్టర్‌లకు భారీ ధరలకు విక్రయించేవారు. ఇందులో ఐఎస్ఐ పాత్ర ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. అక్రమ ఆయుధాల సరఫరా అనేది దేశ భద్రతకు పెద్ద ముప్పు. ఢిల్లీ సరిహద్దుల్లో ఆయుధ స్మగ్లింగ్‌ను అరికట్టడంలో ఇదొక పెద్ద విజయం' అని సంజీవ్ కుమారు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ నెట్‌వర్క్‌పై ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుల సెల్‌ఫోన్లు, బ్యాంకు లావాదేవీలు, సామాజిక మాధ్యమాల అకౌంట్లను పరిశీలిస్తున్నారు. ఎవరెవరికి, ఎన్నిఆయుధాలు విక్రయించారనే విషయమై విచారణ చేస్తున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచనున్నారు. రాకెట్ గురించి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు రిమాండ్ కోరనున్నట్లు పోలీసులు తెలిపారు. ఢిల్లీలో ఎర్రకోట వద్ద బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు కొనసాగుతోన్న నేపథ్యంలో ఈ రాకెట్ గురించి బయటపడటం గమనార్హం.



## శ్రీనగర్‌లో మరో అనుమానితుడి అరెస్టు

**న్యూఢిల్లీ:** శ్రీనగర్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఢిల్లీ పేలుడు ఘటన లో దర్యాప్తు బృందాల అరెస్టుల పర్వం కొనసాగుతోంది. జైషే ఉగ్రవాద స ంస్థతో సంబంధాలున్న వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కేసుకు సంబంధించి శ్రీ నగర్ నివాసి ఒకరిని జమ్మూకశ్మీర్ పోలీస్ స్టేట్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ శనివారంనాడు అరెస్టు చేసింది. బతమలూ ఏరియాకు చెందిన ఇతనిని తుఫైల్ ని యాజ్ భట్‌గా గుర్తించారు. గత అక్టోబర్‌లో నౌగామ్‌లోని బన్‌పోరలో పోలీసులు, భద్రతా సిబ్బందిని బెదిరిస్తూ పోస్టర్లు వెలిసాయి. దీనిపై శ్రీనగర్ పో లీసులు దర్యాప్తు ప్రారంభించడంతో వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ వెలుగు చూసింది. ఇర్ఫాన్ అమ్మద్ అనే మరో వ్యక్తిని పట్టుకున్నారు.

## కేరళలో వేగవంతమైన 'సర్'పై రాజకీయ పార్టీల ఆందోళన


ఇది తొందరపాటు చర్య అని అధికార సిపిఐ(ఎం), ఇతర పార్టీలు మండిపాటు



**తిరువనంతపురం :** కేరళ ప్రధాన ఎన్నికల అధికారి రతన్ యు కేల్కర్ శనివారం రాజకీయ పార్టీలతో సమావేశమయ్యారు. సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై బిజెపి మినహా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఇది తొందరపాటు చర్య అని ఆరోపించాయి. ప్రజల సమస్యలను పరిష్కరించకుండానే సవరణ ప్రక్రియ జరుగుతోందని అధికార సిపిఐ(ఎం) తీవ్రంగా విమర్శించింది. సమావేశంలో పాల్గొన్న సిపిఐ(ఎం) నాయకుడు ఎం. విజయకుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ఒక బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్‌ఒ) ఆత్మహత్య చేసుకుని మరణించగా, మరో ఐదుగురు కుప్పకూలిపోయారని చెప్పారు. ఎంతో ఓపికగా, సక్రమంగా పూర్తి చేయగల ప్రక్రియను ఇంత తొందరపాటుతో నిర్వహించడం విచారకరమని తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చట్టబద్ధత అంశం ప్రస్తుతం సుప్రీంకోర్టు ముందు ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ పరిస్థితిలో కూడా ఎటువంటి సడలింపు ఇవ్వలేదని, మానవీయ పరిశీలన లేకుండా దీనిని విధిస్తున్నారని, దీనిని తాము అంగీకరించమని స్పష్టం చేశారు. కమిషన్ వైఖరిని పార్టీ ఖండిస్తున్నదని, ప్రజల ఇబ్బందులను విస్మరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తుందన్నారు. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్)కు ప్రాతినిధ్యం వహిస్తున్న ముహమ్మద్ షా కూడా వేగంగా జరుపుతున్న ఓటరు జాబితా సవరణపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ నింపిన గణన ఫారాలను ఈనెల 23 లోపు తిరిగి ఇవ్వాలని, డిజిటల్ ప్రాసెసింగ్ 24, 25 తేదీలలో జరగాలని ఆదేశించిందన్నారు. డిసెంబర్ 4 వరకు సమయం ఉన్నప్పుడు భయాందోళనలు సృష్టించడం ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికే గడువు నిర్ణయించబడితే దానిని పొడిగించే అధికారం ఎవరికీ లేదా అని నిలదీశారు. భారత ఎన్నికల కమిషన్ స్వతంత్ర రాజ్యాంగ సంస్థ అయినప్పటికీ, ప్రజలకు ఇబ్బంది కలిగించే నిర్ణయాలు తీసుకోలేదన్నారు. సమయ వ్యవధిని పొడిగించే బదులు, షెడ్యూల్‌ను కుదించారని ఆయన ఆరోపించారు. కొత్త తేదీలు నవంబర్ 26న జరిగే సుప్రీంకోర్టు విచారణకు ముడిపడి ఉన్నాయని తాము అనుమానిస్తున్నామన్నారు. 80 శాతం కుటుంబాలు నవంబర్ 25 నాటికి ఫారాలను తిరిగి ఇచ్చాయని చూపించడానికి ఒత్తిడి ఉండవచ్చు అని ఆయన అన్నారు. కొంతమంది బిఎల్ఒ లను వీలైనంత త్వరగా గణన వివరాలను అప్‌లోడ్ చేయాలని ఆదేశించారని ఆయన అన్నారు. 'మీరు ప్రజల పౌరసత్వంతో ఆడుకుంటున్నారు. చాలా మంది 2002 సర్ డేటాలో భాగం కాకపోవచ్చు. దీన్ని తొందరపెట్టకూడదు' అని ఆయన అన్నారు. సవరణ సమయంలో 1.19 లక్షల మందిని గుర్తించలేమని కూడా ఆయన పేర్కొన్నారు. 'దీని అర్థం ఈ వ్యక్తులను మినహాయించాలని కాదు. ఒక కుటుంబంలో ఎవరైనా పౌరులు కాదని చెప్పినప్పుడు, ప్రజలు దాని తీవ్రతను అర్థం చేసుకుంటారు' అని ఆయన అన్నారు. ఈ సమావేశంలో పార్టీ తరపున పాల్గొన్న బిజెపి నాయకుడు జె.ఆర్. పద్మకుమార్, కేరళలో 'ప్రక్రియను దెబ్బతీసేందుకు' యుడిఎఫ్, ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ ఉద్యోగుల కార్మిక సంఘాలను కలుపుకుంటున్నాయని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలను ఎన్నికల కమిషన్‌కు వ్యతిరేకంగా తిప్పికొట్టడం సముచితం కాదని, ఇది ప్రమాదకరమైన పరిస్థితికి దారితీయవచ్చన్నారు.

# మరణ మృదంగం మోగిస్తున్న 'సర్'

**న్యూఢిల్లీ:**ఎన్నికల సంఘం 12 రాష్ట్రాలు, యుటి ల్లో చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) మరణ మృదంగం మోగిస్తుంది. ఆయా రాష్ట్రాల్లో పని ఒత్తిడి కారణంగానే బిఎల్‌ఒలు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. మరికొన్ని చోట్ల ఒత్తిడికి తట్టుకోలేక కుప్పకూలిపోతున్నారు. గుజరాత్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, కేరళలో ఆత్మహత్య బాధితులు రోజు రోజుకు పెరుగుతున్నారు. తాజాగా గుజరాత్, బెంగాల్‌లో ఒకరు చొప్పున, మధ్యప్రదేశ్‌లో ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. శనివారం వడోదరలోని ఒక పాఠశాలలో ఒక మహిళా బిఎల్‌ఒ అసిస్టెంట్ డ్యూటీలో ఉండగా కుప్పకూలి మరణించారు. సర్ పనిభారం ఒత్తిడి పెరుగుతుండటంపై పదునైన ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా గుజరాత్ అంతటా నాలుగు రోజుల్లో నలుగురు బిఎల్‌ఒ సిబ్బంది మరణించారు. వారిలో ఇద్దరు ఆకస్మిక గుండెపోటు తర్వాత, ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. బిఎల్‌ఒ అసిస్టెంట్ ఉషాబెన్ ఇంద్రసింహ్ సోలంకి కడక్ బజార్‌లోని ప్రతాప్ స్కూల్‌లో కుప్పకూలి మరణించారు. గోర్వా మహిళా ఐటిఐలో పనిచేసిన ఉషాబెన్ ఆరోగ్యం బాగాలేకపోయినా బిఎల్‌ఒ డ్యూటీ వేశారని పోలీసులు తెలిపారు. ఆమె భర్త ఇంద్రసింహ్ సోలంకి కుటుంబం అధికారులను ముందే హెచ్చరించిందని వెల్లడించారు. ఫీల్డ్ వర్క్ చేస్తున్నప్పుడు ఆమె సూపర్‌వైజర్ కోసం వేచి ఉండగా, ఉషాబెన్ అకస్మాత్తుగా కుప్పకూలిపోయింది. ఇంద్రసింహ బాధాకరమైన స్పష్టతతో చివరి క్షణాలను వివరించారు. ఆమె అకస్మాత్తుగా మూర్ఛపోయిందని,



హార్ట్ ఎటాక్ వచ్చినట్లు తెలుస్తోందని ఆమెను సయాజీ ఆసుపత్రికి తరలించాము, కానీ వైద్యుడు ఆమె మరణించినట్లు ప్రకటించినట్లు ఇంద్రసింహ్ వివరించారు. గుజరాత్ అంతటా గత నాలుగు రోజుల్లో మరో ముగ్గురు బిఎల్‌ఒ, సర్ సిబ్బంది మరణాలు తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నాయి. కోడినార్‌లో అరవింద్‌భాయ్ వాధేర్ పని ఒత్తిడి కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. తాపిలో, బిఎల్‌ఒ డ్యూటీలో ఉన్న కల్పనా బెన్ పటేల్ గుండెపోటుతో మరణించారు. ఖేడాలోని ఒక బిఎల్‌ఒ కూడా ఈ వారం ప్రారంభంలో డ్యూటీ సమయంలో కుప్పకూలి మరణించారు.

### పశ్చిమ బెంగాల్‌లో....

పశ్చిమ బెంగాల్‌లోని నాడియా జిల్లాలో బూత్ లెవల్ ఆఫీసర్ గా పనిచేస్తున్న ఒక మహిళ శనివారం ఉదయం తన నివాసంలో ఉరివేసుకుని మరణించిందని, సర్ పని సంబంధిత ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకుందని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె ఆత్మహత్య విషయాన్ని పోలీసులు కూడా ధృవీకరించారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ బిఎల్‌ఒ మరణం పట్ల తన దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సర్ ఇప్పుడు ఆందోళనకరంగా మారిందన్నారు. 'ఈరోజు కృష్ణనగర్‌లో ఆ త్మహత్య చేసుకున్న మరో బిఎల్‌ఒ, లేడీ పారాటీచర్ మరణం గురించి తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాను. ఎసి 82 చాప్రాలోని పార్ట్ నంబర్ 201 బిఎల్‌ఒ రింకు తరాఫ్దార్ ఈరోజు తన నివాసంలో ఆత్మహత్య చేసుకునే ముందు తన సూసైడ్ నోట్‌లో ఇసిని నిందించారు (కాపీని దీనితో జత చేయబడింది) సర్ కోసం ఇంకా ఎంతమంది చనిపోవాలి. ఈ ప్రక్రియ కోసం మనం ఇంకా ఎన్ని మృ తదేహాలను చూడాలి? ఇది ఇప్పుడు నిజంగా ఆ ందోళనకరంగా మారింది' అని ఆవేదన వ్యక్తం చే శారు. 52 ఏళ్ల రింకు తరాఫ్దార్ గా గుర్తించబడిన బిఎల్‌ఒ, కృష్ణానగర్‌లోని చాప్రాలోని బంగల్జి ప్రా ంతంలోని తన నివాసంలో తన గది పైకప్పుకు వే లాడుతూ కనిపించిందని ఒక అధికారి తెలిపారు. ఆమె ఎస్‌ఐఆర్ పనిభారం కారణంగా ఆమె తీవ్ర ఒత్తిడికి గురవుతోందని కుటుంబం చెబుతోంది. ఆమె గది నుండి ఒక నోట్‌ను స్వాధీనం చేసుకున్నాము. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం పంపాము. అవసరమైన దర్యాప్తు జరుగుతోంది' అని అధికారి తెలిపారు. బుధవారం, జల్‌పైగురి జిల్లాలోని ఒక బూత్ స్థాయి అధికారి ఉరి వేసుకుని కనిపించారు. ఆమె కుటుంబ సభ్యులు భరించలేని ఎస్‌ఐఆర్ పని ఒత్తిడి' ఆమె మరణానికి కారణమని పేర్కొన్నారు.

### మధ్యప్రదేశ్‌లో...

మధ్యప్రదేశ్‌లోని రైసెన్, దామో జిల్లాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కోసం ఓటరు జాబితా సర్వే నిర్వహించే ఇద్దరు టీచర్స్ కమ్ బూత్ లెవల్ ఆఫీసర్లు శుక్రవారం అనారోగ్యంతో మరణించారని అధికారులు తెలిపారు. అయితే, మరణించిన టీచర్స్ కమ్ బిఎల్‌ఒల బంధువులు, స్నేహితులు అధిక పనిభారం, గణన లక్ష్యాలను చేరుకోవడానికి ఒత్తిడి కారణంగా మరణాలు సంభవించాయని ఆరోపించారు. కాగా, రైసెన్ జిల్లాలో గత ఆరు రోజులుగా ఒక బిఎల్ కనిపించకుండా పోయారని, అతనిని కనుగొనడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి మరణించిన ఇద్దరు బిఎల్‌ఒలను రామకాంత్ పాండే, సీతారాం గోండ్ (50) గా గుర్తించారు. 'సత్లాపూర్ ప్రాంతానికి చెందిన రామకాంత్ పాండే అనే ఉపాధ్యాయుడు మందిదీప్‌లో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో పనిచేస్తున్నాడు. శుక్రవారం రాత్రి అనారోగ్యం కారణంగా ఆయన మరణించారు' అని భోజ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గం సబ్‌డివిజనల్ అధికారి (ఎస్‌డిఓ), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి చంద్రశేఖర్ శ్రీవాస్తవ శనివారం పిటిఐకి తెలిపారు. తప్పిపోయిన బిఎల్‌ఒను భవ్య నగరంలో నివసిస్తున్న ఉపాధ్యాయుడు నారాయణ్ దాస్ సోనిగా గుర్తించామని శ్రీవాస్తవ తెలిపారు. ఎవరికీ సమాచారం ఇవ్వకుండా ఇంటి నుండి బయలుదేరిన ఆయన ఆరు రోజులుగా కనిపించడం లేదు. పోలీసులు, సోని కుటుంబ సభ్యులు ఆయన కోసం వెతుకుతున్నారని అధికారి తెలిపారు.

# బిజెపి, ఇసి కలిసి ఓట్లు తొలగించాయ్


గత సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా కూటమి, ఎస్‌పి గెలిచిన స్థానాల్లో ఓటు చోరీ కుట్ర

**లక్నో :** ఎన్నికల కమిషన్‌పై పలు రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలు విరుచుకుపడుతున్నాయి. ఓట్ల దొంగతనం చేస్తూ అధికార బిజెపికి సహకరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా సమాజ్‌వాది పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ స్పందిస్తూ గత సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీ, ఇండియా కూటమి బాగా రాణించిన ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ నుండి 50,000 మందికి పైగా ఓటర్లను తొలగించడానికి బిజెపి ప్రభుత్వం, ఎన్నికల సంఘం కుట్ర పన్నాయని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్, ఇతర 11 రాష్ట్రాలు, యుటిల్లో ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ సవరణ కొనసాగుతున్న నేపథ్యంలో ఆయన ఈ ఆరోపణలు చేశారు. ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో తన తండ్రి ములాయం సింగ్ యాదవ్ జయంతి సందర్భంగా పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లోఎన్నికల కమిషన్‌తో బిజెపి కుమ్మక్కై పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తోందని తమకు సమాచారం అందిందన్నారు. వివాహాల సమయంలో ఎస్‌ఐఆర్ నిర్వహించవద్దని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అభిప్రాయపడ్డారు, ఉత్తరప్రదేశ్‌లో ఓటరు జాబితా శుభ్రపరిచేందుకు పోల్ ప్యానెల్ కాలపరిమితిని పొడిగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల డేటాను ఉటంకిస్తూ, 2022 ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో 255 సీట్లు గెలుచుకున్న బిజెపి... 2024 లోక్‌సభ ఎన్నికల్లో 162 అసెంబ్లీ సెగ్మెంట్లలో మాత్రమే ఆధిక్యంలో ఉందని ఆయన అన్నారు. మరో వైపు, 2022లో 111 అసెంబ్లీ సీట్లు గెలుచుకున్న ఎస్‌పి.. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల్లో 183 సెగ్మెంట్లలో ఆధిక్యంలో ఉందన్నారు. 2022లో కేవలం రెండు అసెంబ్లీ సీట్లు మాత్రమే గెలుచుకున్న కాంగ్రెస్, సార్వత్రిక ఎన్నికల్లో 40 అసెంబ్లీ సెగ్మెంట్లలో ఆధిక్యంలో ఉందని ఆయన పేర్కొన్నారు. ఆ డేటాను ఎత్తి చూపుతూ బిజెపి ఓటమి పాలైన తర్వాత కుట్రగా చేస్తూ 'సర్'ను తీసుకువచ్చిందని యాదవ్ ఆరోపించారు. తాము పోల్ ప్యానెల్ నుండి నిష్పాక్షికతను ఆశించామని, కానీ ఉత్తరప్రదేశ్‌లో ఇటీవల జరిగిన ఉప ఎన్నికలలో దాని పాత్ర ఆందోళనలను రేకెత్తించిందని పేర్కొన్నారు. తాము అనేక ఫిర్యాదులు దాఖలు చేసినప్పటికీ ఎటువంటి చర్య తీసుకోలేదన్నారు. ఎస్‌పి లేదా ఇండియా బ్లాక్ గెలిచిన ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 50,000 మందికి పైగా ఓటర్లను తొలగించడానికి బిజెపి ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ సన్నాహాలు చేస్తున్నాయని, 'సర్'ను ఒక సాకుగా ఉపయోగించుకుంటున్నాయని అఖిలేశ్ విమర్శించారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత బిజెపి, ఎన్నికల కమిషన్ ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌పై ప్రధానంగా దృష్టి సారించాయని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ పేర్కొన్నారు. పార్టీ ఆఫీస్ బేరర్లు, కార్యకర్తలు ఓటర్ల జాబితాలను నిశితంగా ధృవీకరించాలని, బూత్ స్థాయి అధికారులను కలవాలని, అర్హత కలిగిన ఓటర్లు చేర్చబడ్డారని నిర్ధారించుకోవాలని, ఏవైనా అవకతవకలు జరిగితే వెంటనే పార్టీ ప్రధాన కార్యాలయానికి నివేదించాలని ఆయన కోరారు. సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్‌తో సహా ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన సంభాషణ ఆడియో రికార్డింగ్‌ను యాదవ్ కూడా ప్లే చేశారు. సర్ ప్రక్రియకు సంబంధించిన సాంకేతిక సమస్యలను చర్చిస్తున్నారని, తన సొంత నియోజకవర్గం కన్నౌజ్‌ను ఉదాహరణగా ఉటంకిస్తూ, అది కూడా 'లక్ష్యం'గా మారిందని ఆయన అన్నారు. ఎన్నికల కమిషన్ సర్ ప్రక్రియ కోసం రాజకీయ పార్టీలకు స్పష్టమైన ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని జారీ చేయాలని డిమాండ్ చేస్తూ, రాష్ట్రంలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎక్కువ సమయం ఇవ్వాలని అఖిలేశ్ విజ్ఞప్తి చేశారు.






## కూతురు కోసం..



తండ్రీకూతుళ్ల అనుబంధం గురించి చైనా లో జరిగిన ఓ సంఘటన వివరిస్తుంది. తండ్రి త్యాగాన్ని ఎంతో భావోద్వేగంగా చెబుతుంది. బార్బెక్యూ రెస్టారెంట్‌లో పని చేస్తున్న లీ తన కుమార్తె బింగ్డిని జిలిన్ నార్మల్ యూనివర్సిటీలో చేర్పించాడు. అక్కడి క్యాంటీన్‌లో ఆహారం పరిశుభ్రంగా లేదని, రుచికూడా నాసిరకమేనని ఆమె తన తండ్రికి చెప్పింది. ఈ సమాచారం తెలుసుకున్న వెంటనే అతను 900 కిలోమీటర్లు ప్రయాణించి తియాన్‌జిన్ చేరుకున్నాడు. కుమార్తె చదువుతున్న యూనివర్సిటీ ప్రాంతంలోనే ఒక ఫ్రైడ్‌రైస్ స్టాల్ పెట్టాడు. మొదటి రోజు కేవలం ఏడుగురు కస్టమర్లు మాత్రమే వచ్చారు. అయినప్పటికీ లీ పట్టుదలతో స్టాల్‌ను నడిపించాడు. తనపై ప్రేమతో ఉద్యోగాన్ని త్యాగం చేసి, స్టాల్ పెట్టిన తన తండ్రిని గురించి బింగ్డి సోషల్ మీడియాలో షేర్ చేసిన పోస్ట్ వైరల్ అయింది. ఆ స్టాల్ విపరీతమైన ప్రజాదరణ పొందింది. సమీప నగరాల నుండి ప్రజలు అతనికి మద్దతుగా నిలవడానికి ముందుకొచ్చారు. ఇది కథకాదు. వాస్తవం. తండ్రి ప్రేమ, త్యాగానికి శక్తివంతమైన ఉదాహరణ. భార్య లుకేమియాతో మృతి చెందిన తర్వాత కుమార్తెను ముద్దుగా పెంచుకున్న తండ్రికి సోషల్ మీడియాలో లక్షలాది మంది జేజేలు పలుకుతున్నారు. మానవ సంబంధాలు కరువవుతున్న నేటి కాలంలో ఇలాంటి ఘటనలు మానవత్వపు విలువలను చాటిచెప్తాయి.

## ఎఐ సృష్టించిన కట్టుకథ




కృత్రిమ మేధస్సు (ఎఐ) విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్న నేపథ్యంలో, సోషల్ మీడియాలో వస్తున్న వార్తలు, అందిస్తున్న సమాచారం ఎంత వరకూ నిజమన్నది తెలియకుండా పోతున్నది. ఈ వికృత రూపానికి పరాకాష్టగా 91 ఏళ్ల వృద్ధురాలు సంకెళ్లతో కోర్టు ముందుకు వచ్చిందంటూ కనిపించిన పోస్టును చెప్పుకోవాలి. అందులోని వివరాల ప్రకారం ఆ వృద్ధురాలి పేరు హెలెన్ మిర్రర్. ఆమె భర్త జార్జికి తీవ్రమైన గుండె సమస్యలు ఉన్నాయి. వారి ఇన్సూరెన్స్ ముగిసిపోయింది. మరోవైపు మందుల ధరలు విపరీతంగా పెరిగాయి. 50 డాలర్ల విలువైన మందులు 950 డాలర్లకు చేరుకోవడంతో, వాటిని కొనలేక, భర్తను చంపుకోలేక హెలెన్ ఒక దుకాణం నుంచి మందులను దొంగిలించింది. సిసి కెమెరాల్లో ఈ దృశ్యాలు రికార్డు కావడంతో, పోలీసులు ఆమెను అరెస్టు చేసి కోర్టు ముందు నిలబెట్టారు. న్యాయమూర్తి తీవ్ర భావోద్వేగానికి గురై, వెంటనే సంకెళ్లు తీసేయాల్సిందిగా ఆజ్ఞాపిస్తాడు. ఆమె నేరస్థురాలు కాదని, ఆమెకు సాయం చేయడంలో వ్యవస్థే విఫలమైందని వ్యాఖ్యానించి, నిర్దోషిగా వదిలేస్తాడు. పైగా ఆమెకు అవసరమైన సాయం అందించాలని అధికారులను ఆదేశిస్తాడు. కథాపరంగా చూస్తే, ఇది నేరుగా గుండెలకు హత్తుకుపోతుంది. సమాజ పరిస్థితులను కళ్లకు కడుతుంది. కానీ, ఇదంతా ఒక కట్టుకథగా 'ఫ్యాక్ట్ చెక్'లో తేలింది. అంతా ఎఐ సృష్టించిన కథగా స్పష్టమైంది. ఈ కథనాన్ని చూసి ఎంతో మంది తీవ్రంగా స్పందించడమేకాదు, సాయం చేస్తామని ముందుకు వచ్చారు కూడా. ఇదింతా కట్టుకథ అని తెలిసిన తర్వాత వారి పరిస్థితి ఏమిటో!

## కేసులు గెలిచిన నకిలీ లాయర్!




కెన్యా హైకోర్టులో బ్రియాన్ వెన్డా అనే పేరుతో ఒక వ్యక్తి లాయర్‌గా ప్రాక్టీస్ చేశాడు. 26 కేసులు గెలిచాడు. కెన్యా పోలీసులు అరెస్టు చేసే వరకూ, అతనికి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసే లైసెన్స్ లేదని గానీ, అసలు న్యాయ శాస్త్రమే చదవలేదనిగానీ ఎవరికీ అనుమానం కూడా రాలేదు. మరో వ్యక్తి పేరుతో అతను లాయర్‌గా చెలామణి అయ్యాడని అసలే ఊహించలేక పోయారు. ఒక వ్యక్తి తప్పుడు ధ్రువ పత్రాలతో, ఎలాంటి జంకుగొంకు లేకుండా ఏకంగా హైకోర్టులోనే లాయర్‌గా కొన్ని సంవత్సరాలు ప్రాక్టీస్ చేయడం ఇప్పుడు కెన్యా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. వెన్డా 'లా సొసైటీ ఆఫ్ కెన్యా' అనే సంస్థ పోర్టల్‌ను హాక్ చేసి, ఒరిజినల్ లాయర్ అయిన బ్రియాన్ మ్వెండా అనే వ్యక్తి ఖాతాలో ఈ నకిలీ లాయర్ తన ఫొటోను అప్‌లోడ్ చేశాడు. తర్వాత న్యాయస్థానాల ముందు తనను లాయర్‌గా పరిచయం చేసుకున్నాడు. న్యాయమూర్తులను, క్లయింట్లను మోసం చేశాడు. అసలు లాయర్ అనారోగ్య కారణంగా తన ఖాతాను లాగిన్ చేయకపోవడం ఈ నకిలీ లాయర్‌కు కలిసొచ్చింది. నిజమైన లాయర్ బ్రియాన్ కోలుకొని, తన ఖాతాకు లాగిన్ అయ్యేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. దీనితో అతను లా సొసైటీ ఆఫ్ కెన్యాకు ఫిర్యాదు చేశా డు. దర్యాప్తులో అసలు విషయం బయటపడింది. నకిలీ లాయర్‌ను అరెస్టు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు. గోప్యతా కారణాల వల్ల అతని పేరును ప్రకటించలేదు. ఏదిఏమైనా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిన వెంటనే, న్యాయ వ్యవస్థ పరిరక్షణకు కఠినమైన చర్యలు తీసుకునే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

## అనుభూతులు కలిగించే 'క్వాలియా'!



కొన్ని సంఘటనలు లేదా వస్తువులను తలచుకుంటే మనసుకు ప్రశాంతత లభిస్తుంది. మరికొన్నింటి విషయంలో కోపం లేదా అసహ్య భావం ఏర్పడవచ్చు. వాస్తవానికి ఆ పరిస్థితి భౌతికంగా లేకపోయినా, మనసులో ఊహించుకొని, ఒక రకమైన భావోద్వేగానికి గురికావడాన్ని 'క్వాలియా'గా పేర్కొంటారు. శాస్త్రవేత్తల అధ్యయనాలను అనుసరించి మన వ్యక్తిగత లేదా అనుభూతి ఆధారిత మెళకువలు లేదా లక్షణాలు వేరువేరు అంశాల్లో వేరువేరుగా ఉంటాయి. మానవ మస్తిష్కంలో సదరు భావనలు తటస్థంగా ఉన్నప్పటికీ, ఆయా వస్తువను తలచుకున్నప్పుడు కొన్నిరకాల అనుభూతులు కలుగుతాయి. ఉదాహరణకు, ఎరుపు రంగును తలచుకున్నప్పుడు తలనొప్పి రావడం, చాక్లెట్‌ను ఊహించుకున్నప్పుడు సానుకూల అనుభూతిని పొందడం. అలాంటి అనుభూతులను ఎందుకు పొందుతున్నామనే విషయంపై ఇంకా స్పష్టత లేదు. అంతేగాక, ఎందుకు భావోద్వేగాలకు గురవుతానే ప్రశ్నకు సమాధానం లేదు. ఈ సందిగ్ధ భావనను 'ఎక్స్‌ప్లనేటరీ గ్యాప్' (వివరణ వ్యవధి)గా పిలుస్తారు. అంటే, మన మెదడులో జరిగే శాస్త్రీయ ప్రక్రియలు ఎంతటి అధికంగా వివరించినా, వాటి ద్వారా మనకు రాగల అనుభూతులు ఎలా వస్తాయో, అవి అలాగే ఎందుకు అనిపిస్తాయో ఇప్పటికీ పూర్తిగా చెప్పలేకపోతున్నారు. దీనిపై లోతైన అధ్యయనం అవసరమని శాస్త్రవేత్తలు స్పష్టం చేస్తున్నారు.

## 'టైమ్ మిర్రర్' నిజమే!



గతాన్ని లేదా భవిష్యత్తును ఒక 'మాయా దర్పణం'లో చూపించడాన్ని కథల్లో చదివి ఉంటాం.. కానీ, ఇలాంటి 'టైమ్ మిర్రర్' (కాల దర్పణం) సాధ్యమేనని అంటున్నారు శాస్త్రవేత్తలు. భౌతికి సిద్ధాంతాలు.. గణిత సూత్రాల ఆధారంగా ఇది సాధ్యమేకావచ్చుగానీ, వాస్తవంలో అసాధ్యమన్నది శాస్త్రవేత్తల నిశ్చితాభిప్రాయం. అయితే, అమెరికాలోని 'సిటీ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్' (సియుఎన్‌వై)కి చెందిన అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ పరిశోధకులు 'టైమ్ మిర్రర్' నిజమేనని 2023లో ప్రకటించారు. వారు ఒక ప్రత్యేక పదార్థంలో విద్యుదయస్కాంత తరంగాలను మార్చడం ద్వారా సమయ ప్రతిబింబాన్ని ప్రదర్శించారు. దీనివల్ల అవి కాలంలో వెనుకకు ప్రతిబింబిస్తాయి. ఈ పురోగతి 60 ఏళ్ల నాటి సిద్ధాంతంపై ఆధారపడింది. ఇది నిజమైన భౌతిక శాస్త్ర అద్భుతం. అయితే, ఇది గతానికి కాలానికి ప్రయాణాన్ని అనుమతించదు. కాగా, కాల దర్పణం ప్రయోగంలో తరంగాలను అంతరిక్షం ద్వారా కాకుండా, కాలం ద్వారా ప్రతిబింబింపచేస్తారు. ఫలితంగా తరంగ పురోగతి తిరగబడుతుంది. అంటే, తరంగ ముగింపు తొలుత కనిపిస్తుంది. ఈ తిరోగమన విధానాన్ని సృష్టించడానికి శాస్త్రవేత్తలు తరంగాలు ప్రయాణించే మాధ్యమం లక్షణాలను మార్చడానికి మెటామెటీరియల్, అల్ట్రాఫాస్ట్ స్విచ్‌లను ఉపయోగించారు, ఇది కాలంలో వెనుకకు తరంగాలను ప్రతిబింబించే 'టైమ్ ఇంటర్‌ఫేస్'ను సృష్టించింది. మొత్తంమీద ఈ ప్రయోగం దశాబ్దాల నాటి 'టైమ్ మిర్రర్' ఆలోచనను, ఊహాజనిత సంభావ్యతను నిర్ధారిస్తున్నది. అధునాతన సెన్సార్లు, కమ్యూనికేషన్ వ్యవస్థలు, సమయం యొక్క ప్రాథమిక స్వభావాన్ని అధ్యయనం చేయడం వంటి రంగాలలో ఇది సంభావ్య అనువర్తనాలను కలిగి ఉంది. ఇలా వుంటే, ఇది తరంగ ప్రవర్తనకు సంబంధించిన మార్పు మాత్రమేనని గుర్తించాలి. అంటే, గతానికి ప్రయాణించే మార్గం కాదు. గతంలోకి వెళ్లి... వాస్తవికతను మార్చవచ్చని అర్థం చేసుకోకూడదు. అంతేకాదు, 'టైమ్ మిర్రర్'పై మరింత లోతైన అధ్యయనం జరుగుతున్నది. ప్రస్తుతానికి ఇది సాధ్యమేని ప్రయోగాత్మకంగా రుజువైంది. ఫలితాలు, మార్పులు తెలియాల్సి ఉంది.

— బిఎస్ఎస్ మైత్రేయి

# శ్రామికశక్తిపై మోదీ పిడుగు
# అనివార్యమైన ఐక్య ప్రతిఘటన

కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం నియంతలాగా ఏకపక్షంగా శుక్రవారం నుంచి అమలులోకి తెచ్చిన నాలుగు కార్మిక స్మృతులు(కోడ్‌లు) అది చెప్పుకుంటున్నట్లు సంఘటిత, అసంఘటిత కార్మికులకు శ్రేయస్సు–సంక్షేమం–భద్రత చేకూర్చకపోగా ఆచరణలో అవి వారిపాలిట సంకెళ్లు అవుతాయి; సంపద సృష్టికర్తలైన శ్రామికులను పెట్టుబడికి బానిసలుగా మార్చుతాయి. ఆశ్రిత పెట్టుబడిదారులకు లాభాలు కురిపించటమే ప్రభుత్వ లక్ష్యం. ''వ్యాపారాలు చేసుకోవడాన్ని సులభతరం చేయటం''ఈ కోడ్‌ల ధ్యేయంగా ప్రభుత్వం దాపరికంలేకుండా చెప్పింది. అంటే వ్యాపారులపై ప్రభుత్వ ఆంక్షలు తొలగించటం, కార్మికుల హక్కులు హరించి వారిని వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు వదిలిపెట్టటమేనని ఎవరికైనా సులభంగా అర్థమవుతుంది. ఈ దేశ కార్మిక వర్గం స్వాతంత్య్రం ముందు – ఆ తర్వాత అనేక పోరాటాలు, త్యాగాలు చేసి సాధించుకున్న ట్రేడ్ యూనియన్ హక్కులు – పనిభద్రత, బేరసారాల హక్కు, సమ్మె హక్కు, ఆరోగ్యం, సంక్షేమం, రిటైర్మెంట్ భద్రతవగైరాలతోకూడిన 29 కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం గంగలో కలిపి, మేలి ముసుగులతో, భ్రమలు కల్పించే హామీలతో ఈ కోడ్‌లు రూపొందించి ఆదరాబాదరా–లోతైన చర్చ, పరిశీలన లేకుండానే పార్లమెంటునుంచి ఆమోదముద్ర వేయించుకుంది. తొలుత 2019 లో వేతనాలపై కోడ్‌ను ఆమోదించింది. ఆ వెంటనే కేంద్ర కార్మిక సంఘాలు (బిఎంఎస్‌మినహా) నిరసన ఆందోళనలు చేబట్టి అంతిమంగా 2020 జనవరిలో సార్వత్రిక సమ్మెతో హెచ్చరిక చేశాయి. మిగతా మూడు పారిశ్రామిక సంబంధాల కోడ్; సామాజిక భద్రత కోడ్; వృత్తి సంబంధ భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్‌లను 2020 సెప్టెంబర్‌లో ఆమోదించిన వెంటనే 10 కేంద్ర ట్రేడ్ యూనియన్‌ల(సిటియులు) ఐక్యవేదిక నవంబర్ 26న విజయవంతంగా సార్వత్రిక సమ్మె నిర్వహించింది. అదేరోజు సంయుక్త కిసాన్ మోర్చా చరిత్రాత్మక ఢిల్లీ మార్చ్ చేబట్టింది. కార్మిక–కర్షక ఐక్యపోరాటానికి అది నాంది పలికింది. తదుపరి పలుసార్లు ఆందోళనలు నిర్వహించింది. 2025 జులై 9న 25కోట్లమంది శ్రమజీవులు పాల్గొన్న అపూర్వమైన సార్వత్రిక సమ్మె ఈ నిరసన పోరాటాల క్రమంలో చివరిది. శ్రమశక్తినీతి, 2025పై నవంబర్ 13న కార్మికమంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర టియుల సంయుక్త వేదిక, 2015 నుంచి పిలవని ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్(ఐఎల్‌సి)ని తక్షణం సమావేశ పరచాలని, లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని కోరాయి. రెండ్రోజులక్రితం – నవంబర్ 22న ఆర్థికమంత్రిత్వశాఖ ఏర్పాటు చేసిన బడ్జెట్‌పూర్వ సంప్రదింపుల సమావేశంలో కూడా సిటియులు అవే డిమాండ్‌లు పునరుద్ఘాటించాయి.

ప్రజాపక్షం 23-11-2025, ఆదివారం

ఇంత తీవ్రమైన ప్రతిఘటన ఉన్నప్పటికీ ఖాతరు చేయకుండా ఆర్ఎస్ఎస్–బిజెపి కేంద్రప్రభుత్వం మొండిగా, ఏకపక్షంగా నాలుగు కోడ్‌లు అమలులోకి తేవటం దుర్మార్గం, అప్రజాస్వామికం. మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలు తెచ్చి రైతుల పట్టువిడవని ప్రతిఘటనతో భంగపడిన ప్రధాని నరేంద్రమోదీకి రైతులు – కార్మికుల ఐక్య పోరాటాలు గుణపాఠం నేర్పకపోవు. శ్రమజీవులపై చావుదెబ్బ తీసిన మోదీ ప్రభుత్వ చర్య అత్యంత తీవ్రమైన ప్రతిఘటనకు గురవుతుందని సిటియులు హెచ్చరించాయి. ''శ్రమజీవులపై బానిసత్వం విధించజూస్తున్న కోడ్‌లను కార్మికుల జీవితాలు, జీవనోపాధులపై హత్యాసదృశ దాడిగా'' అభివర్ణించిన సిటియులు అవి కార్మికుల ప్రతి ఒక్క హక్కును, సదుపాయాలను లాగేసుకుంటాయని పేర్కొన్నది. వాటిని అమలు చేస్తే రానున్న తరాల ఆశలు, విశ్వాసం, ఆకాంక్షలు అంతర్ధానమవుతాయని తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేసింది. ఈ బాధ, ఆవేదన, పలుమార్లు చేసిన సార్వత్రిక సమ్మెలు ప్రభుత్వంలో ఏ మాత్రం చలనం కలుగజేయలేదంటే అది జాతీయ, అంతర్జాతీయ గుత్తపెట్టుబడికి ఎంతగా గులాంగా మారిందో ఊహించుకోవచ్చు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, శ్రమశక్తినీతి ముసాయిదా ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 26న తమ తీవ్రమైన ఆగ్రహాన్ని, ధిక్కారాన్ని వ్యక్తం చేస్తూ, దేశవ్యాప్తంగా సంయుక్త ఆందోళన చేబట్టాలని అన్ని రంగాలలోని శ్రామికులకు సిటియుల సంయుక్త వేదిక, స్వతంత్ర పారిశ్రామిక యూనియన్‌లు పిలుపు ఇచ్చాయి. అదేరోజున రైతాంగ నిరసన ప్రదర్శనలకు సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు ఇచ్చింది.

కార్మికుల అంశం కేంద్రం–రాష్ట్రాల ఉమ్మడి జాబితాలో ఉన్నందున లేబర్ కోడ్‌ల అమలుకు చట్టాలు, రూల్సు రూపొందించే బాధ్యతను కేంద్రం రాష్ట్రాలకు అప్పగించింది. కొన్నేళ్లుగా చేస్తున్న ఈ ప్రయత్నం బిజెపియేతర పార్టీల పాలన ఉన్న రాష్ట్రాల్లో ముందుకు సాగలేదు. అందువల్ల కోడ్‌ల అమలు వాయిదాపడుతూ వచ్చింది. బిహార్ ఎన్నికల ఫలితాల విజయగర్వంతో మోదీప్రభుత్వం ఇప్పుడు ఆకస్మికంగా ప్రకటన చేసింది. కోట్లాది మంది శ్రమజీవుల గోస ను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వానికి ముప్పు తప్పదు.

## సిపిఐ చరిత్రలో కీర్తి కిరీటం
# తెలంగాణ సాయుధ పోరాటం


కందిమళ్ళ ప్రతాపరెడ్డి

హైదరాబాద్ సంస్థానం నిజాం నవాబు రాజరిక పాలనలో ఉంది. ఆసఫ్‌జాహీ వంశం 225 సంవత్సరాలుగా రాజ్యపాలన చేస్తున్నది. 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ పాలనలో ప్రజాస్వామ్య హక్కుల్లేవు. రాజకీయాలు నిషేధం. ఉర్దూను రాజభాష చేశారు. 80% ఉన్న తెలుగు, మరాఠీ, కన్నడిగుల మాతృభాషలు నిషేధం.

దేశం స్వాతంత్య్రం కోసం పోరాడుతుంటే – 1931లో హైదరాబాద్ సంస్థానంలోని తెలుగు భాష మాట్లాడేవారు తమ మాతృభాషకు స్వేచ్ఛకావాలని కోరుకున్నారు.

1931న భాషా ఉద్యమంగా కొద్దిమంది వ్యక్తులతో, రాజకీయేతర సంస్థగా ప్రారంభమైన ఆంధ్రమహాసభ క్రమంగా, సాంఘిక ఉద్యమంగా ప్రజా సమస్యలకై ఉద్యమంగా మారింది. అంటరానితనం, వెట్టిచాకిరి, దొరలు, జమీందార్లు, జాగీర్దార్ల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేక సాంఘిక ఉద్యమంగా మారింది. అయ్య నీ బాంచన్, నీగులాపోన్నంటూ వెట్టిచాకిరీ, సాంఘిక దురాచారాలలో నలిగిపోతున్న జనానికి ఆంధ్రమహాసభ రాజకీయ చైతన్యం కలిగించింది. వెట్టిచాకిరి వద్దు, దోపిడీ, దౌర్జన్యాలు రద్దు అని గ్రామగ్రామాన ఉద్యమం సాగింది. అనతి కాలంలోనే ఉద్యమం తెలంగాణమంతటా విస్తరించింది. గ్రామగ్రామాన గ్రామ కమిటీలు, రక్షక దళాలు ఏర్పడ్డాయి.

ఉద్యమాన్ని అణచడానికి నిజాం ప్రభుత్వం 1946లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించింది.

1946–బ్రిటీష్ ప్రభుత్వం భారతదేశానికి స్వాతంత్య్రం ప్రకటించనున్నట్లు వైస్రాయ్ మౌంట్ బాటెన్ అవార్డు పేరుతో ప్రకటన వచ్చింది. జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వమేర్పడింది. మౌంట్ బాటన్ స్వాతంత్ర్యానికి ముందు భారత్ – పాకిస్తాన్ విభజన జరగాలన్నాడు. దేశంలోని సంస్థానాధీశులు భారతదేశంలో లేదా పాకిస్తాన్‌లో చేరడానికి, లేదా స్వతంత్రంగా వుండటానికి స్వేచ్ఛ వుంటుందన్నారు.

నిజాం నవాబు గత చరిత్రను తడివి, బ్రిటిష్ పాలకులతో తనకున్న సంబంధాలు, చేసుకున్న ఒడంబడికలు బహిర్గతం చేస్తూ తనది స్వతంత్ర దేశమన్నాడు. తన రాజ్యాన్ని, రాజరిక వ్యవస్థను కాపాడుకోవడానికి బ్రిటిష్ ప్రభుత్వంతో రాయబారాలు జరిపాడు. ముస్లిం రాజు పాలనను నిలబెట్టడానికి ముస్లింలందరూ ఏకం కావాలని ఇత్తెహాదుల్ ముస్లిం నాయకుడు ఖాసిం రజ్వీ మతోన్మాదంతో యువకులను రెచ్చగొట్టాడు. రజాకార్ల(వలంటీర్లు) సాయుధ బలగాన్ని నిర్మించాడు.

హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నిజాం నవాబు ఛత్రఛాయల్లో బాధ్యతాయుత ప్రభుత్వం కావాలన్నది, నిజాం ప్రభుత్వం భారతదేశంలో భాగంగా ఉండాలన్నది, కమ్యూనిస్టు పార్టీ దానిని వ్యతిరేకిస్తూ, నిజాం నిరంకుశ రాజరిక పాలన అంతం, హైదరాబాద్ స్టేట్ భారతదేశంలో విలీనం జరగాలన్నది. దున్నేవానికే భూమి, విశాలాంధ్రలో ప్రజారాజ్యం నినాదంతో ప్రజా చైతన్యాన్ని రగిలించింది.

భారతదేశం 1947, ఆగస్టు 15న స్వాతంత్య్రం పొందింది. కానీ, నిజాం నవాబు భారతదేశంలో విలీనానికి నిరాకరించాడు. భారత ప్రభుత్వం నిజాం నవాబు రాజరిక వ్యవస్థను కొనసాగించడానికి, భారతదేశంలో భాగంగా ఉండాలని రాజీ సంప్రదింపులు, రాయబారా లు జరిపింది. కానీ, నిజాం లొంగలేదు. నిజాం మిలటరీ, పోలీసు బలగాలకు తోడుగా ఖాసింరజ్వీ రజాకర్లు 90,000మంది తోడయ్యారు.


కమ్యూనిస్టు పార్టీని నాశనం చేయడానికి గ్రామాలపై ఆకస్మిక దాడులు చేశారు. స్త్రీల మానాలు దోచారు. దొరికిన వారిని చిత్రహింసలకు గురి చేశారు. అక్రమ కేసులు పెట్టి జైళ్లల్లో పెట్టారు. మరోవైపున భారత ప్రభుత్వం నిజాం నవాబుతో రాజీ ప్రయత్నాలు చేస్తున్నది. నిజాం నిరంకుశ పాలన అంతమై సంస్థానం భారతదేశంలో విలీనం జరగాలంటే సాయుధ పోరాటం తప్ప మరో మార్గం లేదని ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీలు గ్రహించాయి.

1947 సెప్టెంబర్ 11న ఉద్యమ నాయకులు రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారు.

అయ్య నీ బాంచనన్నోళ్లే బందూకులు పట్టారు. కారం, రోకలి, కర్రలు, గుత్పలు, వడిశల అందిందల్లా ఆయుధమయ్యింది. అనతికాలంలోనే 10,000మంది గెరిల్లా దళ సభ్యులయ్యారు. వేలాదిమందితో గ్రామ రక్షక దళాలేర్పడ్డాయి. స్త్రీలు, పురుషులు, బాలలు నిజాం సేనలను, రజాకార్లను తరిమికొట్టారు.

3000 గ్రామాల నుండి దొరలు, దేశముఖులు, జాగీర్దార్లు, జమీందార్లను తరిమికొట్టి గ్రామ రాజ్యాలు ఏర్పాటు చేశారు. వారి ఆక్రమణలోని 10,00,000 ఎకరాల భూమి పేదలకు పంచారు. ఖాసింరజ్వీ నిషా దిగింది. నిజాం నవాబు కోరలు పీకినట్టయింది. భారత ప్రభుత్వంతో రాజీపడటమే మంచిదనుకున్నాడు. లేకుంటే తమ రాజ్యం కమ్యూనిస్టులు ఆక్రమిస్తారని భయపడ్డాడు. చివరకు 1948, సెప్టెంబర్ 13న భారత సైన్యాలు ప్రవేశించాయి. నవాబు తన రాజ్యాన్ని భారతదేశంలో విలీనం చేస్తున్నట్టు ప్రకటించాడు. కొద్ది రోజులకు నిజాం నవాబు రాజప్రముఖుడుగా కొత్త అవతారమెత్తా రు.



### కమ్యూనిస్టు పార్టీ ద్వితీయ మహాసభ

1948 ఫిబ్రవరి 28 నుండి మార్చి 6వరకు కలకత్తాలో జరిగిన రెండవ పార్టీ మహాసభ నిర్ణయాలు అతివాద దుందుడుకువాదంతో వాస్తవ పరిస్థితులకు భిన్నంగా జరిగాయి. పార్టీ తీవ్రంగా నష్టపోయింది.

భారతదేశానికి నిజమైన స్వాతంత్య్రం రాలేదని, ప్రభుత్వం చేతులు మారిందని, నిజమైన స్వాతంత్య్రం సాధించడానికి దేశవ్యాపిత సాయుధ సమరం సాగించాలని, దానికి తెలంగాణ పోరాట కేంద్రం కావాలన్నది. దాన్ని ప్రజలు హర్షించలేదు. పార్టీ అభిమానులు, కొంతమంది కార్యకర్తలు పార్టీకి దూరమయ్యారు. ప్రజా సంఘాలు బలహీనపడ్డాయి.

1947 నుండి 1951 వరకు జరిగిన తెలంగాణ పోరాటంతో, తెలంగాణ ప్రాంతంలో 4000 మంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అమరులైనారు. ఆంధ్ర ప్రాంతంలో దాదాపు 500 మంది కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు కాల్చివేయబడ్డారు. కాటూరు–ఎలమర్రులో మానవత్వం మరిచిన సంఘటనలు జరిగాయి.

తెలంగాణ సాయుధ పోరాటం దేశ, విదేశాలలో ఖ్యాతిగాంచింది. కమ్యూనిస్టు పార్టీ ప్రతిష్టకు, వీరుల విప్లవ దీక్షకు, త్యాగాలకు ప్రతీక అయ్యింది. తెలంగాణమంతటా ప్రతి పల్లె, ప్రతి చెట్టూ, గుట్టా పోరాట చరిత్రను ప్రతిధ్వనించింది.

ఎన్నో వీరగాథలు నేటికి యువతను ప్రభావితం చేస్తున్నాయి.

1951 అక్టోబరు 21 సాయుధ పోరాట విరమణ జరిగింది.ఆ పోరాట ఫలితంగా వేలాది ఎకరాల భూమి కౌలుదార్లకు దక్కింది. జాగీర్లు, జమీందారీ విధానం రద్దయ్యింది. దేశంలో భూసమస్య ప్రధాన సమస్యగా వెలుగులోనికొచ్చింది.

కొద్దికాలం క్రితమే నిషేధం నుంచి బయటకు వచ్చిన సిపిఐ, 1952 ప్రథమ సార్వత్రిక ఎన్నికల్లో పార్లమెంటు, శాసనసభలకు పరిమితంగానే అభ్యర్థులను నిలిపినా మంచి ఫలితాలు సాధించి పార్లమెంటులో, కొన్ని శాసనసభల్లో ప్రధాన ప్రతిపక్షమయ్యింది.

* విదేశీ పాలన నుండి గోవా, పుదుచ్చేరి ప్రాంతాల విముక్తికి జరిగిన పోరాటాల్లో ముందున్నది.
* రైతు కూలీ, కార్మిక హక్కుల కోసం ఇతర ప్రజా సమస్యలపై అనేక ఆందోళనలు, ఉద్యమాలు సాగించింది.
* బ్యాంకులు, ఇన్సూరెన్సు జాతీయాకరణ, రాజభరణాల రద్దు, 18 సంవత్సరాలకు ఓటింగు హక్కు సాధించింది. ఇదంతా ఘనమైన గత చరిత్ర – త్యాగాల చరిత్ర– చరిత్రలో చెరగని సువర్ణాధ్యాయాలు. పార్టీలో చీలిక అనంతరం వివిధ పేర్లతో పనిచేస్తున్న కమ్యూనిస్టు పార్టీలు వారి పద్ధతుల్లో ప్రజలపక్షాన ఉద్యమాలు, ఆందోళనలు చేస్తున్నాయి. కానీ...

***

ఆ చరిత్ర ఏమయ్యింది? ఆ త్యాగాలు ఏమైనాయి?

ఎందుకు రోజు రోజుకూ కమ్యూనిస్టు పార్టీలు బలహీనపడుతున్నారు.

ఈనాటి స్థితికి 1964లో పార్టీలో చీలిక – తర్వాత చీలికలు పేలికలుగా మారడం కారణమా? సిద్ధాంతానికి కాలం చెల్లిందా? ఆచరణలో అవగాహన లోపించిందా?

పార్టీ చీలడానికి కారణాలున్నాయి! కానీ, ఇప్పుడు ఐక్యం కాకపోవడానికి అవరోధాలేమిటి?ఇది సామాన్య కమ్యూనిస్టు అభిమానులు, శ్రేయోభిలాషులు అడుగుతున్న ప్రశ్న. కార్యకర్తల మనసుల్లోని ఆవేదన. కమ్యూనిస్టు పార్టీలు నిర్మాణ రీత్యా బలహీనపడ్డాయి. కానీ, ప్రజాదరణ కోల్పోలేదు.

అభిమానులు, శ్రేయోభిలాషులు, ప్రగతిశీలురు, కమ్యూనిస్టులు ప్రత్యామ్నాయంగా ఎదగాలని కోరుకుంటున్నారు.

దేశం పరిస్థితి ఎలా ఉన్నా!

దేశంలో విప్లవోద్యమానికి పేరుగాంచిన చారిత్రాత్మక తెలంగాణ సాయుధ సమరాన్ని సాగించి, 4500 వీరుల ఆత్మబలిదానంతో ఎరుపెక్కిన తెలుగు నేలపై – ఆంధ్ర – తెలంగాణలో ఏ పల్లె కెళ్ళినా – ఏ పుట్టా – చెట్టూనడిగినా ఆనాటి పోరాటాన్ని, వీరుల త్యాగాలను, వీర కృత్యాలను గుర్తు చేస్తాయి. ఎటు చూసినా అమరవీరుల స్మారక స్థూపాలు దర్శనమిస్తాయి. వేలాది వీరుల రుధిరంలో ఎరుపెక్కిన ఎర్రజెండాలు కనిపిస్తాయి.

భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాలు కమ్యూనిస్టుల్లో–వారు ఏ పేరుతో ఉన్నా – పునరాలోచనకు, ఐక్య కార్యాచరణ, ఐక్యతకు ప్రేరణ కావాలి. అట్టి ఐక్యత శ్రమజీవులకు భరోసా ఇస్తుంది – పునరుత్తేజం నింపుతుంది.

(ముగిసింది)

### కాంగ్రెస్‌లోనుంచి బయటకు...

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత కాంగ్రెస్ నాయకులందరూ విడుదలయ్యారు. 1945 సెప్టెంబరు 21న కాంగ్రెస్ పార్టీ తరఫున కార్యదర్శి జె.బి.కృపలాని, ఎ.ఐ.సి.సి. సభ్యులైన 12మంది కమ్యూనిస్టులకు షోకాజ్ నోటీసు పంపారు.

1. ఎఐసిసి పాలసీకి విరుద్ధంగా 1942 నుండి ప్రజాయుద్ధం ప్రచారం చేశారు.
2. కాంగ్రెస్ పాలన తమ పాలసీ కాదని ప్రకటించారు.
3. కాంగ్రెస్ పాలసీని విమర్శిస్తూ కాంగ్రెస్ వర్కింగ్ కమటీపై అనేక ఆరోపణలు, వ్యాఖ్యానాలు చేశారు. అందువల్ల మీమీద క్రమశిక్షణా చర్యలు ఎందుకు తీసుకోకూడదో సమాధానం చెప్పాలన్నారు. విచారణ కమిటీ సభ్యులుగా జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, గోవింద్ వల్లభ్‌పంత్ నియమితులయ్యారు. కమటీ సభ్యులను విలేకరులు అడిగిన ప్రశ్నకు

''ఒకవేళ సమాధానాలు సంతృప్తికరంగా లేకపోతే, ఏమి చర్య తీసుకుంటామన్న దానికి సమాధానం చెప్పడం తొందర పాటు అవుతుంది. కానీ, ఒక విషయం స్పష్టం చేయ దలచాము. కమ్యూనిస్టులకు కాంగ్రెస్ ద్వారాలు మూసివేయ బడలేదు. విధానాలను వ్యతిరేకించిన వారిని కాంగ్రెస్ కార్య నిర్వహణ పదవుల్లో కొనసాగించడం సబబా అన్నది పరిశీలించవలసి వుంది'' అన్నారు.

షోకాజ్ నోటీసుకు విడివిడిగా సమాధానం కాకుండా, కార్యదర్శి పి.సి.జోషి సమాధానం చెప్పడం మంచిదనుకున్నారు. పార్టీ తరఫున పి.సి.జోషి, కాంగ్రెస్ తరఫున మహాత్మాగాంధీ మధ్య ఈ అంశంపై సుదీర్ఘమైన ఉత్తరప్రత్యుత్తరాలు జరిగాయి.

చివరకు బూర్జువా పార్టీలో ఉండి పనిచేయడం కంటే, బయటకు వచ్చి విప్లవ పార్టీగా స్వతంత్రంగా పనిచేయాలని పార్టీ నిర్ణయించుకున్నది. కాంగ్రెస్ నుండి కమ్యూనిస్టులు బయటకు వచ్చారు.

అన్ని పార్టీలు వేరైన తర్వాత 1946లో కాంగ్రెస్ సంస్థ ఒక రాజకీయ పార్టీగా మారింది.

కొద్ది రోజుల్లో స్వాతంత్య్రం సిద్ధించబోతుంది. స్వాతంత్య్రం తర్వాత జాతీయ కాంగ్రెస్‌ను రద్దు చేయాలని, ఎవరికి వారు స్వంత పార్టీలు పెట్టుకోవాలన్న మహాత్మాగాంధీ ప్రతిపాదనను కాంగ్రెస్ నాయకులు తిరస్కరించారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన కాంగ్రెస్ చరిత్రను, ప్రతిష్ఠను వదలుకుని వేరే పార్టీ ఎందుకు! కాంగ్రెస్‌ను తమ సొంతం చేసుకోవాలనుకున్నారు. 1946లో జాతీయ ఉద్యమ వేదికగా ఉన్న కాంగ్రెస్, భారత జాతీయ కాంగ్రెస్ పేరుతో రాజకీయ పార్టీగా మారింది.

## ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ను వ్యవసాయ అధికారి సోమ లింగారెడ్డి సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ధాన్యం సెంటర్లలో నాణ్యతా ప్రమాణాలను పాటించి మద్దతు ధర ను పొందాలని రైతులకు సూచించడం జరిగింది. అనంతరం తిప్పనగుల్ల గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాక్స్ సీఈఓ, ఏఈఓ మౌనిక రైతులు పాల్గొన్నారు.

## మంత్రి వివేక్‌కు స్వాగతం పలికిన కలెక్టర్



**ప్రజాపక్షం/గజ్వేల్:** ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శనివారం రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి గజ్వేల్ చేరుకోగా, జిల్లా కలెక్టర్ హైమావతి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు తూకుంట నర్సారెడ్డి, ఆర్డిఓ చంద్రకళ, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, విజయమోహన్, శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్లు సర్దార్ ఖాన్, ప్రభాకర్ గుప్త, పట్టణ కాంగ్రెస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మొనగారి రాజు, రాములు గౌడ్, మజీద్ కమిటీ చైర్మన్ మతిన్ పాల్గొన్నారు.

## ప్రమాదరహిత ప్రాంతమే లక్ష్యం: సిపి



**ప్రజాపక్షం/హాజీపూర్/మంచిర్యాల:** రోడ్డు ప్రమాద రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే పోలీసు శాఖ లక్ష్యమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా మంచిర్యాల జోన్ లోని వేంపల్లి, ముల్కల బ్రిడ్జి, గుడిపేట బ్రిడ్జి ప్రాంతాల్లోని బ్లాక్ స్పాట్లను శనివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ అండ్ బి, ఎక్సైజ్, ఆర్‌టిఎ, హైవే ఇంజనీరింగ్ అధికారులతో సమన్వ యం చేసుకుంటూ ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను పరిశీలించి సాంకేతిక కారణాలను విశ్లేషించారు. ఆయా చోట్ల స్పీడ్ బ్రేకర్లు, లైటింగ్, రంబుల్ స్టిక్స్, వేగ నియంత్రణ సూచికలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రాంగ్ రూట్ లో వాహనాలు రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. చలికాలంలో మంచు కారణంగా రోడ్డు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున వాహనదారులు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో డిసిపి భాస్కర్, ఎసిపి ప్రకాష్, సిఐ అశోక్ కుమార్, ఎస్ఐ స్వరూప్ రాజ్, రోడ్ సేఫ్టీ ఇన్స్పెక్టర్ రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు నిధులు మంజూరు



**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడం జరిగిందని తాజా మాజీ సర్పంచ్ పెద్దపులి రవి పేర్కొన్నారు. గ్రామానికి సంబంధించి అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ఎంజిఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద రూ. 8లక్షలు, అదనంగా ఎంపీ నిధుల నుంచి రూ. 4లక్షలు కేటాయించడం జరిగిందని, అదేవిధంగా గ్రామంలో సీసీ రోడ్లకు రూ. 5లక్షలు ప్రొసిడింగ్ ఆర్డర్స్ ఎంపీ రఘునందన్‌రావు చేతులమీదుగా శ్రీనివాస్‌గౌడ్‌కు అందజేయడం జరిగిందన్నారు. నిధులు మంజూరుకు కృషి చేసిన ఎంపీ రఘునందన్‌రావుకు, జిల్లా అధ్యక్షులు వాల్దాస్ మల్లేశ్‌గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, సుదర్శన్, కిషోర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఇంటికి కన్నం వేసిన అక్క.. పట్టించిన సిసి కెమెరా



**ప్రజాపక్షం/నిజామాబాద్:** ఓ బ్యూటీ పార్లర్ కోసం ఇంటిని అద్దెకొస్తే అందులో పని చేసే అక్క య జమాని ఇంటికి కన్నం వేసినఘటన జిలా కేంద్రంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని కుమార్‌గల్లీ చెందిన గంగా విషన్ తన భవనంలో ఉన్న ఒక షట్టర్‌ను మూడేండ్ల క్రితం బ్యూటీ పార్లర్ నిర్వాహకురాలికి అద్దెకు ఇచ్చారు. పార్లర్ యజమానురాలి అక్క వినాయకనగర్ చెందిన గాయత్రి అలియాస్ గౌతమి సైతం రోజు బ్యూటీపార్లర్ వచ్చేది. ఈ క్రమంలో ఇంటి యజమానులతో గాయత్రి సన్నిహితంగా ఉంటూ తరచూ వారి ఇంట్లో కలివిడిగా ఉండేది. ఓ రోజు గాయత్రి వారి ఇంటి డోర్ తాళం చెవి (సెంట్రల్ లాక్) ను చోరీ చేసి డుబ్లికేట్‌కు చేయించుకుంది. యజమానులు ఇంట్లో లేని సమయంలో తన వద్ద ఉన్న తాళం చెవితో ఇంట్లోకి చొరబడి కబోర్డులో ఉన్న బంగారు నగలు, వెండి, చోరీ చేసింది. ఇలా చాలాసార్లు వస్తువులు, డబ్బులు కనిపించకుండా పోవటంతో అనుమానం వచ్చిన యజమాని ఇంట్లో స్పై కెమెరా అమర్చారు. చాలా రోజుల తర్వాత ఇంటిలోని తమ బీరువా, కబోర్డులోని బంగారం గౌతమి చోరికి పాల్పడ్డట్లు గుర్తించి శుక్రవారం వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు బీరువాలో నుంచి సుమారు రూ.20 లక్షల నగదు, 17 తులాల వరకు బంగార నగలు, కిలో పావు వెండి వస్తువులు చోరీకి గురైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా శనివారం 80 గ్రాముల బంగారం, 1300 గ్రాముల వెండి, 50 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకుని గౌతమిని కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్‌హెచ్‌ఓ రఘుపతి తెలిపారు.

## పకడ్బందీగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు ఏర్పాట్లు.. ఆలస్యమైతే నో ఎంట్రీ



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నిర్మల్ జిల్లాలో ఆదివారం రోజున నిర్వహించనున్న నేషనల్ మీన్ కం మెరిట్ స్కాలర్షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు నిర్మల్ జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాధికారి(డిఈఓ) దర్శనం భోజన్న తెలిపారు. జిల్లాలోని 84 ప్రభుత్వ, జడ్పీ పాఠశాలల నుంచి మొత్తం 1043 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కానున్నారు. ఈ పరీక్ష కొరకు ఖానాపూర్ లో బాలికల పాఠశాల, నిర్మల్ లో జిమిరాపేట్ పాఠశాల, కస్బా పాఠశాల, బైంసాలో ఆశ్రమ బాలికల పాఠశాల, ప్రభుత్వ బాలుర పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.ఈ పరీక్ష ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుందని వెల్లడించారు. పరీక్ష రాసే అభ్యర్థులు తమ పరీక్ష కేంద్రాలకు అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించే ప్రసక్తి లేదని డిఈఓ స్పష్టం చేశారు. పరీక్ష పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఫ్లయింగ్ స్క్వాడ్స్,సిట్టింగ్ స్క్వాడ్, సెంటర్ లెవల్ అబ్జర్వర్లు, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు నియమించారు. పరీక్ష జరిగే సమయంలో కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమల్లో ఉంటుందని, అలాగే జిరాక్స్ సెంటర్లన్నీ మూసి వేయబడతాయని తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం కేంద్రాలలో మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉంటారని, పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.

**గత లోపాలపై అప్రమత్తత అవసరం**

గత సంవత్సరం బైంసా సెంటర్లలో తలెత్తిన లోటుపాట్లు ఈసారి పునరావృతం కాకుండా అధికారులు కుట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారా అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.గతంలో జరిగిన లోపాలను దృష్టిలో ఉంచుకుని,ఈసారి అవి మళ్లీ జరగకుండా తగిన చర్యలు చేపట్టాలని విద్యార్థులు,తల్లిదండ్రులు కోరుతున్నారు

# మహిళాభ్యున్నతికి కాంగ్రెస్ సర్కార్ పెద్దపీట

గజ్వేల్ నియోజకవర్గంలో 54 వేల చీరల పంపిణీ

మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి





**ప్రజాపక్షం/గజ్వేల్:** సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళాభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. శనివారం గజ్వేల్‌లో ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, కలెక్టర్ హైమావతి, డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు నరేందర్ రెడ్డి, విజయ మోహన్, వైస్ చైర్మన్లు సర్దార్ ఖాన్, ప్రభాకర్ గుప్త, ఆర్డీవో చంద్రకళ, డిఆర్డిఓ జయదేవ్ ఆర్యలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళా అభ్యున్నతికి ప్రాధాన్యత ఇస్తూ వారిని అన్ని రంగాల్లో బలోపేతం చేయడానికి, ఆర్థికంగా తీర్చిదిద్దడానికి వివిధ పథకాలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే మహిళలకు పెట్రోల్ బంకుల కేటాయింపు, స్కూల్ యూనిఫాం తయారీ, రూ. 28 కోట్ల వడ్డీలేని రుణాలు, బ్యాంక్ లింకేజీ కింద రూ 600 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అంతేకాకుండా ఉచిత బస్సు కోసం రూ.8 వేల కోట్లు ఖర్చు చేస్తుండగా, సన్నబియ్యం పంపిణీకి రూ.12 వేల కోట్లు మంజూరి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా మహిళలకు ఇష్టమైన రంగులతో సిరిసిల్ల, కరీంనగర్ లలో నాణ్యమైన చీరలను తీర్చిదిద్ది అందిస్తుండగా, గజ్వేల్ నియోజకవర్గంలో 54 వేల చీరలు అందిస్తున్నట్లు తెలిపారు. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ సేవలు గుర్తు చేసుకుంటూ వారి పేరిట చీరలు ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎంతోకాలంగా ఎదురు చూసిన కొత్త రేషన్ కార్డులు అందిస్తుండగా, 200 యూనిట్ ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలు పేద కుటుంబాలకు మేలు చేస్తుందని తెలిపారు. కాగా జిల్లాలో ఇందిరమ్మ 11వేల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, 9వేల ఇండ్లు వివిధ దశలలో ఉన్నట్లు చెప్పారు. అభివృద్ధి పథకాలు నిరంతరంగా మంజూరి చేస్తున్నట్లు వివరించారు.

## అర్హులందరికీ ఇందిరా మహిళా చీరలు: ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** అర్హులందరికీ ఇందిరా మహిళా చీరలు అందిస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా ఉన్నతి పేరిట ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టిన సందర్భంగా శనివారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే, డీఆర్డీవో పీడీ విజయలక్ష్మిలు హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ మహిళా శక్తి పేరిట చీరలు అందిస్తామని అన్నారు. ఇప్పటికే సొంత ఇళ్లు సాకారం ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, ఉచిత ప్రయాణం, సన్నబియ్యం వంటి అన్ని సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలుచేస్తున్నామని, ప్రభుత్వం మహిళా స్వయం సహాయక సంఘాలన పోత్సహించేందుకు చీరల పంపిణీ చేపట్టిందని అన్నారు. పేదల అభ్యున్నతి కోసం ప్రజాప్రభుత్వం నిరంతరం కృసి చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈఓ గోవింద్, ఎంపీడీవో రమాకాంత్, తహసీల్దార్ సుజాత, ఐకేపీ ఏపిఎం మల్లేష్, ఏపీమ్వో కరుణాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ భూషన్, వైస్ చైర్మన్ మజీద్, మాజీ మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, దయానంద్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## చేగుంట—వడియారం రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి

రైల్వే మార్గాన్ని జీరో యాక్సిడెంట్ జోన్‌గా తయారు చేయాలి

ఎంపి రఘునందన్ రావు



**ప్రజాపక్షం/మెదక్:** మెదక్ జిల్లాలోని చేగుంట వడియారం రైల్వే గేటు వద్ద నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, ప్రజల ప్రాణ భద్రతను కాపాడటం, రవాణా సౌకర్యాన్ని మెరుగుపరచడం అత్యవసరమని మెదక్ ఎంపి అభిప్రాయపడ్డారు.శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధ్యక్షతన రైల్వే, ఫారెస్ట్, ఆర్ బి, పంచాయతీరాజ్, ఎలక్ట్రిసిటీ,మిషన్ భగీరథ అధికారులతో ఎంపి రఘునందన్ రావు సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైల్వే పెండింగ్ లో ఉండడం వల్ల ప్రతి సారి వందలాది వాహనాలు రెండు వైపులా నిలిచిపోవడంతో అంబులెన్స్‌లు, అత్యవసర సేవల వాహనాలు తీవ్ర అంతరాయం ఎదుర్కొంటున్నాయన్నారు. రద్దీ సమయంలో పాదచారులు ట్రెక్కులు దాటే పరిస్థితి ఏర్పడి పెద్దా ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు.రోడ్డురైలు కలిసే స్థాయిలను తగ్గించేందుకు రైల్వే ఓవర్ బ్రిడ్జులు, అండర్ బ్రిడ్జులు నిర్మించడం ప్రమాదాల నివారణకు ప్రధాన చర్యలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయన్నారు. తక్షణం కాంట్రాక్టర్, సంబంధిత శాఖల ఇంజనీర్లు సమన్వయంతో రోబి పనులు పూర్తి చేసి, సర్వీస్ రోడ్లు, డ్రైనేజీ, లైటింగ్, సిగ్నలింగ్ వంటి అనుబంధ సదుపాయాలను కూడా సమగ్రంగా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రైల్వే శాఖ, ఆర్ అండ్ బీ శాఖ, ఇతర శాఖల అధికారులందరూ సమన్వయంతో రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులను వేగవంతం చేయాలని, రాబోయే రోజుల్లో ఈ మార్గంలో “జీరో యాక్సిడెంట్ జోన్” లక్ష్యంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో రైల్వే ఓవర్ బ్రిడ్జిని పూర్తి చేసి ప్రజల రవాణా సౌకర్యార్థం అందుబాటులో తేవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, శాఖల అధికారులందరూ పాల్గొన్నారు.

## పేదలకు ఇళ్లు ఇవ్వడమే లక్ష్యం: ఎంపి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ప్రతి పేదవాడికి ఇల్లు ఇవ్వడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఆదిలాబాద్ ఎంపి గొడం నగేష్ అన్నారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని రైతు వేదికలో శనివారం పివిటిజి లబ్ధిదారులకు పిఎం జన్మన్ కింద ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిఎం జన్మన్ ద్వారా ప్రతి పేద గిరిజనుడికి ఇల్లు అందించడమే లక్ష్యమన్నారు. ప్రస్తుతం ఇళ్లు రాని వారికి భవిష్యత్తులో మంజూరు చేస్తామని తెలిపారు. పివిటిజిల అభివృద్ధి కోసం వారి గ్రామాల్లో కేంద్ర నిధులతో మల్టీపర్పస్ సెంటర్లు ఏర్పాటు చేశామని, అక్కడ అంగన్‌వాడీ, ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హాల్ వంటి సేవలు లభిస్తున్నాయని వివరించారు. పేద గిరిజనులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అంతకుముందు కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో 2169 ఇళ్లు మంజూరయ్యాయని, ఆసిఫాబాద్, తిర్యాణి మండలాల్లో అత్యధికంగా ఉన్నాయని తెలిపారు. ఎంఎల్‌ఏ కోవలక్ష్మి మాట్లాడుతూ మండలంలో 543 ప్రతిపాదనలకు గాను 449 మంజూరయ్యాయని, మిగతావి కూడా మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని చెప్పారు. లబ్ధిదారులు దళారులను నమ్మకుండా సొంతంగా ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జడ్పి సిఇఒ లక్ష్మీ నారాయణ, హౌసింగ్ పిడి ప్రకాష్, డిఇ వేణుగోపాల్, ఎంపిడిఒ శ్రీనివాస్,అలీబిన్ అహ్మద్, మాజీ జడ్పిటిసి నాగేశ్వరరావు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

## ఆస్పత్రి నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం

నిండు ప్రాణం బలి..!

సెటిల్‌మెంట్లతో సరి..

చర్యలు ఏవీ?



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ జిల్లా కేంద్రంలోని సంతోష్ రాజ్ హాస్పిటల్‌లో చోటుచేసుకున్న హృదయవిదారక ఘటన స్థానికంగా కలకలం రేపింది.ఆసుపత్రి యాజమాన్యం,సిబ్బంది వ్యవహరించిన ఘోర నిర్లక్ష్యం కారణంగా అప్పుడే జన్మించిన ఒక పసిబిడ్డ ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది.సారంగాపూర్ మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన మధ్యా రాజమణి,సాయిరాం దంపతులకు శుక్రవారం ఉదయం శిశువు జన్మించింది.ఆ చిన్నారి అనారోగ్యంతో ఉండటంతో,మెరుగైన చికిత్స కోసం తల్లిదండ్రులు వెంటనే నిర్మల్ పట్టణంలోని సంతోష్ రాజ్ హాస్పిటల్ కు శిశువును తీసుకువచ్చారు. చిన్నారికి చికిత్స అందిస్తున్న తరుణంలోనే ఆక్సిజన్ అందించే పైపును గోడకు అమర్చడానికి ఉపయోగించే కప్‌బోర్డ్ ఒక్కసారిగా విరిగిపోయింది. ఈ విరిగిన భాగం నేరుగా పసిబిడ్డపై పడటంతో,ఆ చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది.ఈ ఘటనతో ఆసుపత్రిలో ఒక్కసారిగా కలకలం రేగింది. వారు హడావుడిగా పసిబిడ్డ మృతదేహాన్ని ఐసీయూకి తరలించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు తీవ్ర ఆగ్రహంతోమృతదేహంతో పాటు ఆసుపత్రి వద్దకు చేరుకుని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఆసుపత్రి సిబ్బంది తమ లోపాలను కప్పిపుచ్చుకునేందుకే తమను తప్పుదోవ పట్టించారని వారు ఆరోపించారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం: కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్:** వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. ఏ ఒక్క రైతు కూడా ఇబ్బందికి గురి కాకుండా ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని హితవు పలికారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో శనివారం సహకార సంఘాల ఇన్‌చార్జిలతో కలెక్టర్ కొనుగోలు కేంద్రాల నిర్వహణపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలో పెద్ద ఎత్తున ధాన్యం సేకరణ జరిపామన్నారు. అయితే పలు చోట్ల నాట్లు వేయటంలో ఆలస్యమైనందున ధాన్యం దిగుబడులు కొంత ఆలస్యంగా వస్తున్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అలాంటి ప్రాంతాలను మినహాయిస్తూ మిగతా చోట్ల రెండు మూడు రోజులలో ధాన్యం సేకరణను పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని వెంటాదివెంట మిలుల్లకు తరలించాలని రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగేలా చొరవ చూపాలన్నారు. కేంద్రాల వద్ద సరిపడా సంఖ్యలో హమాలలను అందుబాటులో ఉంచాలని వెంటాదివెంట ధాన్యం తరలింపు కోసం లారీలను సమకూర్చాలని అధికారులను ఆదేశించారు. మిల్లుల వద్ద దొడ్డురకం ధాన్యం సైతం సకాలంలో అన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకున్నామని,ఒకవేళ ఎక్కడైనా ధాన్యం దిగుమతి చేసుకోకపోతే తమ దృష్టికి తేవాలన్నారు. మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడ్ జరిగాక ట్రక్ షీట్లు వేగంగా తెప్పించుకుని ఓపిఎంఎస్ ఎంట్రీలు చేయాలని సూచించారు. కాగా జిల్లాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా ధాన్యం సేకరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందని కలెక్టర్ సంఘాల ఇన్‌చార్జిలను, కేంద్రాల నిర్వాహకులను అభినందించారు. మిగతా ధాన్యాన్ని సైతం పూర్తి స్థాయిలో సేకరించాలన్నారు. వచ్చే సీజన్‌లో కూడా ఎలాంటి అవరోధాలు లేకుండా ఇదే స్ఫూర్తితో ధాన్యం సేకరణ ప్రక్రియను నిర్వహించేలా ఇప్పటి నుండే ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, సివిల్ సప్లయి డిఎం శ్రీకాంత్ రెడ్డి, డిఎస్‌ఓ అరవింద్‌రెడ్డి, డీసీఓ శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌ల అమలుకు నిరసనగా ‘బ్లాక్ డే’



**ప్రజాపక్షం/ఎడపల్లి:** కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు దేశ కార్మిక వర్గానికి చీకటి దినం వంటివని తెలంగాణ ప్రగతిశీల బీడి వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు బి.మల్లేష్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. శనివారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని మంగళ్పాహాడ్ గ్రామంలో బీడీ కార్మికులత సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. 1990లోనే నూతన పారిశ్రామిక విధానాలు తెచ్చినప్పటికీ, వాటిని అమలు చేయుటకు నాటి పాలకులు సాహసించలేదని గుర్తు చేశారు. నేటి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బడా కార్పొరేట్ శక్తులకు దేశ కార్మికుల శ్రమను మరింత దోచుకోవడానికి వీలుగానే ఈ సంస్కరణలను తీసుకొచ్చిందని ఆరోపించారు. ఈ కొత్త లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి నష్టకరమని, వీటిని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని బి.మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సవిత, ప్రమీల, సుగుణ, అర్చన, పోసాని, వసంత, లాస్య, అనసూయ, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

# పల్లె పోరు...సందడి జోరు!

సర్పంచ్ ఎన్నికలకు సన్నద్ధం

రాజకీయ పార్టీల నేతలతో అధికారుల సమావేశాలు

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

పోటీకి ఏర్పాట్లు చేసుకుంటున్న పార్టీ నేతలు

రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్‌కు అనుగుణంగా..





**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంది. ఎన్నికల సంఘం ఆదేశాలతో ఓటరు జాబితాపై నజర్ పెట్టారు. జాబితాను మరో దపా పరిశీలించడంతో పాటు ఎన్నికల కోసం ఏర్పాట్లు చేసేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామ పంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను మూడు దఫాలలో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా రిజర్వేషన్లను ప్రకటించేందుకు ఏర్పాట్లను చేస్తున్నారు. రాజకీయ పార్టీ నేతలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, అధికారుల సమావేశంలో స్పష్టత ఇవ్వడంతో అధికారులు సిద్ధమవుతున్నారు. సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా అభ్యంతరాలు పరిశీలించడం పోలింగ్ కేంద్రాల ఏర్పాటు రిజర్వేషన్ల ప్రక్రియ ఉద్యోగులకు శిక్షణ వంటి అంశాలను పరిశీలిస్తున్నారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించగానే ఎన్నికలు నిర్వహించేందుకు రెడీగా ఉన్నారు. జిల్లా స్థాయిలో అధికారులతో సమీక్షించడంతో పాటు రాజకీయ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణపై మాట్లాడటంతో పాటు ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలపాలని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నేతలకు కలెక్టర్లు వివరించారు. గత ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఏర్పాటు చేసిన రీతిలోనే ఈ ఎన్నికలకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. మొదట సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలను నిర్వహిస్తామని ఎన్నికల సంఘం తెల్పడంతో ఈ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

**రొటేషన్ పద్దతిలో ఎన్నికలు...**

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల విధి విధానాలను శనివారం రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 50శాతం మించకుండా రిజర్వేషన్లు కల్పించేలా మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు శనివారం జీవోను విడుదల చేసింది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను ఎలా అమలులోకి తీసుక రావాలో స్పష్టమైన పక్రియను వివరించింది. భారతీ రాజ్యాంగంలోని ఆర్టికల్ 244ప్రకారం షెడ్యూల్డ్ ఏరియాల్లో రిజర్వేషన్లను అ మలు చేయనున్నట్లు జీవోలో పేర్కొంది. ఇక మహిళలకు 50శాతం వరకు జజర్వేషన్లకు కల్పించాలని నిర్ణయించింది. ఈ రిజర్వేషన్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ సహా అన్ని కేటగిరిల్లో సమానంగా అమలు చేయాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. గత 2019 ఎన్నికల్లో ఏ కేటగిరికి రిజర్వేషన్లు కేటాయించారో, వాటిని పరిగణనలోకి తీసుకొని తాజా రొటేషన్ ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేసింది. ఇక వార్డు మెంబర్లకు 2024 కుల సర్వే ఆధారంగా సర్పంచ్‌లకు 2011 సెన్సస్ ఆధారంగా బీసీ సర్పంచ్ అభ్యర్థులకు 2024 సర్వే ఆధారంగా రిజర్వేషన్లు కల్పించింది.

## వార్డు స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు



**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం వార్డు స్థానాలకు రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేశారు. వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్ల ఖరారుపై రాజకీయ పార్టీ నాయకుల సమక్షంలో మహిళ రిజర్వేషన్లు లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కృష్ణ ప్రసాద్, ఎంపిఓ ప్రభాకర్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు వెంకటేశం, రామమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని పారుపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శాలగుండ్లపల్లి శివారులోని గుట్టకు నేషనల్ హైవే మట్టి తవ్వకం కోసం పర్మిషన్ తీసుకొని నేడు మట్టి తీసేందుకు వెళ్లగా గ్రామస్తులు అడ్డుకున్నారు. రైతులు ఐకేపి కోసం గత 15 రోజుల క్రితం సొంత ఖర్చులతోని ఆ గుట్టకు ఉన్న చెట్లపొదలు అన్ని తొలగించి వరి ధాన్యం ఆరబోసుకున్నారు. అదే గుట్టకు నేషనల్ హైవే వాళ్లకు పర్మిషన్ ఇయ్యడమేందని వారు వాపోయారు. ఈ గుట్ట నుండి మట్టి తీసికెళ్తే మేము కొనుగోలు కేంద్రం ఎక్కడ ఏర్పాటు చేసుకోవాలని వారు అచ్చిన రెవెన్యూ సిబ్బంది పోలీసు వాళ్ళని డిమాండ్ చేశారు.

## ప్రభుత్వ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యం

### ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ



**ప్రజాపక్షం/బెజ్జంకి:** మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని మానకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని అన్నారు. అందులో భాగంగా ఇప్పటికే ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం, గృహ జ్యోతి కింద రెండు వందల యూనిట్లవరకు ఉచిత విద్యుత్, ఐదు వందలకే గ్యాస్ సిలిండర్, సొంత ఇల్లు లేని మహిళలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని అంతేకాకుండా ఇందిరమ్మ ఇల్లు లబ్దిదారులుగా ఎంపికైనా మహిళా గ్రూపు సభ్యులకు రెండు లక్షల మేర రుణ సదుపాయం కల్పిస్తుందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేలా పారదర్శకంగా పాలన సాగిస్తున్న రేవంతరెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. అనంతరం మండలంలోని ఆయా గ్రామాల గ్రూప్ సభ్యులు 14 మంది మహిళలకు ఇన్సూరెన్స్ ద్వారా డబ్బులను అందించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం విద్యాసాగర్, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపిడిఓ ప్రవీణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, పార్టీ మండలాధ్యక్షులు ముక్కీస రత్నాకర్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ పులి కృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, బైర సంతోష్, గూడెల్లి శ్రీకాంత్, చెప్యాల శ్రీనివాస్, ప్రజా సంఘాల నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యత

### మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ఇందిరా మహిళా శక్తి చీరల ఉత్పత్తి పథకంతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కార్మికులకు ఉపాధి దొరుకుతుందని, మహిళల ఆత్మ గౌరవానికి తోడ్పడుతుందని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఇల్లంతకుంట రైతు వేదికలో మహిళా ఉన్నతి తెలంగాణ ప్రగతి కింద ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇన్‌చార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఇంచార్జ్ కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని వివరించారు. ప్రతి ప్రభుత్వ పథకం అమలులో మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఎస్‌హెచ్‌జిల నుంచి రుణాలు మంజూరు చేస్తుందని వెల్లడించారు. మహిళల ఆర్థిక ప్రగతికి కోట్లాది రూపాయలు లోన్లు ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. జిల్లాలోని సిరిసిల్లలో ఇందిరా మహిళాశక్తి చీరలు తయారై రాష్ట్ర మంతా పంపిణీ చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి మహిళకు ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తామని స్పష్టం చేశారు. 32 జిల్లాల నుంచి ఎస్ హెచ్ జీ ల బాధ్యులు వచ్చి చీరల తయారీ విధానం, డిజైను, రంగులు, నాణ్యత చూసి ఆనందం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, మరమ్మత్తుల పనులు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మహిళా సంఘాలకు అందించామని తెలిపారు. ఎస్ హెచ్ జిల్లో ప్రస్తుతం 18 59 ఏండ్ల వారికి అవకాశం ఉందని, ప్రభుత్వం ఇప్పుడు 1518 ఏండ్ల కిశోర బాలికలకు, 60 ఏండ్ల వయసు పైబడిన వారికి కూడా సంఘాలు ఏర్పాటు చేసే అవకాశం కల్పించిందని తెలిపారు. సంఘాల్లోని మహిళలకు రుణ బీమా, ప్రమాద బీమా వంటివి అమలు చేస్తుందని, రూ. రెండు లక్షల వరకు రుణ బీమా, రూ. 10 లక్షల చొప్పున ప్రమాద బీమా మంజూరు చేసిందని వెల్లడించారు. జిల్లాలో కొత్తగా 5560 మంది ఎస్ హెచ్ జీల్లో చేరారని తెలిపారు. అంగన్వాడీ, ఆశా కార్యకర్తలతోపాటు ఇప్పుడు ఎస్ హెచ్ జీ సభ్యులకు యూనిఫాం చీరలు పంపిణీ చేస్తున్నామని ఎమ్మెల్యే, ఇన్‌చార్జి కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ పర్సన్ చైతన్య, వైస్ చైర్మన్ ప్రసాద్, డిఆర్‌డిఓ శేషాద్రి, మండల ప్రత్యేక అధికారి, డిసిఓ రామకృష్ణ, తహసీల్దార్ ఫరూక్, ఎంపిడిఓ శశికళ, ఏపిఎం, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సాదా బైనామాలపై సమగ్ర విచారణ

### దయానందారెడ్డి డిమాండ్

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూభారతి అమలు పక్రియలో సాదా బైనామాలను పట్టాలుగా మార్చే సందర్భంలో సరైన మార్గదర్శకాల ప్రకారం సమగ్ర విచారణ నిర్వహించి సదరు వ్యక్తి పేరున పట్టా అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టు దయానందారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధరణి స్థానంలో భూభారతి అమలు స్వాగతించాల్సిన అవసరమున్నప్పటికి సాదాబైనామాల పట్టామార్పుతో కొంతమంది మధ్య దళారులు సంబంధిత రైతులను పైరవీల పేరుతో మోసం చేసే అవకాశాలు కానిపిస్తున్నందున అధికారులు సమన్వయంతో రైతులకు మేలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి సంఘటనలపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. అలాగే గత ప్రభుత్వంలో సాదాబైనామాలకు అవకాశం ఇచ్చి కొంతవరకు సమస్యకు పరిష్కారం చేసినప్పటీకి ఇప్పటీకి విక్రయించిన వారి పేరునే భూకార్డులు చూచిస్తున్నందున వాటిపై విచారణ నిర్వహించి కొనుగోలు చేసిన రైతులకు న్యాయం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. ప్రస్థుతం భూముల రేట్లు అధికంగా పెరగటంతో గతంలో సాదా బైనామాలపై భూమి కొనుగోలు చేసిన రైతులకు పట్టాలవుతాయన్నా ఆశతో ఉన్నందున ప్రభుత్వం సాదా బైనామాల అమలుకు నిర్థిష్టమైన మార్గదర్శకాలు జారి చేయాలని డిమాండ్ చేశారు. జగదేవ్‌పూర్ మండలంలో కొన్ని గ్రామాలలో పేద రైతులు గత కొన్ని సంవత్సరాల క్రితం భూ స్వాములు, జాగీరు దారుల నుండి సాదా బైనామాల ద్వారా భూములు కొనుగోలు చేసిన గత ప్రభుత్వంలో ఆర్ఓఆర్ ద్వారా పట్టా మార్పిడి చేసుకున్నప్పటీకి రికార్డుల్లో మాత్రం పేరు మార్పిడి జరుగాక ఇబ్బందులు ఏదుర్కొంటున్నారని అన్నారు. ధరణీ కారణంగా మల్లి అమ్మిన భూమి అమ్మిన వారి పేరునే రికార్డులు చూపిస్తున్నాయని అన్నారు. అలాంటి వాటిపై ఉన్నతాధికారులు ప్రత్యేక చోరవ చూపి నిర్దిష్ట ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి తొందురు నర్సింహారెడ్డి,గ్రామ కార్యదరి భిక్షపతి, నాయకులు ఎల్లారెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలే కేంద్రంగా సంక్షేమ పథకాలు అమలు

### చీరల పంపిణీ ప్రారంభించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**ప్రజాపక్షం/గంగాధర:** మహిళలే కేంద్రంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర మండలం మధురానగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో శనివారం ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు మహిళలకు చీరలను అందజేశారు. మండలంలోని గ్రామాలకు చెందిన 31 మంది లబ్ధిదారులకు రూ. 31,03,596 విలువైన కల్యాణలక్ష్మి చెక్కులు, 34 మంది లబ్ధిదారులకు రూ.8,57,500 విలువైన సిఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలకు నాణ్యమైన చీరల పంపిణీ వారి ఆత్మ గౌరవానికి తోడ్పాటునందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ జాగిరపు రజిత శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రామిరెడ్డి రాజిరెడ్డి, బూరుగు గంగన్న, రేండ్ల రాజిరెడ్డి, గుజ్జుల బాపురెడ్డి, మంత్రి మహేందర్, గరిగంటి కరుణాకర్, బొంగని సాయన్న, పాల్, వంగల శ్రీనివాస్, ముద్దం నగేష్, కనకట్ల తిరుపతి, అట్ల శేఖర్‌రెడ్డి, దోమకొండ మహేష్, దీకొండ మధు, జితేందర్, కదారి కుమారస్వామి, బీర్ల ఆనంద్,స్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# చెక్ డ్యామ్ పేల్చివేత

### ఇసుక మాఫియా దారుణం



**ప్రజాపక్షం /పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం, గుంపుల గ్రామం వద్ద నిర్మించిన ఒక కీలకమైన చెక్ డ్యామ్‌ను ఇసుక అక్రమ రవాణా మాఫియా సభ్యులు పేల్చివేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.తమ అక్రమ వ్యాపారానికి అడ్డుగా ఉందన్న ఏకైక కారణంతో, సుమారు రూ,23 కోట్లకు పైగా ప్రభుత్వ వ్యయంతో, మానేరు వాగుపై నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును లక్ష్యంగా చేసుకుని ఈ దారుణానికి ఒడిగట్టారు. ఈ అమానుష ఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. చెక్ డ్యామ్ వద్ద నీరు నిల్వ ఉండడం వల్ల, వాగు నుంచి ఇసుక అక్రమ తవ్వకం మరియు రవాణాకు ఆటంకం ఏర్పడుతోందని భావించిన ఇసుక మాఫియా,ఏకంగా బాంబులను ఉపయోగించి ఈ నిర్మాణాన్ని పేల్చివేశారు. ఈ పెను దాడిలో డ్యామ్‌కు చెందిన మూడు కీలక ప్యానెల్స్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. నీటిపారుదల శాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం,ధ్వంసమైన ఈ మూడు ప్యానెల్స్ విలువ సుమారు రూ.3 కోట్లకు పైగా ఉంటుందని అంచనా వేశారు. ప్రజాధనంతో రైతులకు సాగు నీటి ప్రయోజనం కోసం నిర్మించిన ఒక ముఖ్యమైన ప్రాజెక్టును వ్యక్తిగత లాభాల కోసం ఇలా పేల్చివేయడం ప్రభుత్వ ఆస్తులపై జరిగిన ఉగ్ర చర్యగానే భావించాలని స్థానిక ప్రజలు,అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.దాడికి గురైన ఈ చెక్ డ్యామ్ నిర్మాణ పనులు ఇటీవలే దాదాపుగా పూర్తయ్యాయి. అధికారులు ప్రాజెక్టును ప్రారంభోత్సవం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్న తరుణంలోనే ఇసుక అక్రమార్కులు ఈ దారుణానికి పాల్పడ్డారు. ఈ ఘటన ఇసుక మాఫియా యొక్క తెగింపు చట్ట వ్యతిరేక కార్యకలాపాల తీవ్రతను తెలియజేస్తోంది. సమాచారం అందిన వెంటనే, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో పాటు పెద్దపల్లి జిల్లా పోలీసు ఉన్నతాధికారులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు.పేలుడు జరిగిన తీరు,నష్టం అంచనా మరియు ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని గుర్తించడానికి నిపుణులతో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకుంటామని,ఎంతటివారున్నా ఉపేక్షించేది లేదని అధికారులు ప్రకటించారు.

# 'ఇఎస్ఐ'ని సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/రామగిరి :** ఆర్జీ 3 జి.ఎం కార్యాలయం నందు శనివారం (కాంట్రాక్టు) ఉద్యోగుల కోసం ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ స్కీమ్ (ఇఎస్ఐ) క్రింద కాంట్రాక్టు ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు సదుపాయాలపై సంబధిత కాంట్రాక్టర్లకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం 3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు క్రింద పని చేయు పౌర నిర్వహణ, మరమ్మత్తు పనులు, హౌస్ కీపింగ్, భద్రత, రవాణా, తోటల పెంపకం, నర్సరీలు వంటి ఉద్యోగులు పొరుగుసేవల క్రింద పనిచేయు వారిని దృష్టిలో పెట్టు కొని ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ స్కీమ్ ద్వారా సహాయ, సహకారములు అందజేయుట, విధి విధానంపై సంబధిత కాంట్రాక్టర్ల లకు ఈ అవగాహన సదస్సును నిర్వహించము అని అన్నారు.ఈ సందర్భంగా ఇఎస్ఐ స్కీం బ్రాంచి అసిస్టెంట్ మేనేజర్ కిరణ్ కుమార్ మాట్లడుతూ సింగరేణి పొరుగుసేవాల క్రింద పని చేయు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు ఇఎస్ఐ స్కీం ద్వారా వైద్య చికిత్సను అందించాలని గతంలో కాంట్రాక్టర్ల ఉద్యోగుల సంఘాలు నుండి వచ్చిన ప్రతిపాదనలను దృష్టిలో పెట్టుకొని ఇఎస్ఐ పోర్టల్‌లో కాంట్రాక్టర్, వారి ఉద్యోగుల నమోదుపై అందించే ప్రయోజనాల దృష్ట్యా అవసరమైన చర్యలు తీసుకోవడానికి కాంపిటెంట్ అథారిటీ ఆమోదం తెలిపినది, ఉద్యోగుల రాష్ట్ర బీమా పథకం సామాజిక బీమా రాష్ట్ర బీమా చట్టం, 1948లో నిర్వచించిన విధంగా ఉద్యోగులను అనారోగ్యం, ప్రసూతి, ఉద్యోగుల గాయాలు అకాల మరణం మొదలగు వంటి వాటి నుండి బీమా చేయబడిన వ్యక్తులకు, వారి కుటుంబాలకు వైద్య సంరక్షణ అందించడానికి రూపొందించ బడినదని తెలిపారు. కాంట్రాక్ట్‌లో పని చేయు ఉద్యోగులు నెలవారీ జీతం రూ.21, 000/ కంటే తక్కువ, ఉద్యోగులతో పాటు వారిపై ఆధారపడిన వారికి వర్తించే తక్కువ ఆదాయ వర్గ ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు, ఇతర అనారోగ్య ప్రయోజనాలను విస్తరించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ల ను స్థాపించిందని, ఉద్యోగి వైద్య ఖర్చుల భారం పడకుండా ఉండేందుకు ఇది ఉపయోగపడుతుందని, కాంట్రాక్టర్లు ఇట్టి విషయాలపై అవగాహన పెంచుకొని కాంట్రాక్టు ఉద్యోగులకు తెలియజేయాల్సిందిగా కోరారు.కార్యక్రమంలో ఎస్వోటుజిఎం బండి సత్య నారాయణ, సివిల్ డిజిఎం రాజేంద్ర కుమార్, డివై పిఎం వి.సునీల్ ప్రసాద్, డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్ శ్రీహర్ష, వివిధ గనుల సంక్షేమ అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు వనం.రామ్ చందర్ రావు టీ. క్రిష్ణ, చింతల.శ్రీకాంత్, చిలువేరు.స్వామి ,తదితరులు పాల్గోన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి

### చింతకుంట విజయరమణా రావు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :**తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని, రైతన్నలకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శనివారం రోజున పెద్దపల్లి నియోజకవర్గంలోని ఓదెల మండలం మడక గ్రామంలో 42 ఆర్ కెనాల్ నుండి పోత్కపల్లి పరిసర ప్రాంతాలకు సాగు నీరందించడానికి వెసులుబాటు కల్పిస్తూ పోత్కపల్లి గ్రామ ఊర చెరువులోకి సాగునీరు వెళ్ళడానికి రైతుల సహకారంతో వారి పొలంలో నుండి కాల్వతీసే పనులు ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు బాగుంటేనే రాజ్యం బాగుంటుందని రైతన్నలకు సాగునీరందించడమే మా లక్ష్యం అని అన్నారు. రైతులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమ

### హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్



**ప్రజాపక్షం / హుజురాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక తీర్పు తెలంగాణ పల్లెల్లో మరోసారి రాబోతుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. శనివారం నాడు హుజురాబాద్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతానికంటే భిన్నంగా ఈ సారి ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమం మొదలు పెట్టామని దాంట్లో భాగంగా 18ఏళ్లు నిండిన ఆడబిడ్డలందరికి ఇందిరాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా ఇందిరా మహిళా శక్తి ద్వారా చీరలు పంపిణీ చేస్తున్నామని, వాటిని తీసుకున్న మహిళలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని ఇలాంటి నాణ్యమైన చీరలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పినట్లుగా బడ్జెట్‌కు అనుగుణంగా నిధులు ఒక్కో రంగానికి కేటాయిస్తున్నామని, దాంట్లో భాగంగానే శుక్రవారం నాడు సన్నవడ్లు పండించిన రైతులకు బోనస్ కోసం 200 కోట్లు నిధులు విడుదల చేశామని అన్నారు. దాంతో పాటు మహాలక్ష్మి పథకంలో భాగంగా గ్యాస్ సిలిండర్ ధరపై సబ్సిడీ కోసం 60 కోట్లు నిధులు మంజూరు చేశామని మొత్తం 480 కోట్ల నిధులు మంజూరు చేశామని అన్నారు.

**ఎమ్మెల్సీగా, విప్‌గా హుజురాబాద్ అభివృద్ధికి ఏం చేశావో చర్చకు సిద్ధమా..?**

కౌశిక్ రెడ్డి మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని నోటికి వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్ పార్టీ నాయకులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కేసిఆర్ ఇంట్లో నుండి, కౌశిక్ రెడ్డి ఇంట్లో నుండి చెక్కులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజెపి నాయకులు బండి సంజయ్, ఈటెల రాజేందర్ ఒకరిపై ఒకరు మాట్లాడుకోవడం కాదని, హుజురాబాద్ అభివృద్ధికి సహకరించాలని ప్రణవ్ కోరారు. గ్రామాలలో ఇప్పటివరకు ఇందిరమ్మ ఇల్లు, సన్న బియ్యం, రేషన్ కార్డులు, గృహాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రుణ మాఫీ, సన్న వడ్లకు బోనస్, 9వేల కోట్ల రైతు భరోసా, ఆరోగ్యశ్రీ 10లక్షలకు పెంపు, అభివృద్ధి పథకాలు ప్రజా ఆశీర్వాదం పొందాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సెంటర్‌ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**ప్రజా పక్షం /రుద్రంగి:** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండలకేంద్రం లో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ సెంటర్ ను ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్ల ద్వారా చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తుందని అన్నారు.అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ద్రుష్టితో విద్య రంగాన్ని అభివృద్ధి చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో,మార్కెట్ కమిటీ ఛైర్మన్ చెలుకల తిరుపతితో మాజీ జడ్పిటిసి గట్ల మినయ్య, మాజీ సర్పంచ్ తర్రె ప్రభలత మనోహర్, మాజీ ఉపసర్పంచ్ బైరి గంగమల్లయ్య, బీసీసెల్ అధ్యక్షుడు గండి నారాయణ, ఎర్రం గంగానర్సయ్య గడ్డం శ్రీనివాస్, పల్లి గంగాధర్, గండి అశోక్, తర్రె లింగం, గుగ్గిళ్ల వెంకటేష్, అక్కినపెల్లి శ్రీనివాస్, కట్కూరి దాసు, దువ్వక గంగాధర్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో వసూళ్లు చేస్తే నిలదీయండి

### జగిత్యాల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** ప్రభుత్వం నిరుపేదల కోసం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారుల నుండి కొందరు అక్రమంగా వసుళ్లకు పాల్పడుతున్నారని అలాంటివారిని లబ్ధిదారులు స్వయంగా నిలదీయాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో 33 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కోటలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రొసీడింగ్ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తనకు రోజు ఫిర్యాదులు వస్తున్నాయని అలాంటి వారిని లబ్ధిదారులు నిలదీసి రోకలిబండతో కొట్టలని కేసులైతే లబ్ధిదారులకు బదులు తానే జైలుకు వెళ్తానని పేర్కొన్నారు. మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్ నరసయ్య, మాజీ వైస్ ఎంపిపి నగేష్, నాయకులు మల్లయ్య ఆదిరెడ్డి దశ రెడ్డి, లింగస్వామి వివిధ గ్రామాల నాయకులు లబ్ధిదారులు ఉన్నారు.

## డిసెంబర్ 1న చలో కలెక్టరేట్

### ఎఐటియుసి జనరల్ సెక్రెటరీ కడారి సునీల్ పిలుపు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లాలో గోదావరిఖని, మంథని, పెద్దపల్లి, సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు శానిటేషన్. సెక్యూరిటీ, ఎక్స్‌రే, డార్క్ రూమ్, పేషంట్ కేర్, తదితర కాంట్రాక్టు కార్మికులు డిసెంబర్ 1న పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు తరలి రావాలని ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ కార్మికులకు పిలుపునిచ్చారు. డిసెంబర్ 2 నుండి 4 తేదీ వరకు ఆసుపత్రుల ముందు నిరసన కార్యక్రమాలు, డిసెంబర్ 5న అన్ని ఆసుపత్రుల్లో మెరుపు సమ్మె చేపట్టడం జరుగుతుందని అన్నారు. గత కొన్ని సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న కనీస వేతనాలు టెండర్ కాలపరిమితి అయిపోయిన ఎక్స్టెన్షన్ టెండర్ కొనసాగింపు విధానం రద్దు ప్రతినెలా ఒకటవ తేదీలో ట్రెజరీల ద్వారా కార్మికుల బ్యాంకు ఖాతాలో 26 వేల వేతనం చెల్లించాలని ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఉద్యోగ భద్రత కల్పించాలని, సంవత్సరానికి 8.33 శాతం బోనస్ చెల్లించాలని, తదితర సమస్యల పరిష్కారం కై డిసెంబర్ 1న పెద్ద పెల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాకు తరలి రావాలని కడారి సునీల్ కాంట్రాక్టు కార్మికులకు విజ్ఞప్తి చేశారు. వివిధ రకాల యూనియన్ జండాలకు అతీతంగా జరిగే ఈ ధర్నాకు ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులు అందరూ పాల్గొని ఐక్యత హక్కులు సాధనకై ముందుకు రావాలనికడారి సునీల్ పిలుపునిచ్చారు.

## మత్స్యకారుల కష్టాన్ని గౌరవించాలి

**ప్రజాపక్షం/కొమురవెల్లి:** మత్స్యకారుల కష్టాన్ని గౌరవించాలని కొమురవెల్లి మం డల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ అన్నారు.శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజా పాలన ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, పేద కుటుంబాల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో చేపల పెంపకం, చేప పిల్లల పంపిణీ కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు.జీవనాధారంగా మత్స్య వృత్తిని ఆశ్రయించి కష్టపడుతున్న గంగపుత్రులు, బెస్తలు, గుండ్లలు, ముదిరాజ్ సమాజాలకు అందరికి పపంచ మత్స్య కార్మిక దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు.ఈ రంగంలో నూతన సాంకేతికత, మౌలిక వసతులు, మార్కెట్ అవకాశాలు కల్పిస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం ముదిరాజ్‌లకు ఒక్కసీటు కూడా ఇవ్వలేదని, ఇప్పుడు ఉన్న కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముదిరాజులకు సీట్లు ఇచ్చి మంత్రులను చేసిందని అన్నారు.

## ప్రతి ఒక్కరూ జీవిత బీమా కలిగి ఉండాలి

**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రతి ఒక్కరూ జీవిత బీమా కలిగి ఉండాలని, అందుకోసం జీవిత బీమా ఏజెంట్లు తమ బాధ్యతగా భావించి వారిపై పాలసీలు చేయించాలని ఎల్ఐసి కరీంనగర్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కే శివ నాగ ప్రసాద్ అన్నారు. ఎల్ఐసి ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని ఎస్ హెచ్ గార్డెన్ లో ధర్మపురి విద్యా సదస్సు క్యాంపెన్ ను శనివారం నిర్వహించారు. ఇటీవల జీ విత బీమా ఏజెంట్లకు ధర్మపురి విద్యాసాగర్ పేరుతో నిర్వహించిన పోటీలో విజయం సాధించిన ఏజెంట్లతో నిర్వహించిన ఇట్టి సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌డిఎం మాట్లాడుతూ చాలామందికి సరిపడా ఇన్సూరెన్స్ లేకపోవడంతో అనుకోని సంఘటనలు జరిగినప్పుడు ఎన్నో కుటుంబాలు ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, అలాంటి పరిస్థితులు జరగకుండా కుటుంబానికి సరిపడా భీమా కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ సోమశేఖర రావు, సేల్స్ మేనేజర్ రాజేష్ ఖన్నా, ప్రొడక్ట్ మేనేజర్ పాండురంగా రావు, జగిత్యాల సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎం.బలరామకృష్ణ, ధర్మపురి, మంతెని శాఖల మేనేజర్లు శుభాకరరావు, ఇందారపు రామ్ కిషన్, జగిత్యాల శాఖ ఏబీఎం శివరాం,తదితరులు పాల్గొన్నారు.


## పిహెచ్‌సి కేంద్రాన్ని తనిఖీ చేసిన డిఎం అండ్ హెచ్‌ఓ



**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్‌లోని బుట్టిరాజారామ్ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.వెంకటరమణ, పివో ఎంహెచ్‌ఎన్ డాక్టర్ జన జవేరియాతో కలిసి తనిఖీ చేశారు. హాజరు రిజిస్టర్, అవుట్ పేషెంట్ రిజిస్టర్‌లను, ఇతర రికార్డులను వెరిఫై చేశారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది ఫెర్ఫార్మెన్స్‌ను ఏఎన్‌ఎం వారీగా అన్ని ఆరోగ్య కార్యక్రమాల అమలు పనితీరును సమీక్షించారు. ఎన్‌సిడి క్లినిక్‌లో అసంక్రమిత వ్యాధుల బ్లూ, రెడ్ రిజిస్టర్‌లను, అందులో నమోదైన అధిక రక్తపోటు, షుగర్ వ్యాధి గ్రస్తుల వివరాల నమోదును పరిశీలించి వారికి మందులు ఇస్తున్న తీరును పరిశీలించారు. ఫార్మసీ స్టోర్స్‌లో సీజనల్ వ్యాధులకు సంబంధించిన మందుల నిల్వలను పరిశీలించారు. పిల్లల వ్యాది నిరోధక టీకాలు నిల్వ ఉంచే ఐఎల్ఆర్‌ను దాని రోజువారీ టెంపరేచర్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. పద్మజ, సూపర్‌వైజర్ విజయలక్ష్మి , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడ

## భారత్‌తో రెండో టెస్టు.. తొలిరోజు సఫారీలదే ఆధిపత్యం..



భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో సఫారీలదే ఆధిపత్యం. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా మంచి స్కోరు దిశగా సాగుతోంది. తొలి ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. ముత్తుస్వామి (25*), కైల్ వెరినె (1*) క్రీజులో ఉన్నారు. దక్షిణాఫ్రికా టాప్4 బ్యాటర్లు ఐడెన్ మార్‌క్రమ్ (38), రికెల్‌టన్ (35), ట్రిస్టన్ స్టబ్స్ (49), తెంబా బావుమా (41) రాణించారు. టోనీ డి జోర్జి (28) పరుగులు చేశాడు. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 3, జస్‌ప్రీత్ బుమ్రా, రవీంద్ర జడేజా, సిరాజ్ ఒక్కో వికెట్ పడగొట్టారు. మ్యాచ్ ప్రారంభంలోనే బుమ్రా బౌలింగ్‌లో (6.2 ఓవర్ వద్ద) మార్‌క్రమ్‌కు లైఫ్‌లైన్ లభించింది. మార్‌క్రమ్ పరుగుల ఖాతా తెరవకముందే అతడు ఇచ్చిన క్యాచ్‌ను స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తున్న కేఎల్ రాహుల్ ఒడిసి పట్టుకోలేకపోయాడు. తర్వాత ఈ జోడీ నిలకడగా ఆడింది. తొలి వికెట్‌కు 82 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. సరిగ్గా టీ బ్రేక్‌కు ముందు బుమ్రా వేసిన అద్భుతమైన యార్కర్‌కు మార్‌క్రమ్ క్లీన్ బౌల్ అయ్యాడు. రెండో సెషన్‌లో మొదలయ్యాక కుల్‌దీప్ వేసిన తొలి ఓవర్‌లోనే రికెల్‌టన్.. వికెట్‌కీపర్ పంత్‌కు క్యాచ్ ఇచ్చాడు. అనంతరం స్టబ్స్, బావుమా నిలకడగా ఆడి రెండో సెషన్‌లో మరో వికెట్ పడకుండా చూసుకున్నారు. దీంతో భోజన విరామ సమయానికి దక్షిణాఫ్రికా 156/2తో నిలిచింది. చివరి సెషన్‌లో సఫారీలు నాలుగు వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేశారు. లంచ్ బ్రేక్ తర్వాత జడేజా బౌలింగ్‌లో తెంబా బావుమా.. జైస్వాల్‌కు క్యాచ్ ఇవ్వడంతో 84 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత స్వల్ప వ్యవధిలో స్టబ్స్, వియాన్ ముల్డర్ (13)ని కుల్‌దీప్ పెవిలియన్‌కు పంపాడు. మరికాసేపట్లో ఆట ముగుస్తుందనగా.. సిరాజ్ బౌలింగ్‌లో జోర్జి.. పంత్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఒక జట్టు ఇన్నింగ్స్‌లో టాప్4 బ్యాటర్లు 35 కంటే ఎక్కువ పరుగులు చేసినా అందులో ఒక్కరూ హాఫ్ సెంచరీ చేయకపోవడం టెస్టు క్రికెట్ చరిత్రలో ఇదే మొదటిసారి.

## 'శత'క్కొట్టిన హెడ్

### రెండ్రోజుల్లోనే ముగిసిన యాషెస్ తొలి టెస్టు

### 8 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా విజయం

ఇంగ్లాండ్‌తో అయిదు టెస్టుల యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టు రెండు రోజుల్లోనే ముగియగా.. ఇంగ్లిష్ జట్టును ఆస్ట్రేలియా చిత్తు చేసింది. ఇంగ్లాండ్ నిర్దేశించిన 205 పరుగుల



లక్ష్యాన్ని కంగారూలు 28.2 ఓవర్లలోనే రెండే వికెట్లు కోల్పోయి ఛేదించారు. ఓపెనర్ ట్రావిస్ హెడ్ (123; 83 బంతుల్లో 16 ఫోర్లు, 4 సిక్సులు) టీ20 మ్యాచ్‌లా చెలరేగి ఆడి ఆసీస్‌కు అద్భుతమైన విజయాన్ని అందించాడు. మార్నస్ లబుషేన్ (51*; 49 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకంతో మెరిశాడు. జేక్ వెదరాల్ (23) పరుగులు చేశాడు. ఆరంభం నుంచే ఇంగ్లాండ్ బౌలర్లపై ఎదురుదాడికి దిగిన హెడ్. ఎడాపెడా బౌండరీలు బాదేశాడు. అతను 36 బంతుల్లో అర్ధ శతకం, 69 బంతుల్లో శతకం పూర్తి చేసుకున్నాడు. బెన్ స్టోక్స్ వేసిన 17 ఓవర్‌లో హ్యాట్రిక్ ఫోర్లతో కలిపి మొత్తం నాలుగు బౌండరీలు రాబట్టాడు. అనంతరం ఆర్చర్ బౌలింగ్‌లో వరుసగా ఫోర్, సిక్స్ బాదాడు. అట్కిన్సన్ వేసిన 20 ఓవర్‌లో రెండు ఫోర్లు కొట్టి 90ల్లోకి వచ్చేసి కాసేపటికే శతకం పూర్తి చేసుకున్నాడు. హెడ్ లబుషేన్ రెండో వికెట్‌కు 92 బంతుల్లో 117 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మ్యాచ్‌లో తొలి రోజే 19 వికెట్లు కూలాయి. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 172 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోర్ 123/9తో రెండో రోజు బ్యాటింగ్ ప్రారంభించిన ఆసీస్ 132 పరుగులకు ఆలౌటైంది. 40 పరుగుల ఆధిక్యం సంపాదించిన ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 164 పరుగులు చేసింది. గస్ అట్కిన్సన్ (37) టాప్ స్కోరర్. బెన్ డకెట్ (28), ఓలీ పోప్ (33)), బ్రైడన్ కార్స్ (20), జేమీ స్మిత్ (15) పరుగులు చేశారు. ఆసీస్ పేసర్లు బోలాఁడ్ (4/33), మిచెల్ స్టార్క్ (3/55), డాగెట్ (3/51) సత్తాచాటారు.

## ఫిబ్రవరి 7 నుంచి టి-20 ప్రపంచకప్..





వచ్చే ఏడాది ఐసిసి టీ20 ప్రపంచకప్ జరగనున్నది. ఈ మెగా టోర్నీ కోసం సన్నహాలు మొదలయ్యాయి. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వబోతున్నాయి. నివేదికల ప్రకారం.. టీ20 ప్రపంచ కప్ ఫిబ్రవరి 7న ప్రారంభం కానుండగా.. మార్చి 8న ఫైనల్ జరుగుతుందని అంచనా. ఫిబ్రవరి 15న కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో చిరకాల ప్రత్యర్థులు భారత్‌పాకిస్తాన్ మధ్య హైవోల్టేజ్ మ్యాచ్ జరుగుతుందని భావిస్తున్నారు. ఫైనల్ అహ్మదాబాద్ లేకపోతే కొలంబోలో జరిగే ఛాన్స్ ఉంది. భారత్ డిఫెండింగ్ ఛాంపియన్‌గా స్వదేశంలో జరిగే ప్రపంచ కప్‌లోకి ప్రవేశిస్తుంది. గత ఏడాది జూన్‌లో బార్బడోస్‌లో జరిగిన చివరి టీ20 ప్రపంచ కప్ టైటిల్‌ను భారత్ గెలిచింది. పాకిస్తాన్ ఫైనల్‌కు చేరుకుంటే టైటిల్ మ్యాచ్ శ్రీలంకలో జరుగుతుంది. ఐసిసి, బిసిసిఐ, పిసిబి మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం.. భారత్‌పాకిస్తాన్ మధ్య జరిగే అన్ని మ్యాచులు 2027 వరకు తటస్థ వేదికల్లో జరుగుతాయి. ఇదిలా ఉండగా.. మెగా టోర్నీ కోసం ఇప్పటికే ఐసీసీ షెడ్యూల్‌ను ఖరారు చేసే పనిలో నిమగ్నమైంది. టోర్నీలో దాదాపు 20 జట్లు పాల్గొనున్నాయి. భారత్, శ్రీలంక ఆతిథ్యం ఇవ్వనున్న 2026 టీ20 ప్రపంచ కప్ కోసం వేదికలను ఐసిసి షార్ట్‌లిస్ట్ చేసింది. ఇందులో భారత్‌లో ఐదు, శ్రీలంకలో మూడు వేదికలు ఉన్నాయి. ఇందులోనే ప్రపంచకప్ మ్యాచులు జరుగుతాయి. బిసిసిఐ అహ్మదాబాద్, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై, ముంబయిలను జాబితాలో చేర్చించింది. శ్రీలంక కొలంబోలోని ఆర్ ప్రేమదాస, సింహాలీస్ స్పోర్ట్స్ క్లబ్ క్రికెట్ గ్రౌండ్ క్యాండీలోని పల్లెకెలె అంతర్జాతీయ క్రికెట్ స్టేడియాల్లో మ్యాచులు నిర్వహించే అవకాశం ఉంది. ఈ వేదికలను ఐసిసి త్వరలోనే అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.









## పతనంతో ముగిసిన షేర్ మార్కెట్లు

ఈ వారం షేర్ మార్కెట్లు కొంత వరకూ మెరుగైన ఫలితాలను చూపినప్పటికీ, లావాదేవీలకు చివరి రోజైన శుక్రవారం (నవంబర్ 21) పతనంతో ముగిశాయి. తేజస్ యుద్ధ విమానం దుబాయ్ ఎయిర్ షో ప్రదర్శనలో కుప్పకూలిన ఘటన భారత షేర్ మార్కెట్లపై ప్రభావం చూపింది. ఈ విమానాన్ని తయారు చేసిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఎఎల్) స్టాక్స్ దాదాపు మూడు శాతం నష్టాన్ని చవిచూశాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ)లో 84,562.78 పాయింట్లతో మొదలైన సెన్సెక్స్ 819.24 పాయింట్లు మెరుగుపడి, 85,382.02 పాయింట్ల వద్ద ముగిసింది. అదే విధంగా జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ)లో నిఫ్టీ 25,910.05 పాయింట్లతో మొదలై, 199.4 పాయింట్ల పెరుగుదలతో, 26,109.45 పాయింట్లకు చేరింది. కాగా, ఈనెల 24వ తేదీ సోమవారం నుంచి ప్రారంభమయ్యే తాజా లావాదేవీలు ఒడిదుడుకుల మధ్య కొనసాగే అవకాశాలు ఉన్నట్టు మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. ప్రత్యేకించి తేజస్ విమాన తయారీదారు హెచ్‌ఎఎల్ ప్రభావం మార్కెట్లపై ఉంటుందని అంచనా వేస్తున్నారు. 2024 మార్చి నెలలో రాజస్థాన్‌లో తేజస్ యుద్ధ విమానం కూలిపోగా, దుబాయ్ సంఘటన రెండోది. మొదటి ఘటన తర్వాత కూడా హెచ్‌ఎఎల్ షేర్లు నష్టాల్లో ట్రేడయ్యాయి. అదే పరిస్థితి ఇప్పుడు కూడా ఉండవచ్చని అంటున్నారు. సంఘటన జరిగిన శుక్రవారం నాటి సెన్సెక్స్ 251 పాయింట్లు కోల్పోవడాన్ని ఉదాహరణగా పేర్కొంటున్నారు. మొత్తం మీద స్టాక్ మార్కెట్‌లో వచ్చేవారం హెచ్‌ఎఎల్ చుట్టూ లావాదేవీలు కేంద్రీకృతమయ్యే అవకాశాలు ఉంటాయన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### అంతర్జాతీయంగా..

ఈ వారం గ్లోబల్ మార్కెట్లు అస్థిరంగా కొనసాగాయి. యుఎస్ ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేటు తగ్గించే అంశంపై నెలకొన్న ఊహాగానాలను స్టాక్ మార్కెట్‌పై ప్రభావాన్ని చూపాయి. కృత్రిమ మేధస్సు (ఎఐ) స్టాక్స్ మీద ఒత్తిడి పెరిగింది. ఈ పరిస్థితి ఎక్కువగా అమెరికాలో కనిపించింది. సుమారు 1.49 శాతం నష్టాన్ని ఐటి మార్కెట్లు ఎదుర్కొన్నాయి. యూరోప్ మార్కెట్లు ఈవారం ఆరంభంలో కొంత పెరుగుదలను నమోదు చేసినప్పటికీ, ఆ తర్వాత అస్థిరత కొనసాగింది. యూరో స్టాక్స్ ఒక రోజు పెరిగితే, మరోరోజు తగ్గడాన్ని గమనించవచ్చు. ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్లపై స్పష్టత రాని కారణంగా బ్యాంక్, ఫైనాన్షియల్ సెక్టర్ సమస్యలు ఎదుర్కొంటున్నాయి. ఈవారం ఆసియా మార్కెట్లు కూడా డౌన్ ట్రెండ్‌లకు గురయ్యాయి. ఉదాహరణకి, నిక్కే (జపాన్) ఈ వారం పతనాన్ని నమోదు చేసింది. చైనాకు చెందిన సిఎస్ఐ300 సూచిక దిగజారింది. స్టాక్ మార్కెట్లు డోలాయమాన పరిస్థితులకు గురవుతున్న నేపథ్యంలో మదుపరులు ఎక్కువగా బంగారం వంటి తక్కువ రిస్క్ ఉన్న మార్గాలవైపు మొగ్గు చూపుతున్నట్టు నిపుణులు పేర్కొంటున్నారు.

### బులియన్ — పసిడి ధరలు పైపైకి..

అంతర్జాతీయ మార్కెట్లో పెరుగుతున్న అనిశ్చితి, ద్రవ్యోల్బణ భయాలు వెంటాడుతున్న నేపథ్యంలో పెట్టుబడిదారుల రక్షణాత్మక కొనుగోళ్ల కారణంగా బంగారం ధరలు పెరుగుతునే ఉన్నాయి. డాలర్ బలహీనత, జియోపొలిటికల్ ఉద్రిక్తతలు, ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్లలో నెలకొంటున్న ఒత్తిడి బంగారాన్ని మళ్లీ 'రక్షణాత్మక పెట్టుబడి కేంద్రం'గా మారింది. దీనికి తోడు పెళ్లిళ్ల సజీన్ కూడా వస్తుండడంతో, దేశీయ బులియన్ మార్కెట్ జోరందుకుంది. మార్కెట్ ధరలకు అదనపు మద్దతు లభించడంతో, బంగారం ధరలు ఒక్కసారిగా నింగిని తాకాయి. సామాన్యులకు చుక్కలు చూపించాయి. శనివారం దేశంలో బంగారం ధరలను పరిశీలిస్తే, 24 క్యారట్ల గ్రాము ధర రూ.186 పెరిగి రూ.12,584 వద్ద ట్రేడ్ అవుతున్నది. ఇక 22 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.170 పెరిగి రూ. 11,535గా ఉంది. అలాగే, 18 క్యారెట్ల గ్రాము బంగారం ధర రూ.139 పెరిగి రూ.9,438కు చేరింది. కాగా, 100 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.18, 600 పెరిగి రూ.12,58,400 వద్ద ట్రేడ్ అవుతుండగా, 22 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ.17,000 పెరిగి రూ. 11,53,500కు చేరింది. 18 క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ 13,900 పెరిగి రూ.9,43,800గా ఉంది. హైదరాబాద్ నగరంలో ధరలను పరిశీలిస్తే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1860 పెరిగి రూ.1,25,840 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1700 పెరిగి రూ.1,15,350 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.1,390 పెరిగి రూ.94,380గా నమోదైంది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితికి, పెళ్లిళ్ల సీజన్ కూడా జతకలవడంతో, బులియన్ మార్కెట్ వచ్చే వారం కూడా ఇదే ఒరవడిని కొనసాగించడం ఖాయంగా కనిపిస్తున్నది.



### వచ్చేవారం..

అంతర్జాతీయ స్టాక్ మార్కెట్లు వచ్చే వారం ఎలా ఉండబోతున్నాయన్న ప్రశ్నకు కనీస అంచనాలు కూడా లేకుండాపోతున్నాయి. అమెరికా ఫెడ్ రిజర్వ్ వడ్డీ రేట్ల అంశం ఎటూ తేలకపోవడంతో, ఆ ప్రభావం స్టాక్ మార్కెట్లపై కనిపిస్తున్నది. అంతర్జాతీయ మార్కెట్ల తీరుతెన్నులు ఫెడ్ రిజర్వ్ నిర్ణయాలపై ఎక్కువగా ఆధారపడతాయన్నది వాస్తవం. అమెరికా నిర్ణయం ఎంత త్వరగా వెలువడితే, మార్కెట్ రిస్క్‌ను అంత త్వరగా తగ్గించవచ్చని నిపుణులు అంటున్నారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఫెడ్ రిజర్వ్ నిర్ణయంపై అంచనాలు కూడా వేయలేకపోతున్నారు. ఆసియా మార్కెట్ల పరిస్థితి కూడా ఇందుకు భిన్నమేమీ కాదు. అయితే, ఎఐ, టెక్ రంగాలు తీవ్ర ప్రభావానికి లోనయ్యే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

## నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటాలు

### ఎఐటియుసి నిరసనలు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** నాలుగు లేబర్ కోడ్ల అమలును ఉపసంహరించుకోవాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య డిమాండ్ చేశారు. శనివారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చి కార్మికులకు మరణ శాసనం విధించటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్మికులకు ఎలాంటి రక్షణ లేకుండా పని భద్రత లేకుండా గుర్తింపు లేకుండా ఉన్న సందర్భంలో చట్టాన్ని తొలగించి లేబర్ కోడ్ల ద్వారా 12 గంటలు పని చేయాలని చెప్పటం సిగ్గు చేటన్నారు. మహిళా కార్మికులు మూడు పూటలు పని చేయాలని చెప్పడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా రాబోచే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాట కార్యక్రమాలకు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చక్రపాణి, నాయకులు హైమది బేగం, హన్మాండ్లు, అనిల్, కవిత, స్వరూప, రాధాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**మేడ్చల్ మల్కాజిగిరి :** కేంద్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు కె.రవిచంద్రన్ డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర సమితి పిలుపు మేరకు శనివారం ఆల్వాల్ జిహెచ్‌ఎంసి సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులు హరించే కుట్ర చేస్తుందని విమర్శించారు. తమ హక్కులు హరించే నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మికలోకం పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపు నిచ్చారు. ఔట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ప్రమాదాల్లో మృతిచెందిన కార్మికులకు రూ. 25 లక్షలు నష్టపరిహారంగా ఇవ్వటంతో పాటు అంత్యక్రియల నిమిత్తం రూ.30 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులకు డబుల్ బెడ్‌రూంలు ఇవ్వాలని, పదవీ విరమణ చేసిన వారికి రూ.10 లక్షలు రిటైర్‌మెంట్ బెనిఫిట్‌గా చెల్లించాలని ఈ సందర్భంగా కె.రవిచంద్రన్ డిమాండ్ చేశారు. అనంతరం జిహెచ్‌ఎంసి అసిస్టెంట్ కమిషనర్ హేమలతకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్ :** కార్మిక హక్కులను కాలరాస్తు 29 కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం అమలు చేసే నాలుగు లేబర్ కోడ్‌ల అమలును తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లు తక్షణమే రద్దు చేయాలని, రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట హైదరాబాద్ రాయచూరు రోడ్డుపై నిరసన చేపట్టి లేబర్ కోడ్‌ల పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నామరూపం లేకుండా చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. నాలుగు లేబర్ కోడ్‌లలో కార్మిక వ్యతిరేక అనేక అంశాలు పొందుపరిచారని, పైకి మాత్రం కార్మికుల సంక్షేమ అంటూ విషప్రచారం సాగిస్తున్నారన్నారు. లేబర్ కోడ్‌లు అమలును తక్షణమే నిలిపివేయకపోతే ఐక్య పోరాటాలకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు గోపాల్ నాయక్, మొగులయ్య, దేవానంద్, జే.నరసింహ, అంజి, జగ్గా నాయక్, నరసింహులు, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ, టంకర వెంకటయ్య, కొండయ్య, సత్తయ్య, యాదగిరి, వసంత, నాగమ్మ, సత్త్యమ్మ, పద్మ, దేవి, అంజమ్మ, వరలక్ష్మి, తిరుపతమ్మ, కవిత, మంజుల, నాగలక్ష్మి, సవిత, జ్యోతి, మమత, నిర్మల, నర్సమ్మ, విజయ నిర్మల, చిట్టెమ్మ, తదితరులు పాల్గొన్నారు.







## ఆపరేషన్ కగార్ ఆపాలి





### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా

**ప్రజాపక్షం/వరంగల్ :** ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని, బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరపాలని, అక్రమంగా అరెస్టు చేసిన మావోయిస్టులను విడుదల చేయాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా డిమాండ్ చేశారు. వరంగల్ పట్టణంలోని శివనగర్ తమ్మెర భవన్ లో సిపిఐ వరంగల్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం గుండె బద్రి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా షేక్ బాష్ మియా పాల్గొని మాట్లాడుతూ ఆపరేషన్ కగారు పేరుతో, అడవిలోని ఆదివాసులను, అటవీ సంపదలను, జంతు వైవిధ్యాన్ని కాపాడుతూ వస్తున్న మావోయిస్టులను ఊచకోత కోయడమే ధ్యేయంగా కేంద్రప్రభుత్వం, అమిత్ షా, మోడీ వ్యవహరిస్తున్నారు. ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ రాజ్యాంగ విరుద్ధంగా హత్యలు గావిస్తూ ప్రజలను, మావోయిస్టులను పట్టుకొని చిత్రహింసలకు గురిచేసి ప్రభుత్వమే ఎన్‌కౌంటర్ల పేరుతో హత్యలు చేస్తుందన్నారు. బిజెపి ప్రభుత్వాన్ని ఎండగట్టకపోతే ప్రజలు దారుణమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అడవిలోని ఆదివాసి ప్రజలను అక్కడి నుంచి ఖాళీ చేయించి ఆ భూమిని అంబానికి, ఆదానికి కట్టబెట్టడానికి బిజెపి ప్రభుత్వం సుదీర్ఘకాలంగా ప్రయత్నం చేస్తూఉందని విమర్శించారు. ఇందులో భాగంగా ఎంతోమంది మావోయిస్టులను, ఆదివాసి ప్రజలను చివరికి ఆరు నెలల పసిపాపను కూడా వదిలిపెట్టకుండా హత్యలు చేస్తుందన్నారు. ఈ హత్యాకాండను బిజెపి ప్రజా వ్యతిరేక తీరును ప్రశ్నించిన ప్రతి ఒక్క గొంతుకను అరెస్టు చేసి జైల్లో బంధించడం జరిగిందన్నారు. మావోయిస్టు అగ్రనేతలు ఎంతోమందిని పట్టుకొని చిత్రహింసలు పెట్టి వారిని కాల్చి హత్య చేసి చంపి దాని ఎన్‌కౌంటర్‌గా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని అడ్డుకోవాలన్నారు. దేశంలో మావోయిస్టులను లేకుండా అంతం చేస్తామని పార్లమెంట్ సాక్షిగా అమిత్‌షా శపదం చేసి అదే పనిగా మావోయిస్టులను హత్య చేస్తున్నారన్నారు. కానీ ఈ దేశంలో ఉన్న పేదరికాన్ని ఈ దేశంలో ఉన్న ఆకలి చావులను నిరుద్యోగతను, అసమానతలను, అరాచకాలను, మహిళల పట్ల జరుగుతున్న దాడులను, హత్యలను, మానభంగాలను తగ్గిస్తామని దానికి సంబంధించిన ఎటువంటి శపదం చేయకుండా ఉండడం సిగ్గుచేటన్నారు. బిజెపి ప్రభుత్వాన్ని ఎండగట్టకపోతే దేశంలో ప్రజలు దారుణమైన పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సమావేశంలో సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఓర్సు రాజు, పరికరాల రమేష్, ఎండి అక్బర్ పాషా, జన్ను రవి, తాళ్ల పెల్లి జాన్ పాల్, సుంకరి భవాని, చిట్యాల, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : ఎఐఎస్ఎఫ్



**ప్రజాపక్షం/ములుగు :** విద్యారంగ సమస్యలను వెంటనే రాష్ట్రప్రభుత్వం పరిష్కరించి, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ములుగు జిల్లా కేంద్రంలోని ఎస్‌టియు భవన్‌లో ఎఐఎస్ఎఫ్ జిల్లా సమితి సమావేశం శనివారం జరిగింది. సమావేశానికి ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపైన పోరాటాలను ఉధృతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకొని, విద్యారంగానికి 15 శాతం నిధులు విడుదల చేయాలని కోరారు. విద్యార్థులు పడుతున్న ఇబ్బందుల పరిష్కారానికి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ములుగు జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. గిరిజన యూనివర్సిటీకి అధిక నిధులు కేటాయించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, కామన్ విద్యా విధానాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. ఎఐఎస్ఎఫ్ ములుగు జిల్లా మహాసభలు డిసెంబర్ 22, 23న నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్, పగిడి అన్వేష్, కొండగొర్ల సాయి కుమార్, రణదీప్, చెన్నూరు రామ్ చరణ్, దుర్గం శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐలోకి ప్రముఖ వైద్యుడు కిరణ్‌కుమార్

### ఆహ్వానించిన కూనంనేని




**ప్రజాపక్షం/ఖమ్మం :** దుర్గ విరించి హాస్పటల్ అధినేత, ప్రముఖ గుండె, షుగర్ వైద్యనిపుణులు కిరణ్‌కుమార్ గుదిగొండ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కూనంనేని సాంబశివరావు సమక్షంలో సిపిఐలో చేరారు. జాతీయసమితి సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ కంట్రోల్ కమీషన్ చైర్మన్ మహమ్మద్ మౌలానా, దండి సురేష్, జమ్ముల జితేందర్‌రెడ్డి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఖమ్మం రూరల్ మండలంలోని ఎం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన గుదిగొండ రామలింగం ద్వితీయ కుమారుడు కిరణ్‌కుమార్. రామలింగం సిపిఐ నాయకుడిగా పార్టీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారు. తన తండ్రి ఆశయాలను అనుగుణంగా సిపిఐలో చేరడం ఆనందంగా ఉందని కిరణ్‌కుమార్ తెలిపారు. కిరణ్‌కుమార్‌తో పాటు సిపిఐలోకి చేరిన వారిలో బెతంపూడి ఉపేందర్, ఆదెర్ల ప్రవీణ్, గుదిగొండ లోకేష్, యలగాడి వరలక్ష్మి, తుమ్మల రఘు తదితరులున్నారు. కార్యక్రమంలో ఎండి సలాం, బిజి క్లెమెంట్, మేకల శ్రీనివాసరావు, సాంబశివ రెడ్డి, తోట రామాంజనేయులు, పగడాల మల్లేష్, షేక్ సైదా, ఆకెన పవన్ తదతరులున్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## సీతారత్నం ట్రస్టు చేయూత అభినందనీయం

విద్యార్థులకు చెక్కులు అందించిన కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** విద్యారంగ పురోభివృద్ధికి ఆర్థికంగా వెనకబడిన విద్యార్థులకు పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు అభినందనీయం, అనుసరణీయమని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. శనివారం ఖమ్మంలో కొణిజర్ల గ్రామానికి చెందిన బీఫార్మసీ విద్యార్థిని పి. ఉషారాణికి రూ. 20వేల చెక్కును చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చె ందిన బిఫార్మసీ విద్యార్థిని శ్రీ రాం మానసకు రూ. 20 వేల చెక్కును అందజేశారు. ఆ ఇబ్బందులు పడుతున్న వారికి పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు అనేక ఏళ్లుగా ఆర్థిక చేయూతనిస్తూ ఉన్నత స్థానాలకు ఎదిగేందుకు తోడుగా నిలుస్తుందన్నారు.

## సోబ్బని వెంకటేశ్వర్లు మృతి బాధాకరం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలం కాకర్ల గ్రామ నివాసి సీనియర్ సిపిఐ నాయకులు సోబ్బని సూర్యం కుమారుడు సోబ్బని వెంకటేశ్వర్లు బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి బారినపడి అకాల మరణం చెందారు. వారి మృతదేహానికి శనివారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పూలమాలవేసి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు తండ్రి సోబ్బని సూర్యం సిపిఐ పార్టీ లో చాలా కాలం నుండి పనిచేస్తున్నారని ఇలాంటి నిబద్ధతగల నాయకుడి కుమారుడి మరణం చాలా బాధాకరమని ఆయన అన్నారు. వెంకటేశ్వర్లు కుటుంబానికి సిపిఐ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని వెంకటేశ్వర్లు భార్య, పిల్లలను, తల్లిదండ్రులను ధై ర్యంగా ఉండాలని, అధైర్య పడద్దని కూనంనేని ధైర్యాన్ని ఇచ్చారు. వారి వెంట సిపిఐ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు, మండల సహాయ కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, ఎల్లంకి మధు, సిరిపురం వెంకటేశ్వర్లు, గుడిమెట్ల సీతయ్య, చిమట ముత్తయ్య, బెజవాడ సీతయ్య, తదితరులు నివాళులు అర్పించారు.

## గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/ మధిర :** నిషేధిక గంజాయిని తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు మధిర రూరల్ సిఐ మధు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది దాడి చేసి పట్టుకున్న సంఘటన జరిగింది. శనివారం మధిర రూరల్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సిఐ మాట్లాడుతూ కలకోట గ్రామానికి చెందిన యంగల కార్తీక్, తోటపల్లి రాహుల్, తోటపల్లి చరణ్శేఖర్ అనే యువకులు టిఎస్ 07హెచ్ 0914 నెంబర్ గల స్కూటీపై కలకోట వైపు నుండి సిరిపురం వైపుకు వెళ్తుండగా మల్లారం క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీల్లో 1.085కేజిల నిషేధిత గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఒడిశా, చింతూరు ప్రాంతాల నుంచి గంజాయి కొనుగోలు చేసినట్లు, గంజాయి సేవించి మిగతా భాగం అమ్మి డబ్బు సం పాదిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. గంజాయి తరలిస్తున్న స్కూటీని, సెల్ ఫోన్లు, నిందిదులను అదుపులోకి తీసుకుని ఎన్డిపిఎస్ చట్టం కింద కేసులు నమోదు చేసి కోర్టుకు రిమాండ్ చేయనున్నట్లు సిఐ తెలిపారు.

## ఐఎఎల్ 'మాక్ టెస్ట్' అభినందనీయం

సీనియర్ న్యాయవాది సోమశే ఖర శర్మ



**ప్రజాపక్షం/ఖమ్మం :** నూతన న్యాయవాదులకు ఉపయోగపడేలా ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) మాక్ టెస్ట్లను నిర్వహించడం శుభ పరిణామమని సీనియర్ న్యాయవాది సోమశేఖర శర్మ తెలిపారు. శనివారం మానేరు లా కళాశాలలో ఐఏఎల్ ఖమ్మం జిల్లా, నగర సమితి ఆధ్వర్యంలో మాక్ టెస్ట్ను నిర్వహించారు. ఖమ్మం అంటేనే సామాజిక స్పృహ కలిగిన ప్రాంతమని ఈ ప్రాంతంలో ప్రారంభమైన ప్రతి కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తమవుతుందని మాక్ టెస్ట్ కూడా అన్ని జిల్లాల్లో జరిగేలా ప్రో త్సహించాలని ఆయన కోరారు. నూతనంగా న్యాయవాద వృత్తిలోకి వచ్చేవారు సామాజిక అంశాలపై, రుగ్మతల పై, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ టెస్ట్కు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 300 మంది అభ్యర్థులు హాజరై పరీక్షలు వ్రాశారు. ఐఏఎ ల్ జిల్లా గౌరవాధ్యక్షులు పారుపల్లి అమర్చంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఒరుగంటి శేషగిరిరావు, మానేరు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ శర్మ, న్యా యవాదులు మామిడి హన్మంతరావు, ఐలు నాయకులు వెంకటేశ్వర్లు, ఎస్ వి రమణ, షేక్ నస్రీన్, శరత్బాబు, ఫర్వేజ్, లక్ష్మి పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి స్థలం అప్పగింత

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్మించనున్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని రెవెన్యూ అధికారులు దేవాదాయ శాఖకు శనివారం అప్పగించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా చొరవ తీసుకుని టిటిడి ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి 20 ఎకరాల భూమిని ఖమ్మం నగరంలోని 15వ డివిజన్ కొత్తగూడెం అల్లిపురం ప్రాంతంలో గుర్తించారు. దానికి సంబంధించి 17.24 ఎకరాల ప్రభుత్వ భూమిని తొలుత దేవాదాయ శాఖకు అప్పగించేందుకు ఉత్తర్వులు జారీ చేశారు. మిగిలిన అసైన్డ్ భూమిని కూడా స్వాధీనం చేసుకుని దేవాదాయ శాఖకు అప్పగించనున్నారు. రఘునాథపాలెంలో సర్వే నెం. 30లో 4.20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇస్కాన్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణానికి కేటాయించారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. ఈ రెండు ఆలయ నిర్మాణాలు పూర్తయితే ఖమ్మంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది.

## ఐజెయు ఆధ్వర్యంలో అన్నం శ్రీనివాసరావుకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/ఖమ్మం :** వివిధ రంగాలలో వి శిష్ట సేవలు అందిస్తు న్న అన్నం శ్రీనివాసరావును టియుడబ్ల్యూ జె (ఐజెయు) శనివారం ఘనంగా సన్మానించింది. రెండు దశాబ్దాలుగా అన్నం సేవల ద్వారా వేల కుటుంబాలు ఓదార్పు పొందాయన్నారు. 30వేలకు పైగా అనాథ శవాలకు అంత్యక్రియలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జాతీయ కౌన్సిల్ సభ్యులు నలజాల వెంకట్రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేణుగోపాల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు, ఎలక్ట్రానిక్ మీడియా బాధ్యులు, నగర కమిటీ బాధ్యులు, టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా కార్యవర్గ సభ్యులు, ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.

# పేద ప్రజల గుండెచప్పుడు సిపిఐ

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** పేద ప్రజల గుండె చప్పుడు సిపిఐ అని, భారత గడ్డపై సిపిఐ 100 ఏళ్ళు పూర్తి చేసుకున్న చరిత్ర ఒక సిపిఐ పార్టీకే సాధ్యమైన విషయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్రెడ్డి, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్కే సాబీర్ పాషాలు అన్నారు. భారత కమ్యూనిస్టు శతజయంతి ఉత్సవాలలో భాగంగా నవంబర్ 15 నుండి 25 వరకు తలపెట్టిన ప్రచారంలో భాగంగా శనివారం బూర్గంపాడు మండలంలోని మోరంపల్లిబంజర్కు చేరుకున్న బస్సు ప్రచార జాతకు సిపిఐ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. మోరంపల్లిబంజర్లో పార్టీ జెండాను సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం బస్సు ప్రచార జాతతో పాటు నాయకులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీగా సారపాక సెంటర్కు చేరుకున్నారు. సారపాక సెంటర్లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మువ్వ వెంకటేశ్వరరావు అధ్యక్షతన బస్సు ప్రచార జాతలో భాగంగా సభ నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్కే సాబీర్ పాషాలు మాట్లాడుతూ భారతదేశ ప్రజలకు స్వతంత్రం కోసం అనంతరం తెలంగాణ సాయుధ పోరాట వెట్టి చాకిరీ విముక్తి కోసం బానిసత్వం నుండి భూస్వాములు రజాకర్ల నుండి ప్రజలను విముక్తి కల్పించి, పేద ప్రజలకు లక్షలాది ఎకరాల భూములను పంచిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని నిరంతరం ప్రజా పోరాటాల్లో నిమగ్నమైన భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ ప్రచార జాతర నిర్వహించడం జరుగుతుందన్నారు. ఖమ్మంలో డిసెంబర్ 26న 5లక్షల మందితో ముగింపు ఉత్సవాలలో పార్టీ శ్రేణులు శ్రేయోభిలాషులు అభిమానులు మేధావులు అన్ని వర్గాల ప్రజలు పాల్గొని ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మువ్వా వెంకటేశ్వరరావు(లడ్డా) మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో మారుతున్న రాజకీయాల నేపథ్యంలో ఐదేళ్లు అధికారంలో లేకుంటే కానరకుండా పోయే పార్టీలు ప్రజల అధికారంలో ఉన్నప్పుడు కనీసం ప్రజలు అవసరాలను కూడా తీర్చలేని పార్టీల కన్నా ఈ రోజు వంట గ్యాస్ ధర పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలు పెరిగిన నిత్యవసరల ధరలు పెరిగిన ఎల్లప్పుడు కార్మిక వర్గానికి వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసేది ఒక కమ్యూనిస్టు పార్టీ మాత్రమేనని గుర్తు చేశారు. మనకు అధికారం ఉన్న లేకున్నా ఈ దేశంలో ప్రజా సమస్యలపై కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ ప్రజాక్షేత్రంలో ఈ భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీని అన్నారు. అనంతరం బైక్ ర్యాలీగా భద్రాచలం చేరుకున్నారు. ఎంఎల్సి నెల్లికంటి సత్యం, మహబూబాబాద్ పార్టీ జిల్లా కార్యదర్శి బి విజయసారిరెడ్డి, డిహెచ్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరపాక అనిల్ కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కాశిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మీ నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యా విశ్వనాథం, సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మున్నా లక్ష్మీ కుమారి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పేరాల శ్రీనివాస రావు, కమటం వెంకటేశ్వరరావు, వి మల్లికార్జున్, సిపిఐ మండల కార్యదర్శి సప్పం నాగేశ్వర రావు, అశ్వాపురం సిపిఐ మండల కార్యదర్శి అనంతనేని సురేష్, నాయకులు అలవాల సీతారామిరెడ్డి, బర్ల వెంకటేశ్వర్లు, సిద్ధారపు సుబ్బారెడ్డి, ఎండి సాజిద్, పాండవుల బిక్షం, తోకల శ్రీను, మల్సూర్, సారెడ్డి గోవింద్, రాంబాబు, పేరం వెంకటేశ్వరరెడ్డి, వంకాయలపాటి నాగేశ్వర రావు, సోడే చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల డిమాండ్ సహేతుకం,సమర్థనీయం

సిఎం దృష్టికి సమస్య : ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఏళ్ల పాటు వివిధ హోదాలలో సేవలు అందించి ఉద్యోగ విరమణ చేసిన వారి బకాయిలను చెల్లించకపోవడం శోచనీయమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో శనివారం కూనంనేనికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు.20 మాసాలుగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించకపోవడంతో పెన్షనరల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అనేక మంది తన దృష్టికి తీసుకు వచ్చారని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ పరంగా కోట్లాది రూపాయలను వివిధ రంగాలకు ఖర్చు చేస్తున్నారని ఒకేసారి కాకపోయినా విడతల వారీగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నిధులను పెన్షనర్లకు అందకపోవడంలో లోపం ఎక్కడ ఉందో తెలుసుకోవాలని ఆయన అధికార యంత్రాంగాన్ని కోరారు. అనేక మంది భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉం చుకుని వేతనం నుండి పొదుపు చేసుకున్నారని వాటిని కూడా చెల్లించకపోవడంతో వారి ప్రణాళికలన్ని తారుమారై ఆర్థికంగా, ఆరోగ్యంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవికుమార్, రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం, సంఘం బాధ్యులు గుర్రాల శ్రీనివాసరావు, పెదమాళ్ల సత్యనారాయణ, మల్లికార్జునరావు, సుధాకర్, అన్న మ్మ, ఉమాదేవి, నాగలక్ష్మి, గడల భాస్కర్రావు, రహీముద్దీన్, లింగయ్య, మురళీకృష్ణ, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

బిటి రోడ్డుకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఇంటిని శుభ్రంగా ఉంచుకున్నట్లే గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే ప్రజారోగ్యం బాగుంటుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. శనివారం మండల పరిధిలోని శివాయిగూడెం గ్రామంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. శివాయిగూడెం నుంచి మంచుకొండ వరకు రూ. 3.70 కోట్లతో నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం తరుపున పుట్టింటి సారె మాదిరి ఇందిరమ్మ చీరలను మహిళలకు పంపిణీ చేస్తున్నామన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఇంటిని శుభ్రంగా ఉంచుకున్నట్లే గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రైతులు పామాయిల్ సాగుపై దృష్టిసారించాలని తెలిపారు. పామాయిల్ సాగు చేసే రైతులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. పామాయిల్ సాగు వల్ల రైతులకు కోతుల బెడద, చీడపీడల బెడద కూడా ఉందన్నారు. ప్రభుత్వం సబ్సిడీ కూడా అందిస్తుందని తెలిపారు. పామాయిల్ సాగులో అంతర పంటలను కూడా సాగు చేయవచ్చునని తెలిపారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పండుగలా గ్రామాల్లో చీరల పంపిణీ చేపట్టాలని తెలిపారు. ఆర్డీవో జి. నర్సింహారావు, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, నాయకులు వాంకుడోత్ దీప్లానాయక్, భూక్యా బాలాజీ నాయక్, బండి వెంకన్న, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా గురుకులం విద్య'

మహిళలు ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పటిష్ఠ కార్యాచరణ

ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క





**ప్రజాపక్షం/వైరా:** అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా గురుకులాలను నిర్మిస్తున్నారని రాష్ట్ర డిప్యూటీ సిఎం, ఆర్థిక, ప్రణాళిక, ఇందన శాఖామాత్యులు, మల్లు భట్టివిక్రమార్క అన్నారు. రాష్ట్ర డిప్యూటీ సిఎం, ఆర్థిక ఇంధన శాఖల మంతివర్యులు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, టిజి ఎన్పిడిసిఎల్ ఎ ండి కర్నాటి వరుణ్రెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్నాయక్లతో కలిసి వైరాలో సుమారు 20 ఎకరాల స్థలంలో చేపట్టిన యంగ్ ఇం డియా ఇంటిగ్రేటెడ్ విద్యాసంస్థల నిర్మాణ పనులకు, వైరా నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో రూ.18.46కోట్లతో చేపట్టిన ఏడు 33/11 కెవి విద్యుత్ సబ్స్టేషన్ నిర్మాణ పనులకు రూ. 58.50కోట్లతో చేపట్టిన రోడ్డు అభివృద్ధి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత వైరాకు వచ్చిన మల్లు భట్టివిక్రమార్కకు కాంగ్రెస్ శ్రేణులు కాంగ్రేస్ పార్టీ కార్యాలయం వద్ద నుంచి ఘనస్వాగతం పలికి భారీ ర్యాలీ నిర్వహించుకుంటూ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల వరకు చే రుకున్నారు. సుమారు రూ.400కోట్లకు పనులకు భట్టి విక్రమార్క శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడుతూ గేమ్ చేంజర్గా యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం నిలుస్తుందని అన్నారు. ప్రతి యంగ్ ఇండియా స్కూల్కు 20 ఎకరాల ప్రాంగణంలో రూ.200కోట్లు ఖర్చు చేసి సకల సదుపాయాలతో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన ఉండేలా, విద్యాబోధన చేసే స్టాఫ్, ఇతర సిబ్బంది క్వార్టర్స్ సైతం అక్కడే నిర్మిస్తున్నామని అన్నారు. యంగ్ ఇండియా గురుకులాల నిర్మాణానికి సంబంధించి రూ.30కోట్ల నిధులను కలెక్టర్ ఖాతాకు ఇప్పటికే విడుదల చేశామని, పనుల వేగం ఆధారంగా ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షించుకొని బిల్లులు వి డుదల చేయడం జరుగుతుందని అన్నారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్నాయక్ మాట్లాడు తూ వైరా అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం గడిచిన రెండ సంవత్సరాల కాలంలో రూ.500కోట్లు మంజూరు చేసిందని అన్నారు. మరమ్మత్తు కోసం నిధులు మంజూరు చేశారని, రూ.200కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులం నిర్మిస్తున్నామని అన్నారు. జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, సిపి సునీల్దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, హస్తకళల కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, వైరా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, డిసిసి డైరెక్టర్ బొర్రా రాజశేఖర్, డిఆర్డివో సన్యాసయ్య, ఆర్అండ్బి ఎస్ఈ యాకోబ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు, డిసిహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, డిఈవో చైతన్యజైని, డిఐఈవో రవిబాబు, మాజీ మున్సిపాల్ చైర్మన్ సూతకాని జైపాల్, మున్సిపాల్ మాజీ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, మండల కాం గ్రెస్ అధ్యక్షుడు వెంకటనర్సిరెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, మహిళా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, డాక్టర్ కాపా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


# రిజర్వేషన్లపై అధికారుల కసరత్తు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** స్థానిక ఎన్నికలకు సంబంధించి రిజర్వేషన్ల కేటాయింపుపై అధికారులు కసరత్తు చేపట్టారు. రిజర్వేషన్లకు సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేయడంతో సర్పంచ్, వార్డు సభ్యులకు సంబంధించి రిజర్వేషన్ల కేటాయింపుపై శనివారం అధికారులు చర్యలు చేపట్టారు. సర్పంచ్ స్థానాలకు సంబంధించి ఆర్డీవో పరిధిలో జిల్లా యూనిట్గా రిజర్వేషన్లు కేటాయింపు చేయనుండగా వార్డు సభ్యులకు సంబంధించి మండల స్థాయిలో రిజర్వేషన్లు కేటాయించనున్నారు. రఘునాథపాలెం మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలకు సంబంధించి 308 వార్డులు ఉన్నాయి. వార్డుల్లో 50 శాతం జనరల్ కేటగిరికి కేటాయించగా మిగిలిన 50 శాతానికి సంబంధించి ఎస్సి, ఎస్టి, బిసిలకు సంబంధించి 2018 గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కేటాయించేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. మండల పరిధిలోని మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో కొర్లబోడు తండా, లచ్చిరాంతండా గ్రామ పంచాయతీలు పూర్తి ఎస్టి జనాభా కలిగి ఉన్నాయి. ఎస్టిలకు 116, ఎస్సిలకు 24, బిసిలకు 20 వార్డులు రిజర్వేషన్లు కేటాయించినట్లు సమాచారం. అదేవిధంగా జిల్లా యూనిట్గా సర్పంచ్ ఎన్నికలకు రిజర్వేషన్లు కేటాయించడంతో రఘునాథపాలెం మండలంలో బిసిలకు ఒక సర్పంచ్ స్థానం కూడా కేటాయింపు లేనట్లు సమాచారం. 2018లో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గతంలో రిజర్వేషన్లు అయిన వాటికి రోటేషన్ పద్ధతిలో ఇప్పుడు కేటాయింపులు జరపనున్నారు. త్వరలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఆశావాహుల సందడి నెలకొంది. పలువురు సర్పంచ్ స్థానాలకు పోటీ చేసేందుకు వివిధ పార్టీల నుంచి ఆసక్తి కనబరుస్తున్నారు.

## సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యం

టియుడబ్ల్యూజె (ఐజెయు) సమావేశంలో కె. రాంనారాయణ




**ప్రజాపక్షం/ఖమ్మం :** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయ ణ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల పట్ల అవలంభిస్తున్న నిర్లక్ష్య ధోరణికి వ్యతిరేకంగా త్వరలో ఆందోళన, కార్యాచరణ ప్రకటించనున్నట్లు ఆయన తెలిపారు. టియుడబ్ల్యూజె (ఐజెయు) జిల్లా కమిటీ సమావేశం స్థానిక డిపిఆర్సిలో జిల్లా అధ్యక్షులు ఏనుగు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాంనారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులకు సంబంధించి అక్రిడేషన్లు, హెల్త్ కార్డులు, ఇండ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం స్పందించడం లేదని జర్నలిస్టు సమాజం పోరు మార్గంలో పయనిస్తేనే ప్రభుత్వంలో కదలిక వస్తుందన్నారు. సంక్షేమానికి, హక్కుల సాధనకు కృషి చేయాలని ఆయన కోరా రు. జిల్లా కార్యదర్శి మైసా పాపారావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. త్వరలో సెమినార్ నిర్వహించాలని సమావేశం ఏకగ్రీవంగా నిర్ణయించింది. మురళికృష్ణ, పి. నాగేశ్వర రావు, యోగి, శ్రీనివాస్, సురేష్, బాలరాజు, పప్పుల శ్రీనివాస్, శీ లం శ్రీను సభ్యులుగా దాడుల నివారణ కమిటీని ఏర్పాటు చేయగా దానికి కన్వీనర్గా తాళ్లూరి మురళికృష్ణను సమావేశం ఎన్నుకుంది. వై. మాధవరావు, సభ్యులుగా కనకం సైదులు, సిహెచ్ శ్రీనివాస్, ఎన్. ఉపేందర్, గోపాల్, బాబురావు, అరు ణ్, నాగరాజు లు సభ్యులుగా కమిటీ ఏర్పాటైంది. ఎడ్యుకేషన్ సబ్ కమిటీ కన్వీనర్గా మాటేటి వేణుగోపాల్, సభ్యులుగా ఎం. భూపాలరావు, ఏనుగు వెంకటేశ్వరరావు, మహేందర్, ఎస్కె మోహినుద్దీన్, ఏలూరి వేణుగోపాల్, సత్యనారాయణ సభ్యులుగా ఉన్నారు.

## సిపిని మర్యదపూర్వాకంగా కలిసిన ఎసిపి వసుంధర యాదవ్

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** కల్లూరు నూతన ఏసిపిగా సత్తుపల్లిలో బాధ్యతలు చేపట్టిన వసుంధర యాదవ్ అనంతరం ఖమ్మం సిపి కార్యాలయంలో పోలీసు కమిషనర్ సునిల్దత్ను మర్యాదపుర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సిపి ఆమెకు పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు అంకితబావంతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలన్నారు.



# ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

మోడిఫైడ్ సైలెన్సర్కు వెయ్యి రూపాయల జరిమానా



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** ద్విచక్రవాహనాలపై వేగంగా నడుపుతూ సెలెన్సర్లతో పెద్దపెద్ద శబ్దాలు చేస్తూ, ఫిట్లు ప్రదర్శిస్తున్న ఆకతాయిలకు చెక్ పెట్టెందుకు ట్రాఫిక్ పోలీసులు శనివారం నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు నేతృత్వంలో రిజర్వు ఇన్స్పెక్టర్ అప్పలనాయుడు, ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ, ఎస్సైలు సిబ్బందితో నగరంలోని ప్రధాన కూడళ్లలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రత్యేకంగా ద్విచక్రవాహనాలపై దృష్టిసారించి వారిని ఎక్కడికక్కడి నిలిపి వాహనాలకు సంభందించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్లు తనిఖీ చేశారు. కంపెనీ సైలెన్సర్లకు బదులు మోడిఫైడ్ సైలెన్సర్లు అమర్చి తిరుగుతుండటంతో వాటిని తొలగించి వారికి జరిమానాలు విధించారు. పిల్లలను భయభ్రాంతులకు గురిచేస్తుండటంతో వారిపై చర్యలు తీసుకునేందుకు నిత్యం తనిఖీలు చేపట్టనున్నట్లు ఏసిపి శ్రీనివాసులు తెలిపారు. శనివారం చేపట్టిన తనిఖీల్లో 20 వాహనాలకు అమర్చిన మోడిఫైడ్ సైలెన్సర్లు తొలగించి ఒక్కొక్కరికి రూ.1000/ జరిమానా విధించినట్లు తెలిపారు. ఇప్పటి వరకూ సుమారు వెయ్యి మోడిఫైడ్ సైలెన్సర్లను తొలగించినట్లు ఆయన తెలిపారు.



# స్థానికం
REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## ఫైన్ హైస్కూల్ విద్యార్థులకు అభినందన



**ప్రజాపక్షం / వరంగల్ టౌన్:** తాళ్ళ పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్స్ ఆధ్వర్యంలో ఇంటర్ స్కూల్ క్రికెట్ ఛాంపియన్ షిప్ లో భాగంగా జరిగిన టిపిఎస్ టి10 క్రికెట్ ఛాంపియన్ షిప్ 2025 ను హంటర్ రోడ్ ఫైన్ హైస్కూల్ కైవసం చేసుకుంది.హనుమకొండ, వరంగల్ లో గల ప్రముఖ 24 కార్పొరేట్ పాఠశాలలు పోటీలో పాల్గొనగా, ఫైనల్ మ్యాచ్ లలో విజయం సాధించి ఛాంపియన్ షిప్ ను, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ ను తన ఖాతాలో వేసుకుంది. అలాగే ఈ పోటీలో ఫైన్ హైస్కూల్ రాంనగర్ హనుమకొండ రన్నరప్ గా నిలిచింది. విద్యా సంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థుల శ్రమ, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి ఇవన్నీ విజయానికి కారణాలయ్యాయని అన్నారు. ఫైన్ హై స్కూల్ హంటర్ రోడ్ ప్రిన్సిపల్ పి.రిశాల్, పిఈటి వినోద్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



## అలరిస్తున్న నవచేతన పుస్తక ప్రదర్శన

**ప్రజాపక్షం/హనుమకొండ :** హనుమకొండ మెన్ రోడ్ అశోక కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన నవచేతన (విశాలాంధ్ర) పుస్తక ప్రదర్శన పలువురిని విశేషంగా ఆకర్షిస్తున్నది. ఈ నెల 5న ప్రారంభమైన ఈ పుస్తక ప్రదర్శన నిర్విరామంగా పాఠకుల ఆదరణతో కొనసాగుతున్నది. గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ పుస్తక ప్రదర్శన ప్రముఖ రచయితల పుస్తకాలు ప్రదర్శనకు పెట్టారు. వరంగల్ మహానగరంలోని పలువురు రచయితలు, మేధావులు, విద్యార్థులు, వివిధ విద్యా సంస్థల ప్రతినిధులు సందర్శించి పుస్తకాలను విరివిగా కొనుగోలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నవచేతన హనుమకొండ బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు మాట్లాడుతూ ఈ పుస్తక ప్రదర్శన ఈ నెలాఖరు వరకూ కొనసాగుతుందని తెలిపారు. ప్రముఖ ప్రచురణ సంస్థల, కవులు, రచయితల పుస్తకాలు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. ఈ పుస్తక ప్రదర్శనలో గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యేకంగా 10 నుండి 40 శాతం తగ్గింపు ధరలతో పుస్తకాలను విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రంథాలయాలు, పాఠశాలలు, కళాశాలల వారు, పుస్తక ప్రియులు అందరూ ఈ పుస్తక ప్రదర్శనను సద్వినియోగము చేసుకోవాలని ఆయన కోరారు.

## ఫోరెన్సిక్ విభాగం మరింత బలోపేతం



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** నేరానికి సంబంధించి సంఘటన స్థలంలో నిందితులను గుర్తించడంతో పాటు సాక్ష్యాధారాలను సేకరించే ఫోరెన్సిక్ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఫోరెన్సిక్ విభాగం వరంగల్ పోలీస్ కమిషనరేట్ నూతనంగా మొబైల్ ఫోరెన్సిక్ రెండవ వాహనాన్ని అందజేసారు. ఈ వాహనాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ శనివారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రస్తుతం అందుబాటులో వున్న పరిజ్ఞానాన్ని వినియోగించుకొని. అత్యాధునిక పరికరాలతో రూపొందించబడిన ఈ మొబైల్ ఫోరెన్సిక్ వాహనాని వరంగల్ కమిషనరేట్ పోలీసులకు మరింత మెరుగైన సేవలందించనున్నది. మొబైల్ వాహనం లో విధులు నిర్వహించేందుకు ఆరుగురు పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందజేయడం జరిగిందని సీపీ తెలియజేసారు.ఈ కార్యక్రమం డిసిపి అంకిత్ కుమార్,గుణ శేఖర్, అదనపు డిసిపిలు రవి, ప్రభాకర్, శ్రీనివాస్ తో పాటు ఏసీపీ లు, ఆర్. ఐ లు, ఫింగర్ ప్రింట్ ఇన్స్ స్పెక్టర్లు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నిరాశ్రయుల సమాచారం నమోదు

### బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** పట్టణ నిరాశ్రయుల సమాచారాన్ని పక్కాగా నమోదు చేయాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. పట్టణ నిరాశ్రయులను గుర్తించడానికి కొనసాగుతున్న సర్వేతో పాటు రాత్రి కొనసాగుతున్న స్వీపింగ్ మిషన్ల పనితీరును పరిశీలించి సమర్థవంతంగా చేపట్టుటకు సూచనలు చేశారు. పట్టణ నిరాశ్రయులను గుర్తించడానికి సర్వే కొనసాగుతున్న దృష్ట్యా హన్మకొండ చౌరస్తా వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో కమిషనర్ సర్వే నిర్వహణ తీరును పరిశీలించి మాట్లాడుతూ ఆవాసం లేకుండా ఉన్న వారిని సర్వేలో నమోదు చేయడంతో పాటుబల్దియా నిర్వహిస్తున్న షెల్టర్ హోమ్లకు తరలించాలని అధికారులను ఆదేశించారు.ప్రతాప్ నగర్లో గల నిరాశ్రయ కేంద్రాన్ని కమిషనర్ తనిఖీచేశారు. స్వీపింగ్ మిషన్ల పనితీరును పరిశీలించారు.స్వీపింగ్ మిషన్ల సామర్థ్యం పెంచాలని అధికారులను ఆదేశించారు. సిఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డిఎఫ్ఓ శంకర్ లింగం, డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, సానిటరీ సూపర్వైజర్ గోల్కొండ శ్రీను, టిఎంసి రమేష్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఉపఎన్నిక వచ్చినా నేనే గెలుస్తా..

### ఎమ్మెల్యే కడియం శ్రీహరి



**ప్రజాపక్షం/ధర్మ సాగర్ :** ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల గ్రామ శివారులో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న యూనిసిటీ వెంచర్ అభివృద్ధి, బిటి రోడ్డు నిర్మాణానికి 10కోట్ల రూపాయలతో చేపట్టనున్న పనులకు వరంగల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కడియం కావ్య, మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ వరంగల్ నగర అభివృద్ధికి ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అందరి సహకారంతో నగరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నగరానికి ఎయిర్ పోర్ట్, కోచ్ ఫ్యాక్టరీ, టెక్స్ టైల్ పార్క్, స్పోర్ట్స్ స్కూల్ తో పాటు నగర అభివృద్ధి, నగర ప్రజల ఎన్నో ఏళ్ల కల అయినటువంటి అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు 4వేల కోట్లు మంజూరు ఇప్పించినట్లు అన్నారు. అనంతరం ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ అభివృద్ధి పనులు చేపట్టడం పట్ల నియోజకవర్గ ప్రజల పక్షాన కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డికి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ కి అభినందనలు తెలిపారు. వెంచర్ వరకు నిర్మించే నాలుగు లైన్ల బిటి రోడ్డును ఉనికిచర్ల గ్రామం వరకు పొడిగించాలని కోరారు. ఇదే ప్రాంతంలో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం నిర్మించాలని అన్నారు. బిసిసిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు కాబోతున్న క్రికెట్ స్టేడియం తో గణనీయమైన అభివృద్ధి జరుగును తెలిపారు. అలాగే భవిష్యత్ లో ఈ రూరా రిని ఉనికిచర్ల నుండి రాపాకపల్లి, దేవునూరు గుట్టల వరకు నిర్మించనున్నట్లు తెలిపారు. దేవునూరు గుట్టలను ఎకో టూరిజం స్పాట్ గా అభివృద్ధిచేసేందుకు ప్రణాళికలుచేస్తున్నట్లు తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

**స్పీకర్ నిర్ణయం బట్టే తన నిర్ణయం : కడియం**

స్పీకర్ నిర్ణయం బట్టే తన నిర్ణయం ఉంటుందనిఎమ్మెల్యేకడియం శ్రీహరి స్పష్టం చేశారు. నవంబర్ 23లోపు పార్టీ ఫిరాయింపుల ఆరోపణలపై వివరణ ఇవ్వాలని స్పీకర్ నోటీసులు ఇచ్చారని దానిపై మరింత సమయం కావాలని స్పీకర్ ని కలిసి కోరడం జరిగిందని తెలిపారు. దీనిపై స్పీకర్ సానుకూలంగా స్పందించారని అన్నారు. గత 10ఏళ్లలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం అధికార పార్టీలో ఉండి కూడా ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని అన్నారు. ప్రజలకు హామీలకు, నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పని చేస్తున్నట్లు వెల్లడించారు. అందులో భాగంగానే నియోజకవర్గ అభివృద్ధికి 14కోట్ల నిధులు తీసుకురాగలిగానని పేర్కొన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్న రెండు పర్యాయాలలో చాలా మంది ఎమ్మెల్యేలు పార్టీ మారారని, అందులో కొంత మందికి మంత్రి పదవులు సైతం కట్టబెట్టారని ధ్వజమెత్తారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించిందే కేసీఆర్ అని ఆరోపించారు. వాళ్ళు చేస్తే సంసారం.... వేరే వాళ్ళు చేస్తే వ్యభిచారమా అని ప్రశ్నించారు. ఒక వేళ ఉప ఎన్నికలు వచ్చినా పోటీ చేసేది కడియం శ్రీహరే... ప్రజలు గెలిపించేది కడియం శ్రీహరినే అని ధీమా వ్యక్తం చేశారు.కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చాహత్ బాజ్ పై, కుడా అధికారులు,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చిన్న కాళేశ్వరం భూసేకరణ పనులు వేగవంతం : కలెక్టర్ రాహుల్శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** చిన్న కాళేశ్వరం భూసేకరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు పంట కాలువలకు భూసేకరణ, ఎంజాయ్ మెంట్ సర్వే ప్రగతిపై శనివారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్, మెగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పంట కాలువల నిర్మాణానికి ఎంత భూమి అవసరం ఉంది, ఎంత మంది రైతుల భూములు కోల్పోతున్నారు, ఎన్ని ఎకరాలు అవసరం అవుతుందనే అంశాలను సమగ్రంగా వివరించారు. ప్రాజెక్టు ప్రగతిపై ప్రతి వారం సమీక్ష ఉంటుందని గత వారం సమీక్షలో చేసిన సూచనల మేరకు, ఈ వారం వరకు సాధించిన పురోగతిని సమీక్షించారు. సర్వేలో ప్రభావిత గ్రామాలు, సర్వే నంబర్లు, రైతుల వారీగా భూ వివరాలు, పంటల సాగుపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పంట కాలువల నిర్మాణానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగంగా సాగేందుకు, అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎస్డీసి రమేష్, ఇరిగేషన్, మహదేవపూర్, కాటారం, మల్హర్, మహా ముత్తారం మండలాల తహసీల్దార్లు, మెగా కంపెనీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుడు రాజయ్య మృతి.. కలెక్టరేట్ ఎదుట ధర్నా



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** విధులు నిర్వహిస్తూ మున్సిపల్ కార్మికుడు మృతి చెందిన సంఘటన శనివారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కృష్ణకాలనీలో చోటుచేసుకుంది. మృతుడి కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం భూపాలపల్లి మున్సిపాలిటీలోనీ కృష్ణ కాలనీలో 6ఇంక్లైన్రోడ్ సమీపంలో శనివారం విధులు నిర్వహిస్తున్న బొల్లి రాజయ్య(45)అనే మున్సిపల్ కార్మికుడు విధులలో భాగంగా చెట్టు నరుకుతూకుప్పకూలిపడిపోయాడు. తోటి కార్మికులు రాజయ్యను ఆటోలో జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించగా వైద్యులుమృతి చెందినట్లు తెలిపారు.

**కలెక్టరేట్ అద్దాలు ధ్వంసం**

రాజయ్య బంధువులు కార్మికులు, సిపిఐఎం, సిపిఐ, బిఆర్ఎస్ నాయకులు మృతదేహంతో కలెక్టర్ కార్యాలయంలోకి దూసుకొచ్చినట్లు పోలీసులువెల్లడించారు. సమావేశ మందిరం అద్దాలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ డిమాండు చేశారు. ఆందోళనకారులను నిలువరించేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేశారు. సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి బందు సాయిలు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుడుదుల వెంకటేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గండ్ర హరీష్ రెడ్డి, టీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాడ హరీష్ రెడ్డి, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కొత్తూరి రవీందర్, లతోపాటు ప్రజా సంఘాల నాయకులు కలెక్టరేట్ ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ,అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డిఎస్పి సంపత్ రావు చర్చలు జరిపి లేబర్ ఆక్ట్ ప్రకారం మృతుని కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

## మావోయిస్టు నేత హిడ్మా వాల్పోస్టర్ కలకలం

**ప్రజాపక్షం/ వేలేరు :** ఇటీవలే ఎన్కౌంటర్లో మృతి చెందిన మావోయిస్టు అగ్ర నేత హిడ్మా మృతి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంఘటన విధితమే. శుక్రవారం వేలేరు మండలం సోడశపల్లిలోని క్యాతలిక్ చర్చ్ కాంపౌండ్కు ఇద్దరు వ్యక్తులు హిడ్మా ఫ్లెక్సీని ఏర్పాటు చేసి నివాళులర్పించిన సంఘటన ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే కలకలం రేపింది. వేలేరు మండలంలో నక్సలైట్లతో సత్ససంబందాలు కొనసాగుతున్నాయా అనేఅనుమానం మండల ప్రజలలో కలుగుతోంది.శుక్రవారం వేలేరు మండలానికి చెందిన ఎస్సై ఎ సురేష్ వివరాలప్రకారంసోడశపల్లిలో హిడ్మాచిత్రపటానికి గ్రామానికి చెందిన మ్యాక బుచ్చయ్య,కొయ్యడ సురేష్ నివాళులు అర్పించిన ఘటనను పోలీసులు నిర్ధారించారు. వేలేరు పోలీసులు రోజువారి విధినిర్వహణలో బాగంగా పెట్రోలింగ్ చేయుక్రమంలో సోడశపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు నివాళులు అర్పించారని, ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులపై కేసును మోదు చేయడం జరుగుతోందని తెలిపారు.

# పటేల్ కృషితోనే దేశంలో నేటికీ ఐక్యత

### మహారాష్ట్ర రాజ్యసభ సభ్యులు డాక్టర్ అనిల్ సుక్దేవరావు బోండే



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ కృషితోనే దేశం నేటికీ ఐక్యతతో ఉందని మహారాష్ట్ర రాజ్యసభ సభ్యులు అనిల్ సుక్దేవరావు బోండే అన్నారు. శనివారం మహబూబాబాద్ జిల్లా.ఎన్టీఆర్ స్టేడియం ప్రాంగణంలో కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు మై భారత్, ఎన్ఎస్ఎస్, ఎన్సిసి సంస్థల ఆధ్వర్యంలో సర్దార్@150 ఐక్యత పాదయాత్రను శనివారం మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియం నుండి కోర్టు సెంటర్ వరకు నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి రాజ్యసభ సభ్యులు అనిల్ సుగ్దేరావు బొండే, కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పి సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో (రెవెన్యూ) కె.అనిల్ కుమార్నివాళులర్పించారు. ఎంపీ మాట్లాడుతూ భారతదేశ భిన్నత్వంలో ఏకత్వం, విడివిడిగా ఉన్న భారతదేశంలో ఏకతాటిపై నడిపించిన గొప్ప మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆయన కొనియాడారు. నేటి యువతరం వారి అడుగుజాడల్లో నడవాలని, చెడు వ్యసనాలు,డ్రగ్స్ మహమ్మారికి దూరంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశంలో స్వేచ్ఛ కోసం తపించేవారని, ఎన్ని భాషలు మాట్లాడిన ఎన్ని ప్రాంతాలు ఉన్న మనమందరం ఒకటేనని చాటి చెప్పేవారని వివరించారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత కూడా సంస్థానాలుగా విడివిడిగా ఉన్న దేశాన్ని ఒక్కటి చేయడంలో సర్దార్ పటేల్ కృషి చేశారన్నారు. మేరా యువభారత్ వరంగల్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేష్, సూపరిండెంట్ బానోతు దేవిలాల్, డివైఎస్ఓ, ఓలేటి జ్యోతి, మదార్, మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, తహసీల్దారు రాజేశ్వరరావు, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, ప్రభుత్వంచే నామినేట్ చేయబడ్డ మెంబర్స్ సింగారపు సతీష్ , తాడపూర్ణ చందర్, ప్రేమ్ రాయుడు మై భారత్ వాలంటీర్లు, బానోతు వీరన్న నాయక్, బాదావత్ సురేష్ నాయక్, వెల్దండ సురేష్, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ విజయ, మహిళా సంఘ సభ్యులు, ప్రజా ప్రతినిధులు, సుమారు 1500 మందికి పైగా విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ

### నగర మేయర్ గుండు సుధారాణి



**ప్రజాపక్షం/ఖిలావరంగల్:** అండర్ గ్రౌండ్ లోని పైపులలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. శనివారం వరంగల్ పరిధి డి మార్ట్ ప్రాంతం వద్ద, పోచమ్మ మైదాన్ వద్ద పైప్లైన్ ఏర్పాటు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమర్థవంతంగా పూర్తి చేయుటకు అధికారులకు సూచనలు చేశారు. మేయర్ మాట్లాడుతూ వరంగల్ డిమార్ట్ ప్రాంతంలో అండర్ గ్రౌండ్లో ఉన్న పైప్లలో చెత్త చెదారం పేరుకుపోయి మురికి నీరు బయటకు వెళ్ళలేక రోడ్డు మీద డ్రైయినేజీ నీరు ప్రవహించడం తన దృష్టికి రావ దం జరిగిందని, ఇట్టి సమస్యకు పరిష్కారం చూపడానికి వీలుగా ఆ ప్రాంతంలో భూమి లోపల ఉన్న పైప్లలో పేరుకుపోయిన చెత్త చెదారాన్ని తొలగించి పరిష్కారం చూపడానికి హైదరాబాద్ నుండి బృందాన్ని పిలిపించి యంత్రాలద్వారా తొలగింపు చేపడతారని పైపుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తారని దీన వలన భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు తలెత్తవని అండర్ గ్రౌండ్లో గల పైపులలో ఉన్న చెత్తను తొలగించడానికి వరంగల్ ప్రాంతంలో దశలవారీగా చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మేయర్ అన్నారు. దేశాయిపేట ఫిల్టర్ బెడ్ నుండి పోచమ్మ మైదాన్ ప్రాంతంలో తరచుగా లీకేజిలు ఏర్పడడానికి 1950 సంవత్సరంలో వేసిన పైప్ లైన్ కారణమని, ఒక చోట లీకేజి అరికట్టగానే ఇదే ప్రాంతంలో మరో లీకేజిలు ఏర్పడుతున్నాయని ఇట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడానికి కొత్త పైప్లైన్ వేయడం జరుగుతుందని అన్నారు. ఎస్ఈ సత్యనారాయణ, డిఈ సతీష్, ఏఈలు హబీబ్, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలు మూసేయాలి

### వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాయినికి, కలెక్టర్కు వినతి




**ప్రజాపక్షం/కెయుక్యాంపస్:**హనుమకొండ జిల్లా కేంద్రంలో వామపక్ష విద్యార్థి సంఘాలైన ఎస్ఎఫ్ఐ, పిడిఎస్యు, ఎఐఎస్ఎఫ్, ఎఐఎఫ్డిఎస్, ఎఐఎస్బి, పిడిఎస్యు సంఘాల ఆధ్వర్యంలో శనివారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డికి,జిల్లా కలెక్టర్ స్నేహ శభరీష్కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ హనుమకొండ జిల్లా పరిధిలో ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించడంలేదు. జీవోలను తుంగలో తొక్కుతూ,అనుమతులు పొందిన పత్రాల ప్రకారం కాకుండా స్కూల్ బోర్డులపై ఐఐటి, నీట్, డి.జి, ఒలంపియాడ్, ఇటెక్నో, స్మార్ట్, ఇంటర్నేషనల్,పబ్లిక్, ప్రైమ్ లాంటి తోక పేర్లు తగిలించుకొని పాఠశాలలు నడుపుతూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ, అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. ఫీజుల పేరుతో తల్లిదండ్రులను దోచుకుంటున్నారు. ట్రస్ట్ లు, సొసైటీల పేరుతో నడిపే పాఠశాలల్లోఅధికారులు ఆడిట్ చేయకపోవడంతో కోట్ల రూపాయల బ్లాక్ దందాలకు యాజమాన్యాలు పాల్పడుతున్నారన్నారు. అడిట్ చేయించాలని డిమాండ్ చేశారు.టీచర్లకు పిఎఫ్. ఇ.ఎస్.ఐ కల్పించకుండా యాజమాన్యాలు మోసం చేస్తున్నాయన్నారు. పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు మొగిలి వెంకట్ రెడ్డి, ఏఐఎఫ్డిఎస్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున, ఏఐఎస్బి రాష్ట్ర కార్యదర్శి హకీమ్ నవీద్, ఏఐఎస్ఎఫ్ హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి భాషబోయిన సంతోష్, పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.నరసింహారావు,ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్,ఎ.ఐ.ఎఫ్.డి.ఎస్. హనుమకొండ జిల్లా కార్యదర్శి మాస్ సావిత్రి, అధ్యక్షులు స్టాలిన్, పిడి ఎస్యు హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రంజిత్, అధ్యక్షులు వంశీ,ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జ జ్యోతి పాల్గొన్నారు.

# మరికొంత గడువు!

స్పీకర్ను సమయం కోరిన కడియం
అభివృద్ధి కోసమే కాంగ్రెస్తో కలిసి పనిచేస్తున్నా

### రాజీనామా చేయను.. స్పీకర్ నిర్ణయానికి కట్టుబడి ఉంటా : ఎమ్మెల్యే కడియం శ్రీహరి





**ప్రజాపక్షం/జనగామ/హనుమకొండ:** స్టేషన్ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీ ఫిరాయింపుపై స్పీకర్ను మరికొంత సమయం కోరారు. ఈ నెల 23లోపు ఎమ్మెల్యేల అనర్హతపై సభాపతికి వివరణ ఇవ్వాల్సి ఉండగా మరికొంత సమయం కోరడం చర్చనీయాంశంగా మారింది. పైగా తాను రాజీనామ చేయను..చేస్తానని చెప్పానా అంటూనే స్పీకర్ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెబుతున్నారు. దీనితో పాటు తన నియోజకవర్గం స్టేషన్ఘనపూర్ అభివృద్ధి కోసమే కాంగ్రెస్లో కలిసి పని చేస్తున్నానంటున్నారు. ఈ పరిణామాల నేపధ్యంలో రాష్ట్రంలోనే స్టేషన్ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పార్టీ పిరాయింపు విషయం చర్చనీయాంశంగా మారింది.స్టేషన్ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అపర రాజకీయ చాణిక్యుడనే చెప్పాలి. ఎన్టిఆర్తో కలిసి పనిచేసిన ఆయన చంద్రబాబునాయుడుతోనూ సన్నిహితంగా ఉన్నాడు. రాజకీయ పరిణామాలు, తెలంగాణ ఏర్పాటు క్రమంలో బిఆర్ఎస్లో చేరారు. వరంగల్ పార్లమెంట్ సభ్యుడిగా గెలుపొందిన ఆయనను కేసీఆర్ తన మంత్రివర్గంలోకి తీసుకొని ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చారు. 2023లో బిఆర్ఎస్ నుండి స్టేషన్ఘనపూర్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. తదుపరి వచ్చిన పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తన కూతురుకడియంకావ్యకుకాంగ్రెస్ ఎంపి టిక్కెట్టు దక్కగా అమెకు మద్దతుగా పనిచేశారు. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సమక్షంలోనే చేరి తాను స్టేషన్ఘనపూర్ అభివృద్ధి కోసమే పార్టీలో చేరినట్లు చెప్పారు. అభివృద్ధి కోసం వెయ్యి కోట్లు మంజూరు చేయించి స్టేషన్ఘనపూర్లో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డితో సభ నిర్వయించారు. పార్టీ ఫిరాయింపులపై బిఆర్ఎస్ కోర్టులో కేసు వేయగావిచారణజరుగుతున్న క్రమంలో కడియం రాజీనామాకు సైతం సిద్దమైనట్లు ప్రచారం జరిగింది. కానీ రాజీనామా చేయలేదు. ఇప్పటికీ ఆయన రాజీనామ చేస్తానని చెప్పడం లేదు. దీనితో ఏం జరుగుతుందన్న ఆసక్తి నెలకొంది.

**సభాపతి ఇచ్చిన గడువులోపు వివరణ ఇస్తా**

సభాపతి ఇచ్చిన గడువులోపు వివరణ ఇస్తానని చెబుతున్న కడియం మరికొంత సమయం కావాలని కోరుతానని తానే చెబుతున్నారు. ఒక వైపు వివరణ ఇస్తానంటూనే మరో వైపు సమయం కావాలంటున్నారు. దీనిపై స్పీకర్ ఎలా స్పందిస్తారన్నది చూడాలి. ఇక కడియం శ్రీహరి ఎక్కడా ఆవేశ పడడం లేదు. తాను నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్తో కలిసి పనిచేస్తున్నాని చెబుతున్న కడియం ఆ ఆపార్టీలో చేరినట్లు మాత్రం చెప్పడం లేదు. ఇక స్పీకర్ అనర్హత వేటు వేస్తే ఆయన పోటీ చేయడానికి సైతం సిద్దంగా ఉన్న పరిస్థితి.

**ఉప ఎన్నిక వస్తే పోటీ చేస్తా..గెలుస్తా**

స్పీకర్ తీసుకునే నిర్ణయంతో ఉప ఎన్నిక వస్తే పోటీ చేస్తా..మళ్లీ తానే గెలుపొందుతానని కడియం శ్రీహరి చెబుతున్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ స్పీకర్ను గడువు కోరుతున్న మాట వాస్తమే అన్నారు. అయినా స్పీకర్ తీసుకునే నిర్ణయానికి కట్టుబడి ఉంటానని చెబుతున్నారు. ఉప ఎన్నిక వస్తే తానే పోటీ చేస్తానని..మళ్లీ తానే గెలుస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాలు, కడియం వాఖ్యల్ని చూస్తే స్పీకర్ వేటు వేసే అవకాశాలతో పాటు స్టేషన్ఘనపూర్కు ఉప ఎన్నిక వచ్చే అవకాశాలు సైతం లేకపోలేదనే చెప్పాలి.

## ఆడబిడ్డలకు పుట్టింటి కానుకగా ఇందిరమ్మ చీరలు



### మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకర టిఎస్

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:** గోవిందరావుపేట మండలంలోని రైతు వేదికలో మండల పరిధిలోని మహిళా సంఘాలకు శనివారం రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీ ణ అభివృద్ధి గ్రామీణ నీటి సరాఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి లతో కలిసి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు అనంతరం గోవిందరావుపేట మండలంలోని మహిళా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా రెండు వందల ఎనభై మూడు సంఘాలకు ఇరువై తొమ్మిది కోట్ల ఎనభై ఆరు లక్షల యాభై వేల రూపాయల ఋణాల పంపిణీ చెక్కును మంత్రి సీతక్క అందచేశారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇదిలా ఉండగా ఈ కార్యక్రమంలో డిఆర్ డిఓ శ్రీనివాస్ రావు ప్రజా ప్రతినిధులు మహిళా సంఘాల సభ్యులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రీల్



## 'ప్రేమంటే' సక్సెస్ మీట్

ప్రియదర్శి లేటెస్ట్ బ్లాక్ బస్టర్ ప్రేమంటే. ఆనంది హీరోయిన్ గా నటించింది. సుమ కనకాల ఒక ముఖ్యమైన పాత్ర చేశారు. నవనీత్ శ్రీరామ్ డైరెక్టర్. పుస్కూర్ రామ్ మోహన్ రావు, జాన్వీ నరంగ్ నిర్మాణంలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్పీ బ్యానర్‌పై నిర్మించిన చిత్రాన్ని రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ప్రజెంట్ చేసింది. దివంగత నారాయణ్ దాస్ నారంగ్‌కి ట్రిబ్యుట్‌గా నిలిచే ఈ చిత్రానికి ఆదిత్య మెరుగు సహ నిర్మాత. 21న విడుదలైన ఈ సినిమా అద్భుతమైన రెస్పాన్స్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో ప్రియదర్శి మాట్లాడుతూ.. ఇంత మంచి సూపర్ హిట్ సినిమా ఇచ్చినందుకు ప్రేక్షకులకు థాంక్యూ వెరీ మచ్. మా నిర్మాతలకు డైరెక్టర్‌కి టీం అందరికి థాంక్యూ. సినిమాకు వచ్చిన రెస్పాన్స్ నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. సినిమాని మీ అందరూ అప్రిషియేట్ చేస్తున్నందుకు థాంక్యూ వెరీ మచ్. డైరెక్టర్ నవనీత్ శ్రీరామ్ మాట్లాడుతూ.. సినిమాకి ఆడియన్స్ ఇచ్చిన రెస్పాన్స్ అదిరిపోయింది. ప్రతి చోట ఎంజాయ్ చేస్తున్నారు. డైరెక్టర్ కావాలనేది నా డ్రీమ్. అది ఈరోజు తీరినందుకు చాలా ఆనందంగా ఉంది. ఆడియన్స్ చాలా క్లీన్ సినిమా అనే ఫీడ్‌బ్యాక్ ఇస్తున్నప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. ఫ్యామిలీ, యూత్ నుంచి వస్తున్న రెస్పాన్స్ చాలా ఆనందాన్ని ఇచ్చింది. ప్రియదర్శిగారు ఆనంద్ పర్ఫామెన్స్‌కి అద్భుతమైన రెస్పాన్స్ వస్తుంది. మీరందరూ కూడా సినిమాని థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను అన్నారు.



## 'ఛాంపియన్'లో అనస్వర గ్లింప్స్



యంగ్ హీరో రోషన్ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా 'ఛాంపియన్'తో అలరించబోతున్నారు. జాతీయ అవార్డు గ్రహీత ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్నారు. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమాస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిలమ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన క్యారెక్టర్ బేస్డ్ గ్లింప్స్ విడుదల చేశారు. టీజర్ ప్రేక్షకులను మైఖేల్ సి విలియమ్స్ వరల్డ్‌ని పరిచయం చేయగా, ఫస్ట్ సింగిల్ గిర గిర గింగిరాగిరే ప్రోమో అనస్వర రాజన్ పోషించిన చంద్రకళని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. గ్లింప్స్‌లో చంద్రకళని ఓ ధైర్యసాహసాలున్న పల్లెటూరి అమ్మాయిగా పరిచయం చేశారు.

## నా సినిమాల్లో ఏదో ఒక సందేశం ఉంటుంది

### 'అఖండ- 2' కన్నడ ట్రైలర్ విడుదలలో బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం 'అఖండ–2: తాండవం'. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఎస్.థమన్ సంగీతం అందించారు. కర్నాటకలో ట్రైలర్ ఆవిష్కరణ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. కన్నడ సూపర్ స్టార్ డాక్టర్ శివరాజ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ.. మా నాన్న, ఇటు కన్నడకు రాజ్ కుమార్ వాళ్లు చేయని పాత్ర లేదు. శివరాజ్ కుమార్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళుతున్న శివన్నకు ఆశీర్వాదం అందిస్తున్నాను. అఖండ కేవలం తెలుగు సినిమా కాదు కన్నడ సినిమా కాదు ఇది పాన్ ఇండియా సినిమా. కరోనాలో అందరూ భయపడుతున్న సమయంలో మొట్టమొదటి భారతీయ చిత్రంగా ఆ సమయంలో అఖండ చిత్రాన్ని విడుదల చేశాం. ఆ తర్వాత మిగతా సినిమాలన్నీ రిలీజ్ అయ్యాయి. ఆ సినిమాలో పిల్లలు ప్రకృతి ధర్మం జోలికి వస్తే భగవంతుడు మనుషులకి ఆవహిస్తాడు అని చూపించడం జరిగింది. యువత మీరందరూ మంచిదారిలో నడవడానికి నా ప్రతి సినిమాలో ఏదో ఒక సందేశం ఉంటుంది. ఈ సినిమా ఎంత అద్భుతంగా ఉండబోతుందో మీరు చూస్తారు అని అన్నారు. కన్నడ సూపర్ స్టార్ డాక్టర్ శివరాజ్ కుమార్ అఖండ–2 ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి రావడం చాలా ఆనందంగా ఉంది. మేము ఒకే కుటుంబం. మేమిద్దరం బ్రదర్స్ లాగే ఉంటాము. బాలయ్య నటన డైలాగులు యాక్షన్‌లో ఒక అద్భుతమైన ఎనర్జీ ఉంటుంది. రాజకీయాల్లో కూడా అద్భుతంగా రాణిస్తున్నారు. ఇంత వర్షంలో కూడా అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఈ వేడుకలో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. మీ అభిమానానికి ఆ వర్షం కూడా ఆగింది. ఈవెంట్ అద్భుతంగా జరిగింది. మీ అందరి ప్రేమ నమ్మకానికి ఎల్లప్పుడూ కృతజ్ఞతతో ఉంటాం. డిసెంబర్ 5న తప్పకుండా ఈ సినిమా మీ అందరిని ఎంతగానో అలరిస్తుంది.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బోయపాటి శ్రీను, నటుడు ఆది పినిశెట్టి, హీరోయిన్ సంయుక్త, నిర్మాత గోపి ఆచంట తదితరులు పాల్గొన్నారు.



## 'మా చిన్ని శివ' పాట ఆవిష్కరణ

ప్రముఖ సంగీత దర్శకురాలు ఎంఎం శ్రీలేఖ స్వరపర్చి పాడిన మా చిన్ని శివ డివోషనల్ వీడియో సాంగ్ లాంచ్ ఈవెంట్ హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని మా చిన్ని శివ సాంగ్ ను విడుదల చేశారు. ఈ పాటను జి. మణి లక్ష్మణరావు ప్రొడ్యూస్ చేశారు. భారతి బాబు లిరిక్స్ అందించగా శ్రీరామ్ కంగటాల డీవోపీ, ఎడిటింగ్‌తో పాటు దర్శకత్వ బాధ్యతలు వహించారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం శ్రీలేఖ మాట్లాడుతూ నేను గతంలో శివుడి డివోషనల్ సాంగ్స్ చేశాను. శివుడి పాటలు వైబ్రెంట్‌గా మంచి సౌండింగ్‌తో ఉంటాయి. ప్రొడ్యూసర్ మణి లక్ష్మణరావు ఈ పాట కోసం డిఫరెంట్ కాన్సెప్ట్ ఆలోచించి చెప్పినప్పుడు కొత్తగా అనిపించింది. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ జి.మణి లక్ష్మణరావు, గేయ రచయిత భారతి బాబు, నటి ప్రియ జాస్పర్, డైరెక్టర్ రామ్ గణపతి పాల్గొన్నారు.




## 'పాంచ్ మినార్' సక్సెస్ మీట్



యంగ్ టాలెంటెడ్ రాజ్ తరుణ్ హీరో ఫన్ టాస్టిక్ బ్లాక్ బస్టర్ 'పాంచ్ మినార్'. రామ్ కడుముల దర్శకత్వంలో రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్‌లో రాశి సింగ్ హీరోయిన్‌గా నటించింది. గోవింద రాజు ప్రజెంట్ చేసిన ఈ చిత్రాన్ని కనెక్ట్ మూవీస్ బ్యానర్‌పై మాధవి, ఎంఎస్ఎం రెడ్డి నిర్మించారు. 21న విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బ్లస్టర్ రెస్పాన్స్‌తో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా సక్సెస్ మీట్ నిర్వహించారు. హీరో రాజ్ తరుణ్ మాట్లాడుతూ.. ఈ సినిమాకి మీడియా వారు ఇస్తున్న సపోర్ట్‌కి థాంక్యూ. శ్రీనివాస్ రెడ్డికి నేను ఫ్యాన్ బాయ్. ఆయనతో కలిసి పనిచేసిన అవకాశం రావడం చాలా ఆనందంగా ఉంది. ఆయన వెంకీ సినిమాకి ఇప్పటికీ ఒకేలా ఉన్నారు. శేఖర్ చంద్ర అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. మా ప్రొడ్యూసర్ మాధవికి మంచి సినిమా చేయాలని తపన కథ మీద ఉన్న నమ్మకం, మా డైరెక్టర్ పడ్డ కష్టం, ఈ సినిమాకి ఏదైనా తెచ్చి పెట్టాలని మా గోవిందరాజు ఆయనపై వేసుకున్న భారం.. ఇవన్నీ కలిసి నాకు దొరికిన అదృష్టం పాంచ్ మినార్. చూసిన ప్రేక్షకులందరికీ థాంక్యూ వెరీ మచ్. హీరోయిన్ రాశి సింగ్ మాట్లాడుతూ.. సినిమాకి ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ ఉంది. నిన్న దేవి థియేటర్‌కి వెళ్ళాను. సినిమా చూసినోళ్లు అందరు కూడా చాలా ఎంజాయ్ చేస్తున్నారు. ప్రొడ్యూసర్ మాధవి మాట్లాడుతూ.. ఇది కంప్లీట్‌గా ఫ్యామిలీ ఎంటర్టైనర్. తప్పకుండా థియేటర్స్‌లో చూడండి. రెండు గంటల పాటు నాన్ స్టాప్ నవ్వులు ఎంజాయ్ చేస్తారు. గోవిందరాజుకి చాలా థ్యాంక్స్. ఈ సినిమా ఈరోజు ఈ స్టేజ్‌కి వచ్చిందంటే కారణం ఆయనే. రాజ్ తరుణ్ మిగతా అందరు కూడా చాలా అద్భుతంగా నటించారు. డైరెక్టర్ ప్రతి క్యారెక్టర్ చాలా చక్కగా తీర్చిదిద్దారు. తప్పకుండా ఈ సినిమా అందరూ థియేటర్స్‌లో చూడాలని కోరుకుంటున్నాను అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో గోవిందరాజు, డైరెక్టర్ రామ్, మ్యూజిక్ డైరెక్టర్ శేఖర్, నటుడు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## త్రీ రోజెస్–2 ట్రైలర్ రిలీజ్



ఈషా రెబ్బా, సత్య, హర్ష చెముడు, ప్రిన్స్ సిసిల్, హేమ, సత్యం రాజేశ్, కుషిత కల్లపు ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'త్రీ రోజెస్'. ఆహా ఓటీటీలో సూపర్ హిట్టయిన ఈ సిరీస్ సీజన్ 2 డిసెంబర్ 12వ తేదీ నుంచి స్ట్రీమింగ్‌కు రెడీ అవుతోంది. ఈ సిరీస్‌ను మాస్ మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఎస్‌కేఎన్ నిర్మిస్తున్నారు. డైరెక్టర్ మారుతి షో రన్నర్‌గా వ్యవహరిస్తున్నారు. రవి నంబూరి, సందీప్ బొల్ల రచన చేయగా.. కిరణ్ కె కరవల్ల దర్శకత్వం వహించారు. హైదరాబాద్‌లో జరిగిన ఈవెంట్‌లో 'త్రీ రోజెస్' సీజన్ 2 టీజర్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మాట్లాడుతూ 'త్రీ రోజెస్' కాన్సెప్ట్‌తో ఎన్ని సిరీస్‌లు అయినా చేయొచ్చు. అలాంటి యూనిక్ కాన్సెప్ట్ మారుతి ఇచ్చారు. టాక్సీవాలా మూవీ చేశాక ఓటీటీలో ఏదైనా కంటెంట్ ప్రొడ్యూస్ చేసేందుకు కావాల్సినంత కాన్ఫిడెన్స్ ఇచ్చింది 'త్రీ రోజెస్'. ఈ కార్యక్రమంలో ఆహా కమర్షియల్ హెడ్ రాజేశ్ వాసిరెడ్డి, ఆహా కంటెంట్ హెడ్ కవిత, రైటర్ సందీప్ బొల్ల, యాక్టర్ సూర్య శ్రీనివాస్, డైరెక్టర్ కిరణ్ కె కరవల్ల, హీరోయిన్ కుషిత కల్లపు, హీరోయిన్ రాశీ సింగ్, హీరోయిన్ ఈషా రెబ్బా పాల్గొన్నారు.

## 'మోహన రాగ' మ్యూజిక్ సంస్థ ప్రారంభం




రాకింగ్ స్టార్ మంచు మనోజ్ తన కొత్త మ్యూజిక్ లేబుల్ 'మోహన రాగ' ప్రారంభించారు. లోకల్ హార్ట్స్, గ్లోబల్ బీట్ అనే క్యాప్షన్‌తో మన సంగీతాన్ని వరల్డ్ వైడ్ రీచ్ చేసేందుకు మోహన రాగ మ్యూజిక్ లేబుల్‌తో తనదైన ప్రయత్నం చేయబోతున్నారు మంచు మనోజ్. సోషల్ మీడియా ద్వారా మంచు మనోజ్ ఈ ప్రకటన చేశారు. సంగీతం మీద తనకున్న ప్రేమే మోహన రాగ మ్యూజిక్ లేబుల్ స్థాపించేలా స్ఫూర్తినిచ్చిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఫ్రెష్ సౌండ్స్, బోల్ టాలెంట్, ఫియర్ లెస్ క్రియేటివిటీ తమ మ్యూజిక్ లేబుల్ ద్వారా సంగీత ప్రపంచానికి పరిచయం చేస్తామని మంచు మనోజ్ తెలిపారు.

## 'రాజు వెడ్స్ రాంబాయి' రూ.1.47 కోట్ల గ్రాస్ వసూళ్లు




అఖిల్ రాజ్, తేజస్విని జంటగా నటించిన 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా ప్రేక్షకుల ముందుకొచ్చి ఘన విజయాన్ని దక్కించుకుంది. హార్ట్ టచింగ్ లవ్ స్టోరీ అంటూ ప్రేక్షకులు, క్రిటిక్స్ ఈ సినిమాకు ప్రశంసలు అందిస్తున్నారు. ఈ సినిమా రెండు తెలుగు రాష్ట్రాల్లో మంచి ఓపెనింగ్స్‌తో బాక్సాఫీస్ జర్నీ మొదలుపెట్టింది. తొలి రోజు ఎపి, తెలంగాణలో ఈ సినిమాకు 1.47 కోట్ల రూపాయల గ్రాస్ వసూళ్లు దక్కాయి. డే 1 ట్రెండ్ చూస్తుంటే 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా మంచి వసూళ్లను దక్కించుకుంటుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి.'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాన్ని డా.నాగేశ్వరరావు పూజారి సమర్పణలో డోలాముఖి సుబల్టర్న్ ఫిలింస్, మాన్ సూన్స్ టైన్స్ బ్యానర్స్‌పై వేణు ఊడుగుల, రాహుల్ మోపిదేవి నిర్మించారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహించారు. వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్‌పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ ఈ సినిమాను థియేటర్‌లో విడుదల చేశారు.

## ధర్మభిక్షం పేరు

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి పొన్నం ప్రభాకర్, గౌరవ అతిథిగా సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి హాజరయ్యారు. సదస్సులో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గీత కార్మికులు కులవృత్తి రక్షణతోపాటు తమ పిల్లల విద్యాభ్యాసానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో తమ పిల్లలు నెగ్గేందుకు విద్య చాలా అవసరమని, ప్రతి తల్లిదండ్రులు కష్టపడి చెమటోడ్చుతూ తమ పిల్లలను చదివించాలని చెప్పారు. రాష్ట్ర మంత్రిగా తనవంతు బాధ్యతగా గీత కార్మికులకు ఎక్స్ గ్రేషియా, కాటమయ్య రక్ష, సంఘపరమైన భవనాలకు సంబంధించి అన్ని గౌడ కుల పెద్దలతో కలిసి అమలయ్యే విధంగా చూద్దామన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, తాను కలిసి ముఖ్యమంత్రితో మాట్లాడి ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటును త్వరలో పెట్టబోతున్నట్టు చెప్పారు. ఏ విషయంలోనూ నిరాశ చెందొద్దని, ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కల్లు గీత వృత్తి ప్రధానమైందని, కొన్ని ప్రాంతాల్లో గౌడ్‌లు కాకుండా ఇతర కులాల వారు కూడా కల్లు గీత వృత్తి చేస్తుండేవారన్నారు. బొమ్మగాని ధర్మభిక్షం పార్టీలు, కులాలకు అతీతంగా గీత పనివారల సంఘం స్థాపించి, గీత వృత్తి రక్షణకు పాటుపడ్డారని కొనియాడారు. గీత వృత్తి గ్రామీణ పరిశ్రమగా అభివృద్ధి చెందాలని గీత వారల సంఘం అనేక మార్గాలను ప్రభుత్వాలకు సూచించిందని తెలిపారు. కార్మికులకు కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇప్పించడంలో గీత పనివారల సంఘం కీలక పాత్ర పోషించిందన్నారు. సామాజిక చైతన్యం కలిగించడం కోసం సంస్కరణలు తీసుకురావటంలో, స్వాతంత్ర్య పోరాటంలో ధర్మభిక్షం కీలక పాత్ర పోషించారన్నారు. ధర్మభిక్షం చరిత్ర తెలుసుకుని సూర్యాపేట జిల్లాకు ఆయన పేరును పెట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు అనేక త్యాగాలు చేశారని, ఇదే మాదిరిగా నక్సలైట్లు కూడా త్యాగాలు చేసిన వారేనని పేర్కొన్నారు. ప్రజల ఆలోచనలో మార్పు వచ్చిందని, కాలం మారిందని, కమ్యూనిస్టులు మరింత బలోపేతం కావాలంటే మరింత ఐక్యత అవసరమన్నారు. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ గీత పనివారల కుటుంబాలకు రూ.13 కోట్ల ఎక్స్ గ్రేషియా బకాయిలను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గీత కార్మికులు వృత్తిలో ప్రమాదవశాత్తూ మరణించినా, అంగవైకల్యం చెందిన రూ.10 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని కోరారు. పెన్షన్‌ను రూ.5 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కల్లు వృత్తిలో హర్రాస్ విధానానికి వ్యతిరేకంగా, త్రివిధ పన్నులకు బదులుగా ఒకే పన్ను ఉండాలని ధర్మభిక్షం పోరాడారని గుర్తు చేశారు. ధర్మభిక్షం కలలు కన్న కల్లు గీత పారిశ్రామీకరణకు నీరా ప్రాజెక్టును ట్యాంక్ బండ్ వద్ద పెట్టారన్నారు. ఈ సమావేశంలో గీతపనివారల సంఘం ప్రధాన కార్యదర్శి డి.జి.సాయిలు గౌడ్, సమన్వయ కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం, ఉపాధ్యక్షులు కెవిఎల్, దూసరి శ్రీరాములు, పండ్ల రాములు, కార్యదర్శులు పబ్బారి దేవేందర్ గౌడ్, బొమ్మగాని శ్రీనివాస్, గౌడ్ సంఘం నేతలు అంబాల నారాయణగౌడ్, పల్లె వినయ్‌గౌడ్, కొండా కోటయ్య, వేణు, బొడిగె సైదులు, బంధం నాగేశ్వరరావు, నాగార్జున్, రవికిశోర్, గోపాల్, లక్ష్మయ్య, ధనుంజనయ్యగౌడ్, బొడ్డు రామచద్రుడు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్‌లకు మోడీ ప్రభుత్వం ఊడిగం

### నైజాంకు ముగింపు పలికినట్లే మోడీకి పలకడం ఖాయం

### సిపిఐ వందేళ్ల సభలో లక్షలాదిగా పాల్గొనండి

### సిపిఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు పశ్య పద్మ

**ప్రజాపక్షం/జనగామ :** మోడీ సారధ్యంలో నడుస్తున్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మోకరిల్లింది. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుంది. అందుకే నైజాంకు ముగింపు పలికినట్లే మోడీకి ముగింపు పలకాల్సిన అవసరం ఉందని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ అన్నారు. సిపిఐ వందేళ్ల సభలో లక్షలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ ఏర్పడి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఖమ్మంలో భారీ బహిరంగ సభ జరగనుండగా రాష్ట్రంలో చేపట్టిన ప్రచార జాతా శనివారం జనగామకు చేరుకుంది. ఈ సందర్భంగా చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం జరిగిన సభకు మాజీ ఎమ్మెల్యే, సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి అధ్యక్షత వహించగా పశ్య పద్మ ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడారు. 1917లో సోవియల్ రష్యాలో రాజరిక వ్యవస్థ కుప్పకూలిందన్నారు. 1925లో దేశంలో సిపిఐ ఏర్పడక ముందే ప్రపంచంలోని అనేక దేశాల్లో కమ్యూనిస్టు ప్రభుత్వాలు ఏర్పాడి ప్రజా పాలన సాగిందన్నారు. ప్రజలకు కావల్సిన అన్ని సమస్యలు తీరేవన్నారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడిన తరువాత అనేక పోరాటాలు జరిగాయని ఈ ప్రాంతంలో నైజాం నవాబుకు వ్యతిరేకంగా దున్నేవాడికే భూమి, భుక్తి, వెట్టి చాకిరి కోసం పోరాటం జరిగిందన్నారు. దీని మూలంగా నైజాం సంస్థానంతో పాటు దేశంలోనే 568 సంస్థానాలు విలీనం కాక తప్పలేదన్నారు. ప్రభుత్వంతో కొట్లాడి అనేక సంస్కరణలు తీసుకు వచ్చామని బ్యాంక్‌ల జాతీయకరణ, భూగరిష్ట చట్టం వంటివి తీసకురావడం జరిగిందన్నారు. భైరాన్‌పల్లి చరిత్ర తెలిస్తే ఆనాడు నైజాంకు వ్యతిరేకంగా ఎర్ర జెండా నీడలో ఎంత బలమైన పోరాటం జరిగిందో తెలుస్తుందన్నారు. గుతపలు, బరిసెలు, కొడవళ్లు పట్టుకొని రజాకార్లను ఎదిరించారన్నారు. భైరాన్‌పల్లిలో ఒకేసారి 88 మందిని నిలబెట్టి కాల్చి చంపిన చరిత్ర ప్రపంచ దేశాలకు విస్తరించిందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500 మంది చంపబడగా పది లక్షల ఎకరాల భూ పంపిణీ జరిగిందన్నారు. పరిశ్రమలు స్థాపించబడ్డాయని, పాఠశాలలు ఏర్పడ్డాయన్నారు. అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచినట్లు ఉచిత విద్య అందడం లేదన్నారు. గత పదేళ్లలో బిజెపి పాలనలో దేశం ఆగమైపోయిందని కోటీశ్వర్లు శతకోటీశ్వర్లు అవుతున్నారన్నారు. కోటీ ఉద్యోగాలు ఏమయ్యాయని పద్మ ప్రశ్నించారు. అందుకే మోడీని గద్దె దింపాలని, సిపిఐ వందేళ్ల పండుగకు భారీగా ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లాఖాద్రీ, తెలంగాణ రైతు సంఘం కోశాధికార డిజి నరేంద్రప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, మోటే శ్రీశైలం, వైకుంఠం, సఖి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## చోద్యం చూస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన సమయంలో ఏపిలో కలిపిన ఐదు గ్రామపంచాయతీలను తెలంగాణలో విలీనం చేయాలని, గోదావరి కరకట్టలను పటిష్ట పరిచి వరదబారి నుండి ఈ ప్రాంత ప్రజలను రక్షించాలని అన్నారు. ప్రశ్నించే వారిని నిర్బంధిస్తూ, వారి గొంతులను నొక్కే ప్రయత్నం పాలకులు చేయుట సిగ్గుమాలిన చర్య అన్నారు. సిపిఐ శతవసంత ఉత్సవాలను పురస్కరించుకుని ఆదిలాబాద్ జిల్లా జోడోఘాట్‌లో కోమరం భీమ్ విగ్రహానికి పూల మాలలు వేసిన అనంతరం ప్రారంభమైన ప్రచార జాత 12 జిల్లాల మీదుగా 35 నియోజకవర్గాల పరిధిలో కొనసాగి శనివారం భద్రాచలంలో ముగిసింది. ప్రచారజాత బృందం భద్రాచలం గోదావరి బ్రిడ్జీ సమీపానికి రాగానే సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి పూల మాలలు వేశారు. అనంతరం పట్టణ పురవీధుల్లో భారీ మోటార్ సైకిల్ ర్యాలీ సాగింది. అంబేద్కర్ విగ్రహంతో పాటు విప్లవ వీరుల విగ్రహాలకు పూల మాలలు వేసిన నాయకులు జోహార్లు అర్పించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా ఆటాపాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో భాగంగా స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జాతా ముగింపు సభలో చాడా, తక్కెళ్లపల్లి మాట్లాడారు. కేంద్రంలోని మోడీ సర్కార్ కులాలు, మతాలపేరుతో దేశంలో గందరగోళ వాతావరణాన్ని సృష్టిస్తోందని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని అమలు పర్చాల్సిన పాలకులు హిందుత్వ ఎజెండాను ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయోధ్యలో కోట్లాది రూపాయలు వెచ్చించి రామమందిరాన్ని నిర్మించిన నరేంద్రమోడి ప్రభుత్వం భద్రాచలం రామాలయాన్ని విస్మరించారన్నారు. అనంతరం సిపిఐ రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు కలివేన శంకర్, ఎం బాలనర్సింహా మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ ఓ పచ్చి బూటకం అని, ఎన్ కౌంటర్ల పేరుతో మావోయిస్టులను పట్టుకుని చిత్రహింసలకు గురిచేసి హతమారుస్తున్నారన్నారు. ఈ ఎన్‌కౌంటర్లపై సుప్రీం కోర్టు సుమోటోగా తీసుకుని న్యాయవిచారణ జరపాలని డిమాండ్ చేశారు. కమ్యూనిజాన్ని హత్యలు, నిర్భంధాలతో అడ్డుకోవడం ఎవరి తరం కాదని, అది అనునిత్యం ఉదయించే అరుణ వర్ణమన్నారు. మావోయిస్టులను చంపేందుకు డెడ్ లైన్ పెట్టిన కేంద్రం వారితో శాంతి చర్చలకు ఎందుకు ముందుకు రావడం లేదని ప్రశ్నించారు.



అనంతరం ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యానికి కమంటే ముందే ఆవిర్భవించిన సిపిఐ అంతరాలు లేని సమాజ స్థాపనే ధ్యేయంగా నాటి నుండి నేటి వరకు పోరాడుతూనే ఉందన్నారు. స్వదేశ కాంక్షను తొలూత ప్రజల్లో రగిలించింది సిపిఐ అని, స్వాతంత్ర్య సంగ్రామంలో ఎందరో యువకిశోరాలు ప్రాణతర్పణం చేశారని చెప్పారు. ఈ వందేళ్ల ప్రస్థానంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్న సిపిఐ ప్రజాక్షేత్రంలో సబ్బండ వర్గాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం మరింత ఎరుపెక్కిన పోరాటాలు చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి పాటుపడుతుందని, మరో వందేళ్లయినా ఇదే స్ఫూర్తి కొనసాగుతుందన్నారు. సిపిఐ శతవసంత ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉద్యమాల ఖిల్లా ఖమ్మం జిల్లా కేంద్రంలో డిసెంబర్ 26న ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ జరగబోతోందని, కనీవినీ ఎరుగని రీతిలో జరిగే ఈసభకు 45 దేశాల నుండి ప్రతినిధులు, దేశ విదేశాల నుండి కవులు, కళాకారులు, మేధావి వర్గ ప్రతినిధులు హాజరువుతున్నారని చెప్పారు. ఈ శతవసంత ఉత్సవ ముగింపు సభ విజయవంతానికి భారీ ఎత్తున ప్రజలను తరలించాలని, ఇందు కోసం పార్టీ నాయకులు,కార్యకర్తలు, సానుబూతి తిపరులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, మున్నా లక్ష్మీ కుమారి, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర, ఎస్‌డి సలీం, కమటం వెంకటేశ్వరరావు, చంద్రగిరి శ్రీనివాస్, వీశంశెట్టి పూర్ణ చంద్రరావు, కంచర్ల జమలయ్య, అడ్డగర్ల తాతాజీ, ఉప్పుశెట్టి రాహుల్, ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు పల్లె నర్సింహా, మారపాక అనీల్, కసిరెడ్డి మణికంఠా రెడ్డి, రెహమాన్, లక్ష్మీ నారాయణ, జిల్లాలోని మండలాల కార్యదర్శులు, జిల్లా సమితి సభ్యులు ప్రజా సంఘాల జిల్లా బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com